ఓ ప్రణయ సరస సల్లాపాల సుధామధుర హేల_

డా. కొర్రపాటి గంగాధరరావు నవల

# పతి పత్ని



# పతి పత్ని

సురేష్ రైల్వే స్టేషన్ చేరేటప్పటికే చాలా ఆలస్యమయింది. ఖంగారు పడ్తూ స్కూటర్ స్టాండ్ వేసి తాళం తిప్పి – గబగబా స్టేషన్‌లోకి పరుగెత్తాడు. "సర్కార్ వచ్చిందా?" అంటూ నలుగుర్ని గబగబా అడిగాడు కూడా!

"ఏ సర్కార్? – ఏరోజు సర్కార్? ఇవ్వాల్టిది వెళ్లి పోయింది. రేపటిది ఇవ్వాళ రాదు", అన్నాడొక చట్టి ముక్కు వెధవ పోర్టర్.

సర్కారు వచ్చింది. మరి కమల రాలేదా? సురేష్ ఆదుర్దా ఎక్కువైంది. కలియ వెతుకుతూనే – 'లేడీస్ వెయిటింగ్' రూం కెళ్లాడు. అక్కడ మనుషులున్నారు గానీ, అందరూ జంటలు జంటలుగానే వున్నారు. మరి కమల ఎక్కడ? ఎక్కడా కనబడలేదు కమల – ఆ ప్రక్క ప్లాట్ ఫారం చివరి దాకా వెళ్లాడు. అంతలో –

రెండవ ప్రక్క ప్లాట్ ఫారం వైపుకు పరుగెత్తుతున్నారు చాలా మంది – కాదు పందల మంది జనం . . . . .

"ఏమిటధి? ఎందుకు పరుగెత్తుతున్నారూ?"

"ఏమిటది? ఏమి జరిగింది?"

ఎవర్నో ఆపి అడిగాడు సురేష్.

"ఎవరో ఆడకూతురుట! ఆ చివరి ప్రక్క – అవతలలైను మీద – గూడ్సు క్రింద పడి చచ్చిపోయిందిట!"

గుండెలొక్కసారి గుభేల్ మన్నాయి సురేష్‌కి!

కమల కాదు గదా!!!

అందరితో బాటు తనూ పరుగెత్తాడు.

కొర్రపాటి గంగాధర రావు

తను ఒక నాగరికుడననీ - బాంక్ ఆఫీసర్‌ననీ మరిచిపోయి - పరుగెత్తాడు.

సూటూ బూటూ సంగతి మరచిపోయి పరుగెత్తాడు. దోవలో అడ్డంగా వున్న పాకేజీలను తప్పించుకుంటూ, తోటి వాళ్లను తోసుకుంటూ పరుగెత్తాడు.

"అది ఖర్మం జాలిక కమలగాదుగదా!" అనుకుంటూనే పరుగెత్తాడు. అప్పటికే పెద్ద గుంపు చేరి వున్నారక్కడ. అందర్నీ తోసుకుంటూ కొందర్ని తొలగించు కుంటూ, మధ్యలో శవాన్ని కళ్లారా చూసే దాకా గుండెలు తెగ కొట్టు కుంటూనే వున్నాయి.

"అమ్మయ్య ! కమల కాదు" అనుకున్నాడు శవాన్ని చూసి.

అయినా గుండె దడ ఆగలేదు.

ఆ మరణించిన మనిషి కమల కాదు. అయినా కమల వయసుదే. పద్దెనిమిదేళ్లుంటాయి. చక్కనమ్మే! చక్కనమ్మ చచ్చినా అందంగానే వుంటుందా?

మొహం మాత్రం అల్లా వుంది - ఇక తక్కిన శరీరం రూపు రేఖలు లేవు.

"రైలు క్రింద పడాలనే పడింది. అందాకా ఎదురు నడవటం నేను చూశాను" అన్నాడొక అనామకుడు.

"అంతే అయివుంటుంది." నిర్ధారణ చేశాడొక నిలుచున్నవాడు.

"అవిగో పుస్తెలు! పెళ్ళయిన పిల్లే!!"

"అయితే మొగుడు మీద అలిగిందన్నమాట".

"ఎంత అలిగితే మాత్రం - ఇంత ఘోరమైన చావు కోరుకుంటుందా ? ఏదో సున్నితంగా మెత్తని తాడుతో ఉరి పోసుకో కూడదూ ?"

"గట్టితాడు దొరికి వుండదు."

ఎవరి ఊహ వారిది. ఎవరి వేళాకోళం వారిది!

"కమల కాదుగా!" అని మరొకసారి సరిగా చూసి - సురేష్ కోలుకుంటున్న గుండెలతో వెనక్కి తిరిగి నడవసాగాడు.

"మరి కమల వచ్చిందా? రాలేదా రైల్లో - !

"వచ్చి ఊళ్లో కెళ్ల లేదు గదా?

స్టేషన్‌లోనే వుండి పొమ్మన్నానే? ఆ మాత్రం జ్ఞాపకం పెట్టుకుని ఉండదా?" . . .

"ఏమో?"

అతనికి అడుగులు పడటమే లేదా ఆలోచనల్తో!

స్టేషన్ మాష్టర్ గది గడిచింది.

టికెట్ కలెక్టర్ గదీ గడిచింది.

కాళ్లకి చేపల బస్తాలు అడ్డం వచ్చాయి.

లేడీస్ వెయిటింగ్ రూం - గడిచి నడిచాడు.



అప్పుడు వెనక నుంచి పిలుపు!

"ఏమండీ . . . ఏమండీ . . . సురేష్ " - పిలుస్తున్నది తననేనని అప్పటికి తెలిసి వచ్చింది.

వెనక్కి తిరిగి చూస్తే! . . .

ఎదురుగా కమల - నవ్వుతూ . . . .

మల్లె పువ్వులు అప్పుడే విచ్చుకున్నట్లు కళ్లతో చూస్తూ - ప్రాణాలు లేచే వచ్చాయి సురేష్‌కి . . . చిరు పరుగులే తీశాయి కాళ్లు.

కళ్లు కదల కుండానే కమల మీద నిలిచి పోయాయి.

"వచ్చావా?"

"ఆ " అని కళ్లతోనే సమాధానం! కళ్లల్లో తొణికిసలాడే ఆనందమే సమాధానం.

"సర్కారుకేనా?"

"ఇంకే బండి వుందీ మరి?"

"ఇందాకా ఈ 'రూం'కి వచ్చి చూశాను. లేవే?"

కమల నవ్వింది సిగ్గుపడుతూ . . . "బాత్ రూంలోకి వెళ్లేనేమో?"

"అదా? గాభరా పడిపోయాను. అందులో ఆ చివరనో ఏక్సిడెంటో? ఆత్మహత్యో?"

"చూసి వస్తున్నట్టున్నారుగా?"

"చూసి కాదు. ఆగిపోయిన గుండెల్ని - మళ్ళీ నడిపించుకుంటూ వస్తున్నాను."

ఇద్దరూ మనసారా ఒక్కసారి నవ్వుకున్నారు.

నడిచి ఇద్దరూ టికెట్ కలెక్టర్ గేటు దాకా వచ్చారు. చేతిలో వున్న చిన్న సంచీ క్రింద పెట్టి - కమల టికెట్ తీసి యిచ్చింది. అది అందుకుని సురేష్ తన ప్లాట్ ఫారం టికెట్‌తో కలిపి అక్కడ టికెట్ కలెక్టర్‌కు అందించాడు.

ఇద్దరూ బయట పడ్డారు. స్కూటర్ దాకా నడిచి బయటకొచ్చారిద్దరూ. ఇద్దరితో స్కూటర్ వాయు వేగాన్నందుకుంది.

సురేష్ అద్దెకు తీసుకున్న ఇంటి ముందు ఆగింది.

అదొక ప్లీడర్ గారి యిల్లు. పేరు హరిహర రావు. బి.ఎ. బి.యల్ అని బోర్డు మీద వుంది. దాదాపు ఏభై అయిదు ఏళ్లుంటాయి ఆయనకు. ఆయనా ఆయన భార్యా - యింటి ముందున్న తోటలోనే ఎదురయ్యారు. పలకరించారు.

"మీ ఆవిడను తీసుకు వచ్చారా?"

నవ్వాడు సురేష్ - తర్వాత -

"వీరే ఇల్లు గలవారు. ఊళ్లో పెద్ద పేరున్న ప్లీడరు గారు. వారి భార్యగారే వారు - పేరు జానకిగారు."

ఒక నిముషం ఆడవాళ్లిద్దరూ ఎగాదిగా చూసుకున్నారు.

'కమల - రోడ్డు ప్రక్కనే వున్న చెరువులో వున్న కమలం లాగే వుంది' అనుకుంది జానకి.

"జానకికి అంత వయసు వుండదే ! ఈయన భార్యా ఏమిటబ్బా?" అనుకుంది కమల.

నిజమే. జానకికి ముప్ఫై ఏళ్లో ఇంకా తక్కువేనో! మంచి విగ్రహం ; మంచి యవ్వనం; ఆ హరిహరం గారు యవ్వనం తడి ఆరిపోయిన మనిషి. నెత్తి మీద వెంట్రుకలు సగం నెరసిపోయినాయి. మాటలో దర్జా, మెత్తదనం కలిసి మెలిసి వున్నాయి. హరిహరం గార్కి అది ద్వితీయ వివాహం.

"ఇంట్లోకి పోదాం పద" అంటూ సురేష్ తన భాగం వైపు నడిచాడు. వెనకనే అడుగు లేసింది కమల.

ఇద్దర్నీ చూస్తూ ముచ్చట పడ్తూ - ప్లీడర్‌గారూ, భార్యా తోటలోనే నిలబడి పోయారు - అటే చూస్తున్నారు - సురేష్ తాళం తీసి - ఇద్దరూ లోపలికెళ్ళేదాకా.

"అమ్మాయి చక్కని చుక్క గదూ" అన్నాడు హరిహరం.

"అబ్బాయి అంతకంటే బాగున్నాడుగా!" అన్నది జానకి నవ్వుతూ.

ఇద్దరూ ఆ వాకిలి దాకా నడిచారు. అప్పటికే దంపతులిద్దరూ లోపల గదులను పరిచయం చేసుకుంటున్నారు. ఉన్నవి వంటిల్లు గాక రెండే గదులు. ముందు గదే పడక గది. వెనకనో గది చిన్నది - ఒక్క మంచం గూడా పట్టదు. పోతే వంట గదీ చిన్నదే.

గదులు అందంగానే వున్నాయి - తక్కిన యింటికి మల్లేనే అన్ని సదుపాయాలూ వున్నాయి వంటగదిలో.

హరిహరం జానకీ ముందు వాకిలికి ముందే నిలిచి చూస్తున్నారు.

"రండి లోపలికి" అంది కమల కాస్త సంబరపడ్తూ.

"మీకేమన్నా కావాలంటే అడగండి. కొత్త సంసారం గదా" అన్నది జానకి - లోపలికి నడుస్తూ.

"ఏమీ కావల్సినవి లేవులెండి. అన్నీ పొద్దున్నే తెచ్చి పడేశాను." మాట కలిపాడు సురేష్ - టేబుల్ దగ్గర నుంచుని ఉండి. హరిహరం గుమ్మం దగ్గరే ఆగిపోయాడు. అటునుంచి తమ భాగంలోకి వెళ్లి పోయాడు.

జానకి అక్కడే కాసేపు కబుర్ల కాలక్షేపం చేసింది. "వేరే పడక గదే లేదు గాని అన్ని సౌకర్యాలు వున్నాయి. వరండాలో - కావాలంటే కుర్చీలు వేసుకుని, మీరే వాడుకోండి. ఇది పడకగది! ఆ వెనక గదిలో సామాన్లు పెట్టుకోండి. ఇక



వంటింట్లో అన్ని సౌకర్యాలు బాగానే పెట్టించారు - మా వారు."

కమల ఏమీ మాట్లాడలేదు. సంతృప్తిగా చూసిందంతే.

"ఆ పడకగది ప్రక్కనే - మా పడక గది. ఈ వంటిల్లు ప్రక్కనే మా వంటిల్లు గూడా. ఏమన్నా కావాలంటే - కేక వెయ్యండి చాలు, నేను పంపిస్తాను."

కమల ఇంకా మాట్లాడలేదు.

"ముద్ద మందారం లాగున్నారు. కాని ఇంత వరకూ ఒక్క మాట మాట్లాడలేదు. మీ పేరూ?"

"కమల"

"అమ్మయ్య! మాటలొచ్చు. ఫర్వాలేదు. చదువు ఎంత వరకు సాగిందీ?"

"బి.య్యే."

"ఇంతలో . . . ఈ . . . . "

ఇద్దరూ నవ్వుకున్నారు. కాసేపుండి, ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి, జానకి తమ భాగంలోకి - దొడ్డి దోవ గుండానే వెళ్లి పోయింది.

కమలప్పుడు దొడ్లోకి కూడా చూసింది. బాగా విశాలంగానే వుంది దొడ్డి - బావీ - చెట్లూ - పూల మొక్కలూ,కూరగాయ పాదులూ!

"నేనట్లా ఊళ్లో కెళ్లి యిప్పుడే వస్తాను కమలా ! ఓ స్నేహితుడితో వస్తానని చెప్పాను. త్వరగానే వస్తాలే. ఈ లోగా నువ్వు కాఫీ పెట్టు" - తల దువ్వు కుంటూ సురేష్ అన్నాడు.

సమాధానంగా కమల మళ్లా సిగ్గు నవ్వులు వొలక పోసింది.

కొద్ది సేపటికే స్కూటర్ మోత విన్నది కమల. ఆ తర్వాత కిరోసిన్ స్టౌ వెలిగించింది. గిన్నెతో నీళ్లు పెట్టింది. తర్వాత 'కాఫీ పొడి డబ్బా ఏదీ?" అని వెతుకుతుంటే. . . .

"కాఫీ పొడి డబ్బా అదీ! - ఆ గూట్లో!" అన్న మాటలు విన్పించాయి.

'ఎవరా?' అని వెనుదిరిగి చూస్తే . . .

వాకిలి దగ్గర ఇద్దరు పిల్లలు !! పలికిన పలుకులు ఆ పిల్లవి.

" ఆ ప్రక్కదే పంచదార డబ్బా" అన్నాడు పిల్లవాడు.

వెళ్లి చూస్తే - నిజమే - ఆ డబ్బాలు రెండు ప్రక్కప్రక్కల్నే వున్నాయి.

"ఏవేవి ఎక్కడున్నాయో మీ కెలా తెలుసూ?" నవ్వుతూ అడిగింది కమల.

"మేం రోజూ చూస్తూనే వున్నాంగా!" అన్నదా పిల్ల. పదేళ్లు ఉంటాయి. గుండ్రని కళ్లు నిమ్మపండు లాంటి మేనిచ్ఛాయ. ఆవంటి ఛాయలో ఛాయగా గౌను కలిసి పోయిందేమొ!

కళ్లకు కాటుక లేకపోతే - కళ్లు - ఫ్రేం లేని పటం లాగ వుండి పోయా ఏమో!

"సురేష్ గారు వంట చేసుకుంటుంటే - మేమే రోజూ సాయం చేస్తుంటాం." అన్నాడా పిల్లవాడు. కుర్రాడంత ఛాయ వుండడు గాని, కళ్ళల్లో చురుకుదనం తొణికిస లాడుతోంది.

నల్లలాగూ, చారల బనీను - రెండింటిలో కుర్రాడు కాటుకలో పడ్డ ముత్యం లాగున్నాడు. ఇద్దరి చిలక పలుకులూ విని - కమలకు మరింత ముచ్చటేసింది.

"మీరిద్దరూ ఆయన స్నేహితులా?"

"ఆయన కంటే -? సురేష్ బాబాయి గారికా? - స్నేహితులమే"

"ఈ వీధిలో మాతోనే ఆయన జట్టు కట్టారు.

మరెవ్వరితోనూ మాట్లాడనే మాట్లాడరు. ముగ్గురం కలసి డాబా మీద ఆడుకుంటాం సాయంత్రం పూట!"

"మీ పేర్లు?"

"నా పేరేమో 'నీల'. అమ్మ నన్ను ' 'నీలమ్మా' అంటుంది. నాన్నగారు 'నీలా' అని పిలుస్తారు. వీడి పేరేమో! . . . ."

"నువ్వేం చెప్పక్కర్లేదులే. మహా . . . నా పేరండి "రంగా" అండీ . . . అసలు పేరండీ - రంగనాయక వర ప్రసాదరావు. కాని అమ్మా నాన్నా - వీధిలో అందరూ - 'ఒరే రంగా' అంటారండీ . . . "

ఇద్దరితో మాట్లాడుతూ కమల మరిన్ని కాఫీ కోసం మరిన్ని నీళ్లు పోసిందా గిన్నెలో.

"మీ రిద్దరూ అన్నా చెల్లెళ్లా? అక్కా తమ్ముళ్లా!"

"ఛీ ; కాదండీ. వాళ్ళిల్లేమో ! . . . అటు ప్రక్క. మా ఇల్లేమో ఇటు ప్రక్క" అంటూ - చిన్న పిల్ల -భరత నాట్యం చేసినట్లు - ముద్దుగా చేతులు తిప్పుతూ చూపించింది నీల.

---

"డాక్టరు గారూ - నాకుడికాలు మోకాలు దగ్గర భరించ లేనంత నొప్పిగా వుంటోందండీ" అన్నాడు పేషెంట్.

డాక్టరు గారు ఆ పేషెంటు కాలుని రకరకాల పద్ధతుల్లో చాలా సేపు పరీక్షించాడు. చివరికి -

"లాభం లేదండీ - ఈ నొప్పికి మందు లేదు - బహుశా యిది ముసలితనం వల్ల వచ్చింది అనుకుంటా" అన్నారు.

"మీరు పొరబడుతున్నారు డాక్టర్! ముసలి తనం వల్ల ఎలా గవుతుంది?

నా ఎడమ కాలుకి ఎంత వయసో - కుడికాలుకి కూడా అంతే వయసు గదండీ" అన్నాడు పేషెంట్.

---



"మీ అమ్మ నిన్నూ 'నీలమ్మ' అని పిలుస్తుంది. మరి నన్నేమని పిలవమంటావ్?"

"మా అమ్మ నన్ను 'నీలమ్మా' అంటుంది - మామూలుగా. కొద్దిగా కోపం వస్తే . . . 'నీలీ' అంటుంది. బాగా కోపం వస్తే 'మొద్దు ముండా" అంటుంది. మీరూ . . . ఎల్లా పిలుస్తే అల్లా పలుకుతానండీ."

"నన్ను మాత్రం 'రంగా' అని పిలవండి చాలు. నా పూర్తి పేరు ఎవ్వరికీ జ్ఞాపకం వుండదు."

అంతలో ఇద్దరికీ ఏదో సందేహం వచ్చింది. కళ్లల్లో కళ్లు పెట్టి మాట్లాడుకున్నారు. తర్వాత ఇద్దరూ ఒక్కసారిగానే అడిగారు.

"మరి మేం మిమ్మల్నెల్లా పిలవ్వండీ?"

"కమలా అని పిలవండి"

"ఛ! 'ఆంటీ' అంటామండీ చక్కగా! మిమ్మల్ని చూస్తుంటే మా 'ఆంటీ' జ్ఞాపకం వస్తోంది!" అన్నాడు రంగా.

"మీ 'ఆంటీ' నాలాగుంటుందా?"

"మా 'ఆంటీ' కంటే - మీరే బాగుంటారు. కానీ . . . "

"మా 'ఆంటీ' - మీలాగే వుంటుంది," అన్నది నీల.

"కాయ్, కాయ్" అన్నాడు పిల్లవాడు. "మీ ఆంటీ వీరిలాగా వుంటుందేమిటి? దొడ్డ ముక్కూ - చిన్న కళ్లూ . . . "

"ఏం గాదు." ఇద్దరూ చిన్న వాగ్వాదం సాగించారు. ఇద్దర్నీ చూసి కమల నవ్వుతుంటే - అంతలో - సురేష్ స్కూటర్ మోత విన్పించింది. గబగబా కాఫీ కలిపింది - నలుగురికీ - కమల. పిల్లలు బలవంతం చేస్తేగాని కాఫీ గ్లాసులు అందుకోలేదు. తర్వాత నలుగురూ కాఫీలు తాగుతుంటే -

"వీళ్ళిద్దరూ నీ కప్పుడే స్నేహం అయ్యారే!" అన్నాడు సురేష్. కళ్లతోనే నవ్వింది కమల. తర్వాత ఖాళీ కాఫీ గ్లాసులు తీసుకుని లోపల కెళ్లింది.

కాసేపటికి లోపలికి సురేష్ కూడా వెళ్లాడు - ఏం పని లేక పోయినా . . .

తలుపులు తీసే వున్నాయి. అయినా అక్కడ ఒక గాఢ పరిష్వంగంలో కమల ఇరుక్కు పోయింది.

ఎంతసేపటికీ . . . ఇద్దరూ . . . తిరిగి బయటకు రాలేదు. కాసేపు దిక్కులు చూస్తూ కూర్చున్నారు పిల్ల లిద్దరూ. తర్వాత నీల లేచి - లోపల గదిలోకి వెళ్లబోయింది.

"వెళ్ళకు" వారించాడు రంగా - నెమ్మదిగా.

"ఏం?"

"అరవకు'. . . రా . . . అదిగో చూడు . . . "

ఎదురుగా - గోడకు తగిలించి వున్న అద్దంలోకి చూపించాడు. అందులో ముద్దులాడు కుంటున్న కమలా సురేష్ కనిపించారు.

"మొగుడూ పెళ్ళాల మధ్య మనమెందుకూ ? రా పోదాం."
"ఏం ఉంటే?"
"ఇదివరకు లాగా కాదు. మీ అమ్మా నాన్నా అనుకున్నావా?"
వాళ్ల గుసగుసలంతటితో అయిపోయాయి.
గుట్టుగా ఇద్దరూ గుమ్మం దాటి వెళ్లారు . . .

"వదలండి ! అవతల పిల్లలు" అంటూ కౌగిట్లోనే గిజగిజ లాడుతోంది కమల. మరీ ముసిరి వస్తున్న చీకట్లో – ఎంత అణిగి మణిగి పోయిందో.! . . . . అరగంట దాకా లైట్లు వెలగలేదా భాగంలో.

••••

ఆ రాత్రి భోజనాలయ్యాయి అందరివీ. హరిహరం పడకగదిలోకి వచ్చేశాడు – నాలుగైదు "లా" పుస్తకాలతో సహా. ఆయనకది అలవాటు. రాత్రి ప్రొద్దుపోయే దాకా మర్నాటికున్న కేసుల తాలూకు కాగితాలన్నీ మేలుకుని చదువుతాడు – ప్రక్క మీద పడుకుని. మరో అరగంటకు జానకి కూడా తమలపాకుల బుట్ట వగైరాలతో ఆ గదిలోకే వచ్చింది. ఆకులు రాసి ఇస్తుంటే నములుతూ ప్లీడరుగారు రెండొందల డెభ్భై అయిదూ,డెభై అయిదు (275/75) కేసులో "లా" పాయింట్ ల కోసం వెతుకులాడుతున్నాడు.

అప్పుడు మొదలయింది సన్నగా, అతి లలితంగా అవతల గదిలో కమల పాట.

పాట వరకూ అయితే బాగానే వుండును. ఏదో రేడియోలో వస్తున్నట్లు వినబడుతుంటే హరిహరంగారి స్టడీకి ఏమంత ఇబ్బంది వుండేది కాదు. రేడియోలో పాట వస్తున్నా – తన చదువులో మునిగి పోవటం ఆయనకి అలవాటే కానీ . . . ఆ పాటలో ఆ అవతల గదిలో చరణం చరణానికి మధ్యలో నేపధ్య సంగీతంలాగా – నవ్వులు కిల కిలలూ చక్కిలి గిలిగింతల గలగలలూ !!

మొదట్లో ఆయనేం పట్టించు కోలేదు. కాస్త శృంగారం రంగరించిన పాట కావటంతో – జానకి వింటూ వుండి పోయింది. శృంగారం మరికాస్త ముదురుతున్న కొద్దీ శ్రద్ధ మరింత ఎక్కువయింది. చివరకు చరణ చరణానికి మధ్య సినిమా పాటలలో – నే పధ్యం లాగ, నవ్వుల గలగలతో కుతూహలం మరింత పెరిగింది – ఆపుకోలేనంతగా !

కొంతసేపు సంగీతం వింటూ జానకి ప్రక్క మీదే కూర్చుంది. ఆ తర్వాత . . . ఏం చేస్తున్నదో చూడాలనిపించింది. ఆ తలుపుకు ఆ మధ్య గడియ ఊడిపోయింది. కొత్త గడియ వేయించారు. కాని పాత రంధ్రం పూడిపించలేదు. ఆ రంధ్రం లోంచి చూస్తే సరిగ్గా అవతల గదిలో పడక మంచమే కనిపిస్తుంది. ఆలుమగలే కంటబడతారు. కమలా సురేష్లు ఒకరి మీద ఒకరు వాలిపోతూ – నవ్వుల్లో నలిగిపోతూ – తల్లో పువ్వులు రాలిపోతూ.



నాకిప్పుడు బతుకుమీద ఆశ కలిగింది డాక్టర్!
– మా ఆవిడ కొన్నాళ్లు పుట్టింటికి వెళతానంది!!



ఆ గదిలో బల్బు మార్చి కొత్త బల్బు వేశారో – ఆ యువకుల రక్తం వోల్టేజీతో పాటు, ఊళ్ళో వోల్టేజి పెరిగిందో – కాక ఆ వెర్రి శృంగారాలకు ఉప్పొంగి పొంగి పాత బల్బే అల్లా వెలిగిపోతోందో? నిమిష నిమిషానికి తమాషాలు విశేషాలుగా మారి పోతున్నాయి. సశేషాల కోసం ఇవతల ఎదురు చూపుల్లో కౌతుకం పెరిగి పోతోంది. అవతల సతీపతుల కుతూహలం పెరిగిపోతోంది . చిత్రాతి చిత్రంగా, విచిత్రాల చిత్రాలు మారి కానవస్తున్నాయి. పాటలు ఆగితే నవ్వులు. అవి ఆగగానే ముద్దుల చక్కిలి గింతలు – కళ్లకు కట్టినట్లే కనబడుతున్నాయి. అవతల గదిలో మన్మధ సామ్రాజ్యం – ఇవతల గదినీ దురాక్రమణ చేసింది.

జానకి గబగబా డబుల్ కాట్ మీద వాలిపోయింది. వెంటనే నాలుగు పాల్లికింతలు పెట్టింది – భర్తమీదికి. తన అర చేతుల్తో భర్త చేతిలో వున్న పుస్తకాన్ని పూర్తిగా కప్పి వేసింది. తమకంతో కళ్లలోకి చూస్తూ మనోభావాల్ని కళ్లతోనే వెళ్లబుచ్చింది.

"అబ్బా! అల్లరి చెయ్యకు . ఈ కేసు చాలా పెద్ద కేసు, వాయిదా రేపే! రాత్రంతా చదివినా ప్రిపరేషన్ చాలదు." అన్నాడు హరిహరం.

అయినా జానకి చేతుల్ని పేజీ మీద నుంచి తియ్యలేదు.

పైగా 'ఉహూ' అంది గోముగా.

హరిహరం చత్వారపు కళ్ల జోడుకు షార్ట్ సైట్ గాని లాంగ్ సైట్ లేదు లాగుంది. జానకి చేతుల్ని అవతలకు నెట్టేసి తన పుస్తకం మీదే దృష్టి కేంద్రీకరించాడు. జానకి తన లేత చేతులు హరిహరం ఛాతీ మీద వేసి – మరింత దగ్గరగా జరిగింది. మరింత డొక్కలో దూరింది. అయినా ఆవంత మార్పు రాలేదు హరిహరంలో.

అది చూసి జానకికి కాస్త ఉక్రోషం వచ్చినా, అంతటితో ఊరు కోలేదు. లేచి వెళ్లింది. లైట్లు ఆర్పేసింది. పక్కమీద వత్తిగిల్లి హరిహరం మీదకి పొర్లింది.

"అబ్బబ్బా!" అనుకున్నాడు హరిహరం. గాడిద బరువున్న పుస్తకాల్ని చేతుల్లో కెత్తుకుని, ఆ గదిలోంచే వెళ్లిపోయి – ఆఫీసు గదిలో టేబుల్ మీదున్న పుస్తకాల్లో మునిగి పోయాడు.

అంత చీకట్లోనూ, జానకి కళ్లు రుస రుసలాడాయి. శ్వాస బుస బుసలాడింది. రోషమంతా వెళ్ల గక్కుతూ లేచి వెళ్లి అతన్ని చూసింది. తలుపులు దడాలున విసిరి కొట్టింది. వెళ్లి మంచం మీద వాలి వెక్కి వెక్కి ఏడ్చింది. . . . . . . . . . . . అంతలో మళ్లీ అవతల గదిలో – గొణ గొణ ధ్వనులు. పావురాళ్లలాగా.

మళ్లా మళ్లా ఎకసక్కెలు – చిలకా గోరు వంకల్లాగా ఇంకా ఇంకా కులుకు పలకరింపులు – గుళ్లో గువ్వల్లాగా చెవుల్లో దూది ముక్కలు దోపుకుని కాళ్ల మధ్యకు బూరుగ దిండు లాక్కుని బలవంతాన నిద్రపోయిందా రాత్రి జానకి.

రాత్రి ఒంటి గంటో రెండో అయింది. హరిహరం పుస్తకం మూసి గదిలోకి వచ్చేసరికి. ఆ చీకట్లోనే వెళ్లి ఆ తలుపులోంచి చూశాడు. . . . జానకి ఎందుకు చూసిందో తెలుసు కుందామనే ఆయన కుతూహలం. కానీ తీరా చూడగా – అవతల గదిలో అంతా అంధకారమే. మరేమీ కనబడలేదు, మరేమీ వినపడనూ లేదు. అప్పటికే బాగా నిద్ర వస్తూ వుండటం వల్ల ప్రక్క మీద వాలగానే నిద్ర వచ్చేసిందాయనకి.

మర్నాడు మామూలుగానే తెల్లవారింది. మామూలుగానే అందరూ కాఫీ తాగారు. మామూలుగానే ఎవరి పనులు వారు చూసుకుంటున్నారు. పిల్లలిద్దరూ మామూలుగానే అరుగు మీద చేరారు – ఆడుకోవటం మొదలు పెట్టారు.

ఆ వేళ ఆట – 'మొగుడూ పెళ్లాం' ఆట.

కిటికీలోంచి సురేష్ పోర్షన్ లోకి తొంగి చూడటం – అదే విధంగా వాళ్లూ ఆడటం.

సురేష్‌కు కాఫీ తెచ్చి యిస్తూ – "సెనగపప్పు అయిపోయింది. బాంకుకెళ్ళి వస్తూ, సాయంత్రం పట్రండి." అంది నవ్వుతూ కమల.

"సరే ; నువ్వు వంట త్వరగా కానియ్యి. తొమ్మిది గంటలకల్లా బాంకుకు బయలు దేరాలి" అన్నాడు సురేష్ – కమల కళ్ళలోకి చూస్తూ . . .

అరుగు మీదా అదే జరిగింది.

నీల తన లక్కపిడతలతో కాఫీ తెచ్చి యిస్తూ "సెనగపప్పు అయిపోయింది బాంకు కెళ్ళి వస్తూ, సాయంత్రం పట్రా" అంది.

"ఏమన్నావ్"

"సాయంత్రం కాఫీ పొడి పట్రా అన్నాను. కమలమ్మ అంతేగా అన్నది?"




## అక్కలతకు

అబ్బా, ఎన్నాళ్ళకీ అవకాశం వచ్చింది. ఈ రోజు పూర్ణమి. వెన్నెల ఎంతబాగుంది. నీకీలేఖ వ్రాయడానికి ఎన్నాళ్ళనుంచో ప్రయత్నం. వారానికి ఏవో కొన్ని గంటలు ఆటవిడుపు. ఆ కొద్దికాలం ఏదో కాలక్షేపం. ఆనందం, సరదా అంటే ఏమిటో ఎప్పుడో మర్చిపోయాం. ఎప్పుడూ ఏదో ఒకటి కంఠతాపట్టడం, వ్రాయటం, లేకపోతే తిట్లు, జరిమానాలు, బెదిరింపులు, అమ్మానాన్న ఏమనుకుంటారోనని. భయం. ప్రతిక్షణం భయంతో, బరువుతో కాలం గడిచిపోతోంది. ఇదంతా క్రమశిక్షణ అనే పేరుతో చలామణి అవుతోంది. వ్యక్తి వికాసానికిగాని, సృజనాత్మకతను పెంపు చేసేదిగాని, మాశక్తి సామర్థ్యాలను పెంపొందించేదికాదు. **M.P., Bi.P** గ్రూపులనీ, ప్రతివారు ఇంజినీరో, డాక్టరో కావాలనే పగటికల వల్ల కొని తెచ్చుకున్న బాధ. ఇంజినీర్లు, డాక్టర్లు గాక వేరుగా బ్రతకలేమా? నాకనిపిస్తోంది, డాక్టర్లు, ఇంజినీర్లు, పోలీసులు లేని ప్రపంచం ఎంత అందంగా, ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుందో ఒకసారి ఊహించుకో.

తెలవారుతోందంటే భయం. మాస్టారొస్తారు, ఏవో బోర్డు మీద వ్రాస్తుంటారు. ఏ సబ్జెక్టులో ఎందుకవసరమో, ఎందుకుపయోగపడుతుందో నిజజీవితంలో దాని అవసరమేమిటో, చెప్పేవారికిగాని, వినేవారికిగాని తెలియదు. ఎవరూ, ఎవరిని అడిగే ప్రశ్న లేదు. ఇదీ మాకు నేర్పుతున్న శాస్త్ర విజ్ఞానం. యవ్వనంలో రెండేండ్ల ఈరకమైన జైళ్ళలో గడిపిన తరువాత మా మనస్తత్వం ఎలా మారుతుందో, మేము ఏ పోటీలో నెగ్గుతామో ఊహించండి. అందుకే చదువంటే విరక్తి, విసుగు ఏర్పడుతున్నాయి. మొన్న సెలవులకు మన ఊరొచ్చినప్పుడు శరత్ కలిసాడు. వాడెంత ఉత్సాహంగా ఉన్నాడో గమనించారుగా, ఏవేవో కోర్సుల గురించి చెప్తుంటే ఆశ్చర్యం వేసింది. వాడి విద్యాలయానికి, మా దానికి ఎంత తేడా ఉందో గమనించగలను. వాడిలాగా నేనూ గుంటూరు బ్రాడీపేటలో గల రవికళాశాలలో చేరివుంటే ఎంత బాగుండేది? విద్యాలయాలు అందరూ నడపవచ్చుగాని, నడిపే వ్యక్తి యొక్క లక్ష్యాలు, ఆశయాలు ముఖ్యం. 34 సంవత్సరాలచరిత్ర గల ఆ కళాశాల సాధించిన విజయాలు వింటుంటే ఎంతో ఆనందం వేసింది. దానిక్కారణం, మనస్తత్వవేత్త అయిన సి.వి.ఎస్. ధన్ డైరక్టరట. అలా ఉండాలి రెసిడెన్షియల్ కాలేజి అంటే అనిపించింది. చాలా పొద్దుపోయింది. అమ్మకు, నాన్నకు నమస్కారములని చెప్పు. సదా నీ ప్రేమానురాగాలు కోరుకునే

నీ తమ్ముడు

**ADVT**

సత్యం

"కమలమ్మగారు 'పట్రండి' అన్నది. ' నీకు మల్లే 'పట్రా' అందేమిటి - రౌడీలాగ? మొగుణ్ణి ఎవరన్నా 'పట్రా' అంటారా 'పట్రండి' అంటారు."

"అంటారు. మా ఇంట్లో అప్పలమ్మ మొగుణ్ణి 'పట్రారా' అంటుంది గూడా!"

"నువ్వు అప్పలమ్మవా అయితే?"

"నువ్వు బాంకు ఆఫీసర్‌వా అయితే!"

కాసేపటికి నీలే మనస్సు మార్చుకుంది. "సరేలే - ఆటలో 'పట్రండి' అనే అంటాలే. రా; ఆడుకుందాం" మళ్లీ ఆట సాగింది.

"తొమ్మిది గంటలకే బాంకుకు వెళ్ళాలి . త్వరగా వంట కానియ్యి" అని దబాయింపుగా వాళ్ళ నాన్నలాగా అన్నాడు రంగా.

"ఛీ; పాడు. సురేష్‌గారు అల్లా అన్నారేమిటి?"

"మరి ఎల్లాగన్నారేం"

"నెమ్మదిగా మెత్తగా కళ్లల్లోకి చూస్తూ అన్నారు".

"నేను కళ్ళల్లోకి చూస్తూనే అన్నా . . ."

"సరిగ్గా - మళ్లీ అను . లేకపోతే నేను వంట చెయ్యను"

"సరే; అల్లాగే . . . . తొమ్మిది గంటలకే బాంకుకు వెళ్ళాలి. త్వరగా వంట కానియ్యి. ఏం బాగా అన్నానా?"

"ఆ"

అరుగు మీద లక్కపిడతల్లో మరమరాలతో వంట సాగుతోంది. లోపల వంటింట్లో స్టీలు గిన్నెలోనూ వంట సాగుతోంది - గబగబ.

"ఇంకా ఎంత ఆలస్యం వుందీ?" అంటూ కేకేశాడు; పేపర్ చదువుకుంటూ - ముందు గదిలో వున్న సుందరాంగుడు.

"ఇంకా ఎంత ఆలస్యం వుందీ?" అంటూ కేకేశాడు అరుగు మీదున్న అబ్బనాకారుడు.

"అవ్వొస్తోంది" అంది వంటింట్లో వయ్యారి.

"అయిపోయింది" అంది అరుగు మీద సుకుమారి.

మరి కాసేపు వంటింట్లో సరాగాలు పొంగి పొర్లాయి. అరుగు మీద 'మరమరాలు' తరిగి పోయాయి.

ఆఫీసుకు తరలి వెళ్లటానికి వాకిలి దాకా నడిచి వచ్చాడు. వెనకనే ఏడడుగులు నడిచి వచ్చింది కమలాకాంత. అక్కడ - విడవ లేని తమకం - తటాలున ఉబికి రాగా, తలుపు చాటు చేసుకుని, చటుక్కున ముద్దు ముచ్చటించాడు సురేష్. కమల కిలకిలా నవ్వింది. బయటకు వచ్చి సురేష్ స్కూటర్ స్టార్టర్ తొక్కుతూ 'టాటా' చెప్పాడు. తర్వార చెంగు చెంగున గెంతి నడుస్తూ - కమల వంటింట్లోకి కనుమరుగై పోయింది.

---

● కళ్ళకి కన్నీళ్ళకి సంబంధం లేదు

గుడ్డివాడు కూడా కన్నీరు కార్చుస్తాడు.

---



అరుగు మీద తదుపరి కార్యక్రమం ఆరంభమయింది.

'రంగా ' ఠీవిగా అరుగు మెట్ల దాకా నడిచి వచ్చాడు.

వెనకనే నీలా నడిచి వచ్చింది.

మెట్ల దగ్గర ఇద్దరూ ఆగి నిలిచారు.

"ఆఫీసు నుంచి తొందరగా వచ్చెయ్యండి", అంది నీల బుంగమూతి తిప్పుకుంటూ.

"అల్లాగే! వచ్చేస్తాను. సరేనా!" అన్నాడు రంగా నోరారా.

అంతలో తటాలున బుజాలు పట్టుకుని, చటుక్కున ముద్దు రుద్దేశాడు రంగా.

"ఛీ ; ఎంగిలి" అంటూ చీదరించుకుందా పెద్ద ముద్దరాలు.

అంతలోనే హరిహరం భోజనానంతరం - తాంబూలం నములుతూ నలుగురైదుగురు పార్టీలు వెంట వస్తుండగా - ఇద్దరు గుమాస్తాలు ఫైల్సు తీసుకు వెంటరాగా సపరివార సమేతంగా కోర్టుకు కదలి వెళ్లాడు.

కమల సింగిల్ కాట్ ఫోం బెడ్ మీద వాలి వార పత్రిక చదువుతోంది. జానకి, వారి భాగంలో నిద్దరకు సిద్ధమయింది.

ఇక తల్లో, తండ్రో వచ్చి - నాలుగు అంటించి - రెక్క పుచ్చుకు లాక్కెళ్ళే వరకూ, ఆ ఆవరణ పిల్లలదే. పిల్లలు ఆటలకు పడితే ఆకలి దప్పులే వుండవు. పురుగు పుట్రా భయం కూడా వుండదు

## -3-

ఇంతకు ముందు - కమల రాక ముందు - సురేష్ సాయంకాలాల్లో సామాన్యంగా ఇంటికి వచ్చేవాడు కాదు. ఇవ్వాళ సరాసరి ఇంటికే వచ్చాడు - ఆఫీసు టైం అయిపోగానే. కమల ఏదో కొద్దిగానే 'కారబ్బూంది' చేసింది. పిల్లలిద్దరికీ పెట్టింది. సురేష్ కోసం అంత వరకూ కూర్చుంది. అప్పుడిద్దరూ తిని కాఫీ తాగారు.

తర్వాత ఇద్దరూ చక్కగా ముస్తాబయ్యారు - ఇక ఇకల్తో - పకపకల్తో .

పక్కగదిలో వున్న జానకి వింటూనే వుంది. మనసు పరిపరి విధాల పరుగెత్తుతుంటే . . . అదిమి పట్టుకుంటూనే వుంది. ఇక నా సరస సల్లాపాలు వినటం మాత్రం ఎందుకని ఇంటి చుట్టూ వున్న తోటలో షికారు సాగించింది.




అరుగు మీద పిల్లలిద్దరూ మళ్లా ఏదో ఆడుకుంటున్నారు. హరిహరంగారు ఆఫీసు గదిలో కూర్చుని - పార్టీలతో ఆస్తి దావా కేసు విషయాలేవో చర్చిస్తున్నారు.

ఆ సమయంలో కమలా సురేష్‌లు బయలు దేరారు. స్కూటర్ దగ్గర కెళ్లారు. అదెందువల్లనో తొందరగా 'స్టార్ట్' కాలేదు. చాలా మొరాయించింది. తోటలో జానకి చూస్తూ నుంచుంది. పిల్లలు వరండాలో నుంచున్నారు. ఆఫీసు గదిలో వున్న హరిహరంగారికిదొక తలనొప్పి అయింది. ఆయనా బయట కొచ్చి విసుగ్గా చూశాడు. సురేష్ ఎల్లాగయితే ఏం - స్కూటర్ స్టార్ట్ చేశాడు. కమల ఎక్కి కూర్చుంది. అందంగా ఒక 'చక్కర్' కొట్టి - స్కూటర్ వెళ్లి పోయింది.. పిల్లలిద్దరూ చప్పట్లు కొట్టారు - ఆనందంతో.

"అమ్మయ్య" అనుకుని హరిహరం లోపల కెళ్లాడు.

జానకికి తోటలోనే కళ్ళు తిరిగినట్లయి - ఇంట్లోకి వచ్చేసింది. ఇక నా స్కూటర్ మీద ఊరంతా ఊరేగుతున్నట్లే తోచిందా పూటంతా జానకికి.

"ఈ పాటికి స్కూటరు పార్కు రోడ్డంబట్టి పరుగెత్తుతుంటుంది. వంకరలు తిరుగుతుంటుంది. వయ్యారాలొలుకుతుంటుంది. రింగులు తిరిగిన సురేష్ జుట్టంతా గాలిలో తేలుతుంటుంది. కమల ముంగురులన్నీ గాలికి చెల్లా చెదురై, గాలికి ఎగురుతూ వుంటాయి. స్కూటర్ గిరున వంకరలు తిరిగినప్పుడల్లా 'కెవ్వున' కేక లేస్తూ నవ్వులు రువ్వుతూ వుంటుంది కమల - ఆనంద



పారవశ్యంతో - ఆ రోడ్డంతా - పన్నీరు చల్లినట్లు - చల్లగాలికి మల్లెపువ్వుల పరిమళం సహజంగానే పుట్టు కొచ్చినట్లు - వల్లి మాలిన ఉత్సాహమేదో మార్గం మీద పరుగెత్తు తున్నట్లు . . . ." అంతా కళ్ల ముందే ఆడుతున్నది జానకికి. సురేష్ మొగంలో మొగలి రేకుల మందహాసం. కమల కనురేకుల్లో ఆనందపు మకరందం! కళ్లకు కన్పిస్తోంది స్పష్టంగా.

అవతల గదిలో అంరా కోర్టు దావాల కంపు - ఇవతల గదిలో అంతా తియ్య తియ్యని ఊహలు- కమ్మ కమ్మని కలలు ! కొమ్మ కొమ్మకు పువ్వులు- నెమ్మదిలో నెమ్మదిగా పల్లవిస్తున్నాయి. పరిఢ విల్లు తున్నాయి.

తర్వాత కూడా చాలాసేపు జానకి ఊహలు గగన వీధుల్లో విహరించాయి. హరిహరం కొనదలుచుకుంటే - 'కారు' కూడా కొనెయ్యగలవాడే! స్కూటర్ మీదే కాదు - కారులో ఇద్దరూ పెద్దగా విహరించగల వారే! కాని - ఏమిటో - ఆ మనిషికి ఆ సరదా లేదు గానీ - ఉంటే?

కారులో విహారం స్కూటరంత అందంగా వుంటుందా? మోటారు సైకిలంత హుషారుగా - థ్రిల్లింగ్ కారు డ్రైవింగ్ వుంటుందా?

ఉండదు.

మోటారు సైకిల్ కారు కంటే అందంగా వుంటుంది.

వెంటనే - హరిహరం వెనకే తను కూర్చుని వుండగా హరిహరం స్కూటర్ నడుపుతున్నట్లు ఊహలు తరుముకు వచ్చాయి. 'ఘాట్' రోడ్డు మీద - కొండ అంచుల వెంట - లఘు మేఘాల్లోకి ఇద్దరూ ఎగబ్రాకు తున్నట్లు - తల్లో పువ్వులు ఎగిరిపోతూ ఆకాశపు నక్షత్రాల్లో కలిసిపోయి మినుకు మినుకు లాడుతున్నట్లు . . . ఊహలు తెగ తీగలు సాగాయి.

ఆ ఊహల్లో హరిహరమే అపశృతిగా అగుపించాడు. జీవితంలో వున్న వెలితి! - ఆకాశంలో బదులు - ఆ స్కూటర్ మీద . . .

సురేష్ వుంటే . . . . !!!

అప్పుడు --

ఆకాశానికే అందమొచ్చింది.

మబ్బులకే వెండి అంచులొచ్చి వెలిగిపోతున్నాయి.

స్కూటర్‌కే రెక్కలొచ్చి ఎగిరిపోతోంది.

కొండల్లో ఇరువురి నవ్వులూ -కోటి కంఠాలుగా ప్రతిధ్వనిస్తున్నాయి.

స్కూటర్ వేగంగా సాగిపోతుంటే - సురేష్ ముఖబింబానికి ఒకసారి అటూ, ఒకసారి ఇటూ కనిపిస్తూ ఇద్దరి అందాలు ఇనుమడిస్తున్నాయి.

ఆకాశంలో ఒకరికి ముగ్గురు చందమామలు పొద్దు పొడిచినట్లు పొడసూప సాగింది.

ఊహల ఉయ్యాల మీద, జానకి తన వొంటినే మరచి పోయింది. ఆ పూట

వంట సంగతే మరచి పోయింది.

హరిహరం లోపల కొచ్చాడు – అంతలో – ఎందుకో?

"నిద్రా?"

"కాదు"

"ఒంట్లో బాగాలేదా?"

"లేదు"

"మరి వంట చెయ్యలేదా ఏం?"

"లేదు. కేరియర్ తెప్పించరాదూ?"

"అల్లాగేలే?"

"ఒకటి కాదు; రెండూ!"

"ఎందుకూ."

"అవతల భాగంలో కమలా వాళ్లు కూడా ఇంకా రాలేదు. పాపం ఆలస్యంగా వచ్చి ఎప్పుడు వండు కుంటారు? ఎప్పుడు తింటారు?"

"ఏమంత ఆలస్యం కాలేదు – ఫర్వాలేదులే!"

"ఉహూ! తెప్పించండి."

"సరే – అయితే."

హరిహరం వెళ్లిపోయాడు.

ఊహల పరిహరింపూ జరిగింది.

తర్వాత – ! తనకా ఊహలు వచ్చినందుకే నొచ్చుకుంది జానకి.

కేరియర్లు వచ్చాయి. ఎనిమిదయింది.

జానకీ హరిహరంల భోజనాలయ్యాయి. తొమ్మిదయింది.

అప్పుడే బయట స్కూటర్ మోత ఆగింది. గబగబా – రెండో కేరియర్ చేత్తో బుచ్చుకుని, వాకిట్లోకి వెళ్ళి జానకి కమలను కేకేసి పిలిచింది.

"ఇప్పుడా రావటం?"

"ఇప్పుడే?" నవ్వింది కమల – సిగ్గు మొగ్గలు బుగ్గల మీద నిగ్గరిస్తుంటే.

"ఇంకెప్పుడు వంట చేస్తావు? ఇంకెప్పుడు తింటారు."

"ఇప్పుడే!"

"ఏం వద్దులే ! కేరియర్ తెప్పించాను – మీకూ్కడా. ఇది తీసుకెళ్లి భోజనాలు కానివ్వండి."

"ఎందుకండీ ! ఏదో వండేదిగా" అన్నాడు సురేష్ వాకిలి దగ్గర నిలబడి వుండి.

---

● తాంబూల చర్వణం మన సాంప్రదాయం.
దానికి 'జర్దా' మేళవింపు – హిందూ ముస్లిం సమ్మేళనం !

---



"రోజా ఇంత ఆలస్యం చేస్తుంటే అల్లాగే లెండి."

కమల కేరియర్ తో లోపలికి నడిచింది.

నిమిషంలో తాముగా వండని బువ్వతో కడుపు నింపు కున్నారు.

నిజానికి – జానకి చూపిన ఔదార్యానికే ఇద్దరికీ కడుపు నిండి పోయింది.

తర్వాత కార్యక్రమమంతా యధా ప్రకారమే!

హరిహరం 'లా' పుస్తకాలతో తయారు. తమల పాకులు నములూ్త – వకాల్తాలున్న కేసుల ఫైళ్ళు నెమరేస్తున్నారు. జానకి సాయంత్రపు మాయ ఊహల్ని నెమరేస్తున్నది. అవతల భాగంలో .... వెన్నెల దీపపు వెలుగు నీడల్లో – నూతన దంపతుల 'విచ్చల విడి' – అవిచ్ఛిన్నంగా అధునాతన రీతుల్లో సాగిపోతున్నది.

కలకూజితాలు ! గళంలోనూ,

కలస్వనాలూ, నెల కూనలూ ! – గది నిండా ; బుగ్గల మీదా.

పండిన కోరికలు – ఒంటి నిండా.

మధురాధరాలు – మధురాధరాల్లోనూ.

ఇవతల గదిలో జానకి మెదడులోనూ, అవ్వన్నీ మడతలు ముడతలు విప్పు కుంటున్నాయి. తలపు తలపుకూ ఒడలు పులకించి పోతున్నది.

పులకింతలతో, నిలకడ లేకుండా జానకా ప్రక్క మీద పొరలి పొరలి పోతున్నది.

"అబ్బా! కదలకుండా నిద్దరపోరాదూ?" అన్నాడు హరిహరం – చేతిలో పుస్తకం కదిలిపోతుంటే – విసుగు చెంది.

అతని వంక జాలిగా చూసింది జానకి. మనసు మరిగి పోతుంటే – మంచి నీళ్లు తాగి చల్లార్చుకుంది.

ఒక అరగంటకి కాబోలు చెదురు నిద్ర పట్టింది.

తర్వాతంతా – అవతల భాగంలో – అనురాగాలకు కొలమానం లేకుండా పోయింది.

" ఈ తడవ నువ్వూ", బ్రతిమాలే ధోరణిలో మొర ఘొర లాడాడు సురేష్.

"ఉహూ" – అంది – కమల – కన్నులరమోడ్చి.

"ఊ" అంటూ గారాబం చేశాడు సురేష్ బుంగమూతి పెట్టి.

ఆ బుంగమూతిని చూస్తే ముద్దు వచ్చింది కమలకు.

అధర సుధారసాలను వంతులు బోతూ పంతగించి పంచుకున్నారిద్దరూ. వెచ్చని ఊపిరుల కిద్దరూ వెన్నలాగ కరిగిపోయారు. అచ్చమైన నాగుపాముల్లాగ ఇద్దరి కౌగిలింతల్లో ఇద్దరి వెన్నుబాములూ మెలికలు వడిపోయాయి. ముచ్చెమటలు కమ్మిన మొగాల మీద – ముత్యాలు స్వపర బేధాలు విస్మరించి కలిసి మెరిసి పోయాయి.

ఒకరి చేష్టలొకరికి తన్మయత్వం శిఖరాగ్రాల నందుకుంది. మెఱ మెచ్చులు కరిగిపోయాయి. కర కమలాల మెడల కుచ్చులు బిగిసి బిగిసి పోయాయి. అపార పారవశ్యాన్నందుకోలేక కమల కన్దామరలరమోడ్చి వివశయై ఏడ్చివేసింది.

అది విన్నాడు హరిహరం ! ఆశ్చర్యంలో మునిగి పోయాడు.

నవ్వుల నవ్వడింతలో మారిపోయిందేమని రివ్వున లేచాడు.

వెళ్లి తలుపుకున్న రంధ్రంలోంచి అవతల గదిలోకి చూశాడు. తర్వాత తనలో తనే నవ్వుకున్నాడు.

మరొకసారి అటు చూశాడు. తర్వాత తన గదిలోకి చూశాడు జానకి వంక .

జానకి నిద్దర పోతోంది.

మై మరచి గాఢ నిద్దర పోతోంది.

గాఢమైన నిద్రలో - చీర తొడ వరకు తొలగి పోయింది కూడా . మొగం, మీద సగం దాకా టేబుల్ లైట్ కాంతి ద్విగుణంగా మెరిసిపోతోంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఉరోజాలు ఉబికి ఉబికి పడ్తున్నాయి - ఆహ్వానాన్నందిస్తున్నాయి.

నీలి నీలి వెలుగు నీడల చిత్రాలెన్నో హరిహరం మనోమందిరంలో కదలి మెదల సాగాయి. మెదిలి మెరవ సాగాయి. తొలి యవ్వనం మొలకెత్తింది. చెంత జేరి 'జానకీ' అంటూ పలకరించాడు. జానకి పలకలేదు. 'జానకీ' అంటూ ఒంటి మీద చెయ్యి వేశాడు. జానకి ఉలకలేదు.

తమకం పెరిగిన కంఠస్వరంతో నెమ్మదిగా 'జానకీ' అంటూ కుదిపి వేశాడు. జానకి కదల లేదు.

మీదకు వాలి ఆ ముద్దరాలి ముద్దు మొగాన్ని తన చేతుల్తో అద్ది వేశాడు.

చివ్వాలున లేచింది జానకి - పగగొన్న తాచు పాములాగ 'ఛీ' అంటూ చీదరించుకుని - గిరున పార్లుకింత పెట్టి - మళ్లా నిద్దరపోయింది.

ఖిన్నుడై హరిహరం ప్రక్క మీదకి వేలాడిపోయాడు.

చప్పగానే ఆ రాత్రి గడచి పోయింది. చప్పగా తెల్లారి పోయింది.

* * *

---

ఓ అందమైన సేల్స్ గర్ల్ ఓ ఇంటి తలుపు తట్టింది.

ఇంటాయన తలుపులు తెరిచాడు "ఎవరూ?" అంటూ.

ఆయన్ను చూసి చిరునవ్వుతో "ఇంట్లో మీ ఆవిడ ఉన్నారా?" అనడిగింది సేల్స్గర్ల్.

"మా ఆవిడ ఇంట్లో లేదండీ. కానీ మీరావిడ కోసం ఇలా లోపలికి వచ్చి వెయిట్ చెయ్యొచ్చు. ప్రసవానికి పుట్టింటికి వెళ్లింది" అని అన్నాడాయన.

---



4

రోజులు గడుస్తున్నాయి.

రోజులెన్ని గడిచినా దినచర్యలో మార్పేమీ లేదు. 'తమకాల'లో పెరుగుదలే కాని, తరుగుదలా లేదు. ఒడుదుడుకు లేమీ లేకుండానే నిండుబండి తారు రోడ్డు మీద తాపీగా నడిచినట్లు జీవితం సాగిపోతోంది - ఇంట్లో కొత్త సంసారంలాగే అరుగు మీద పిల్లల సంసారం గూడా.

పిల్లలతో కొత్తదంపతుల చనువే రోజు రోజుకు పెరిగిపోతోంది. కమల కాఫీ కాస్తుంటే - పిల్లలిద్దరూ చెరొక ప్రక్క చేర్తారు. నీల కాఫీ పొడి అందిస్తుంది. రంగడు గ్లాసులు తీసుకు వస్తాడు. కాఫీ తయారయిన తర్వాత సురేష్కు కాఫీ గ్లాసు అందించటానికి పిల్లలిద్దరూ పోటీ పడతారు. ఇంతలో కమలే కాఫీ తీసుకెళ్లి సురేష్కిస్తుంది. నలుగురూ నవ్వుకుంటూ కాఫీ తాగుతారు.

తర్వాత కమల వంట ఆరంభిస్తుంటే ఇక స్టౌ దగ్గర్నించి కదలనక్కర్లేదు. పిల్లలిద్దరూ అన్నీ అడక్కుండానే అందించేస్తారు. ఒక్కొసారి ఇద్దరి మధ్యా ఏహోపేచీలు వస్తాయి. పోటీలు పడి పరుగెత్తి - పట్టుదల పట్టి ఒకరి చేతిలో దొకరు లాక్కునీ - తెచ్చే డబ్బా కింది వదిలేస్తారు. తర్వాత కమల కోప్పడుతుందేమోనని మిర్రి మిర్రి చూస్తారు.

కమల కోప్పడదు . పైగా నవ్వుతుంది. వెంటనే ముగ్గురూ కలిసి క్రింద వలికిపోయిన దాన్నంతా మళ్లీ డాబ్బా కెత్తుకుంటారు.

మధ్యాహ్నం పూట కమలకు పిల్లి లిద్దరూ మరింత సన్నిహితులవుతారు. కమలతో ఆ ప్రక్క మీదే చేర్తారు. చెరొక వైపూ ముద్దు ముద్దుగా ఆ కబురూ ఈ కబురు చెప్తారు. నవ్వుకుంటూ కమల 'ఊ' కొడుతుంది. తర్వాతెప్పుడో కబుర్లు వింటూనే నిద్ర పోతుంది. అప్పుడు పిల్లలిద్దరూ లేచి వెళ్లి - అరుగు మీద చేర్తారు.

అక్కడ వాళ్ళ చిన్న సంసారం అవిచ్ఛిన్నంగా సాగిపోతుంది. అప్పుడప్పుడూ హరిహరం గారి క్లయింటులెవరో అరుగును ఆక్రమిస్తుంటారు. అల్లాంటి రోజున పిల్లలిద్దరూ తోటలో చెట్టు క్రింద సంసారం సాగిస్తారు.

అన్నాలకు తమ తమ ఇళ్లకు ఎప్పుడెళ్లి వస్తారోగాని - తిన్న తర్వాతంతా ఈ ఆవరణలోనే కాలక్షేపం . . . .

వేసంగి సెలవులు కూడానేమో! తల్లి తండ్రులు వీరి సంగతి పట్టించు కోవటమే మానేశారు. ఎక్కడో అక్కడ ఆడుకుంటే చాలు - ఇంట్లో అల్లరి చెయ్యకుండా. . . .

* *

ఓ రోజున సురేష్ స్కూటర్ మీద బ్యాంకుకు వెళ్లి పోయాడు. మరో అరగంటకు కూరల సంచీ చేత్తో బట్టుకుని - ఇంటికి తాళం వేసి బజారుకు




బయల్దేరింది కమల . పిల్లలిద్దరూ అరుగు మీద ఆడుకుంటూ కమలకు 'టాటా' చెప్పారు. అదీ మామూలే . . . కొన్ని మామూలు తప్పించి, ఆ వేళ మరో 'ఆగంతకుడొ'చ్చాడు. లావుగా చిన్నగేటుకు సరిపోను వున్నాడు. సరాసరి వరండాలోకి వచ్చేశాడు. నీల వంట చేసుకుంటూ – ఆయన వంక ఆశ్చర్యంగా చూసింది.

రంగడు పేపరు చూస్తున్నవాడు ఆపి, ఆయన వంక తిరిగాడు.

"సురేష్ వున్నదీ ఇంట్లోనేనా?" అన్నాడాయన ఉరుముతున్నట్లు.

"ఇదే – ఇదే " అన్నారు పిల్లలు.

"అయితే తాళం వేసి వుంది . ఇంట్లో లేరా?"

"లేరు. బజారు కెళ్లారు."

"ఎప్పటికొస్తారో " నంటూ విసుక్కున్నాడాయన.

తర్వాత వరండాకో ప్రక్కగా వున్న 'నాపరాతి' అరుగు . మీద కూర్చున్నాడు. తర్వాత నడుం వాల్చి నిద్రపోయాడు. కొద్దిగా గుర్రు ఆరంభమయింది గూడా . . . ఆ గుర్రు వింటూ దగ్గర చేరి పిల్లలిద్దరూ నవ్వుకుంటున్నారు.

అంతలో గేటు మళ్లీ చప్పుడయింది. మరో సన్నపాటాయన ప్రవేశించాడు. సురేష్ వయసే వుంటుంది. అచ్చం కోతిలాగే వున్నాడు. కోతిలాగే పరుగు పరుగున వొచ్చాడు –అరుగు మీదికి.

"సురేష్ గారి ఇల్లు ఇదేనా?" పిల్లలింకా జవాబు చెప్పలేదా వింత మృగానికి . . , అంతలో అరుగు మీదు పడుకుని వున్న పెద్ద మనిషిని గుర్తు పట్టాడతను.



"మీరా ! దామోదరంగారూ!"అంటూ దగ్గర కెళ్లాడు.

ఆ దామోదరం గురకతోనే సమాధానం చెప్పాడు కాని కదలనన్నా లేదు.

"దామోదరం గారూ " పెద్దగా అరిచాడా కుర్రాయన.

"ఊఁ" అని విసుక్కుంటూ దామోదరం నాపరాయి మీదే పొర్లి – నిద్ర సాగించాడు. కుర్రాయన వదల లేదు.

"దామోదరం గారూ!" మీద చెయ్యి వేసి కుదిపి కుదిపీ నిద్ర లేపాడు. దామోదరం నిద్ర లేచాడు. లేచి కూర్చో లేదు.

"నువ్వు హనుమంత రావువి కదూ?" అని మాత్రం అన్నాడు నిద్రలోనే.

"అవును హనుమంతునే . . . . బహుకాల దర్శనం. ఎన్నాళ్లకు మళ్లీ ఎన్నాళ్లకు చూశాను మిమ్మల్ని . ఎప్పుడో సురేష్ చెల్లెలి పెళ్లికి కలుసుకున్నాం. అప్పుడు కొట్లాడుకున్నాం గూడా. మళ్లా ఇన్నాళ్లకి. కాస్త జరగండి . నేనూ కూర్చుంటాను."

"వద్దులే . అల్లా నుంచో ! నేను నడిచి నడిచీ – ఇల్లు వెతుక్కుంటూ వచ్చి వచ్చీ – అలిసి పోయాను పెద్దవాణ్ణి ! నీకేం రోగం. నువ్వు కుర్రవాడివి ! నుంచో ", మరీ సర్దుకుని అరుగు మీద చోటు లేకుండా ఆక్రమించుకున్నాడాయన . . .

"అబ్బ లెద్దురూ ! కాస్త నేను రైలు దిగి బ్యాంకు దాకా నడిచాను. అక్కడ ఎడ్రస్సు కనుక్కుని మళ్లా ఇక్కడ దాకా నడిచాను. ఇంకా భోజనం చెయ్యలేదు. కాస్త కాళ్ళు ముడుచుకోండి – నాకు కాస్త చోటు చాలు."

"మరేం ఫర్వాలేదు. అల్లా గోడకు ఆనుకుని కూర్చో నాకు నిద్ర వస్తోంది. పడుకుంటా ! నిద్ర లేపకు " అంటూ ఆయన కాళ్లు నిగడదన్ని – కళ్లు మూసేశాడు.

'లేస్తారా? లేవరా?"

"లేవను"

"లేవక పోతే ఏం చేస్తానో తెలుసా?"

"ఏం చేస్తావేం?"

"అరుగు మీద నుంచి తోసేస్తాను."

"నీ తరం కాదు. నీ అబ్బ తరం కాదు."

"తోసేస్తాను . చూస్తారా?"

"చూస్తాను"

హనుమంతు శక్తినంతా కూడ గట్టుకుని – తోసెయ్యటానికి ప్రయత్నించాడు. అయినా ఆ దృఢకాయాన్ని కాస్తన్నా కదిలించలేకపోయాడు.

పిల్లలిద్దరూ నోళ్ళు తెరుచుకుని ఈ వింత అంతా చూస్తూ నుంచున్నారు – ఎవరు నెగ్గుతారో – ఏమో!!

దామోదరమే నెగ్గాడు. హనుమంతే ఓడిపోయి మరింత కేకలెయ్య సాగాడు.

ఇక కేకలెయ్యలేక మరో ఉపాయం ఏదన్నా వుందేమోనని ఆలోచించాడు. తర్వాత అదృష్టాన్ని వెతుక్కుంటూ ఇంటి వెనక్కి వెళ్లాడు. అక్కడ దొడ్డి వాకిలికి అడ్డగడియ వదులుగానే వుంది. చుట్టు ప్రక్కల వెతికితే ఒక వెదురుబద్ద దొరికింది. దాంతో గడియ పైకెత్తేసాడు

అప్పుడే కమల వాకిట్లోకి వచ్చింది. అరుగు నిండా వున్న దామోదరాన్ని చూసింది "ఎవరన్న"ట్లు పిల్లలకు సాంజ్ఞ చేసింది.

'ఏమో !! ఎవరో నన్నట్లు చేతులు తిప్పారు పిల్లలు.'

"ఎవరండీ మీరూ?" అంటూ దగ్గర కెళ్లింది కమల.

దామోదరం గూడా నిద్ర నటిస్తున్నాడంతే ! ఏమో! హనుమంతు వచ్చి ఎక్కడ కిందికి తోసేస్తాడోనన్న భయమే లోపల.

"వచ్చావా తల్లీ . . . త్వరగా తాళం తియ్యి. ఎక్కడికో వెళ్లావనుకున్నా ! ఇంత సేపు కూరగాయలకేనా? కాసేపుంటే నేనే వచ్చే వాడిని నేనే తెచ్చే వాణ్ణిగా!"

"మీరూ? . . . మీరూ?"

మాటలు తడుము కుంటోంది కమల.అంతలోనే - "నేను సురేష్ వైపు బంధువుని లేమ్మా. నువ్వు సరిగ్గా నన్నెరగవ్! అవటానికి బంధుత్వం దూరమే గాని - నాకూ సురేష్ తండ్రికీ కుడి ఎడమలు లేవు. సరే - వాళ్ళ నాన్న నన్ను 'అరేయ్', 'ఒరేయ్' అనేవాడు. వాళ్లమ్మన్నేను 'ఒసేవ్', 'గిసేవ్' అనేవాణ్ణి . చిన్నప్పుడు - సురేష్ పుట్టక ముందు, వాళ్ల నాన్నా నేనూ ఒక కంచంలోనే భోంచేసేవాళ్ళం."

"అల్లాగేనేమొ " అనుకుంది లోపల కమల. తర్వాత "లోపలికి రండి." అంటూ తాళం తీసింది . . . .

దామోదరం తల క్రింద సంచీ తీసుకుని - వెనకే లోనికి ప్రవేశించాడు. మొదట ఇద్దరూ చూసింది ప్రక్క మీద హనుమంతునే.

ఒక మొకాలి మీద రెండో కాలేసుకుని ఆడిస్తూ - బీడీ కాలుస్తూ - కనిపించాడు హనుమంతు. 'ఎవరదీ?' అని తెల్లబోయింది కమల.

"లోపల కెల్లా వచ్చావ్!" అంటూ గాండ్రించాడు దామోదరం.

"దొడ్డిదోవనే - రాజమార్గాన వచ్చాను" అన్నాడు హనుమంతు దర్జాగా ! తర్వాత తనే తక్కిన విషయాలు ముచ్చటించాడు.

"నువ్వేమీ తెల్లబోకు చెల్లాయ్. నేను స్వయానా సురేష్ అన్నగారికి బావమరిదిని. సురేష్‌ను ఆఫీసులో కల్సుకునే వచ్చాను. వాడే ఈ ఎడ్రస్ రాసిచ్చాడు."

"పాపం ! ఎక్కడెక్కడో తిరిగి వస్తున్నావు. నా కోసం నువ్వేమీ శ్రమ



పడకు. నా భోజనం అయింది. నాక్కాస్త కాఫీ యిచ్చెయ్యి చాలు " అంటూ దామోదరం వంక చూశాడు హనుమంతు. ఆ మాటలు దామోదరాన్ని పెద్ద ఇబ్బందిలోనే పెట్టాయి. ఆకలితో ఆ మహాకాయం నక నక లాడుతోంది. కొర కొరా హనుమంతు వంక చూశాడాయన.

"నాక్కాస్త ఏదో ఉడకేసి పెట్టమ్మా . కూరేదన్నా చెయ్యక పోయినా ఫర్వాలేదు. ఏదో కాస్త పచ్చడి మెతుకులు చాలు. మజ్జిగ ఎల్లాగూ వుంటాయిగా!"

కమలకిక తప్పలేదు. "వండి పెడ్తాను లెండి" అంటూ లోపలికి నడిచింది.

ఇద్దరు బంధువులూ పడకగదిలో మిగిలారు.

"మట్టూ మర్యాదల్లేవు మనుషులకి. పెద్దలంటే గౌరవం లేదు. లే - జరుగు. వెధవ కొంపలో మరో కుర్చీ కూడా లేదు. జరుగు. నేనూ పడుకుంటాను."

"జరగను"

"జరగవ్?"

"జ . . .ర . . . గ . . .ను."

"జరగమంటుంటే!"

"జరగనూ"

"జరగక పోతే - ఎరగవ్!"

"ఎరగను"

అమాంతం ఒక్క తోపు తోసి, దామోదరం ప్రక్క మీది కొరిగి పోయాడు. హనువంతు మీద పర్వతమే పడ్డట్లు అనిపించింది. హనుమంతు అంత తొందరగానూ జరిగాడు. కానీ - ఒక చెయ్యి దామోదరం క్రింద వుండి పోయింది.

"అమ్మో! అమ్మో! చెయ్యి! నొప్పి !" అంటూ విలవిల లాడి పోయాడు హనుమంతు - కొంత నిజమే! కొంత నటన " చెయ్యి తీసుకోనియ్యి."

"నివ్వను"

"నొప్పి ! నొప్పి!"

"పుట్టనియ్యి"

"నలిగిపోతోంది చెయ్యి!"

---

ఒక యాభై ఏళ్లావిడ తన స్నేహితురాలితో " నాకు నా యవ్వనపు రోజులు గుర్తుకు వచ్చినప్పుడల్లా సిగ్గుతో చచ్చిపోతున్నాను" అని అంది.

"అంత కాని పని ఏం చేశావప్పుడు" అడిగింది స్నేహితురాలు.

"ఏమీ చేయలేదనే నా బాధ" అంది యాభై ఏళ్లావిడ.

"పోనియ్యి"

"విరిగిపోతోంది ఎముక."

"కానియ్యి."

"అయితే లేవవూ?"

"ఛస్తే!"

"మీద పడి కరుస్తా!"

"జాగ్రత్త - పళ్లు విరిగి పోతాయి"

"అంత పనీ చేశాడు హనుమంతు - మరుక్షణంలో.

ఏదో నెమ్మదిగా కాదు - గట్టిగా - కసిదీరా . . .

"ఓరి నీ అమ్మ కడుపు కాలా ! కొరకేస్తున్నావురా!"

". . . . . . . . ."

"నమిలేస్తాలేరా?"

". . . . . . . . ."

"ఆకలేస్తే అన్నం తినరా! నన్ను తింటావేం? ఆగులేస్తా"

"లే" అన్నాడు హనుమంతు - ఇక అనక తప్పక.

అమాంతం లేచి దామోదరం మళ్లీ మీద వెంటనే పడిపోయాడు. పర్వతం క్రింద హనుమంతు నలిగి పోతున్నాడు. మళ్లీ కొరకటానికి ప్రయత్నించాడు గానీ, దామోదరం నోటి కందనంత దూరంలో వున్నాడు.

మధ్యలో కమల ఓసారి తొంగి చూసి - నవ్వు కుంటూ ప్రక్క కెళ్లి పోయింది. కిటికీలోంచి చూస్తూ పిల్లలిద్దరూ పగలబడి నవ్వసాగారు.

అవతల భాగంలో జానకికి మంచి నిద్రా భంగమే అయింది. విసుగ్గా లేచి - వెనక నుంచి వంటింట్లోకే వచ్చింది.

"ఎవరండీ ! వాళ్లా!"

- తొంగి చూసింది జానకి కూడా!

ఆగి - వంగి చూశాడు హనుమంతు !

"బంధువుల్లా లేరు. రాబందులులాగున్నారు. ఆయన రాగానే కనుక్కొని - ముందు వాళ్లను వెళ్ల గొట్టండి " జానకి వెళ్లి పోయింది. కమల వంటలో మునిగి పోయింది . . . . .

వంటయ్యేదాకా పక్క మీద 'రాబందులు' కుస్తీ పడ్తూనే వున్నారు.

'వంటయింది లేవం'డనగానే - దామోదరం లేచాడు. పీట మీద కెళ్లి కూర్చున్నాడు కూడా.

"నాకూ వడ్డించు ; చెల్లాయ్. నాకూ ఆకలేస్తోంద"ంటూ హనమంతూ వెళ్లి పీట వాల్చుకున్నాడు.

వేడి వేడి అన్నం అంతా, దాసీ దానికి మిగిలిందీ కలిపి ఇద్దరికీ మస్తుగానే



విశ్వశ్రీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల

ESTD 1989

కృష్ణనగర్, సిరిస్ వద్ద, బందరు రోడ్

విజయవాడ-7

విజయవాడలో ప్రసిద్ధి చెందిన అధ్యాపకులచే శిక్షణ!

ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలలో జూనియర్ ఇంటర్ M.P.C., Bi.P.C., (బాలురకు మాత్రమే)

ఇంటర్ సిలబస్‌తోపాటు ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రన్స్‌కు కూడా శిక్షణ ఇవ్వబడును.

గౌరవ సలహాదారులు:

శ్రీ M. నరసింహా రావు
(M.N.R) గారు, M.A., (MATHS)
శాతవాహన కాలేజి

శ్రీ T. కృష్ణమూర్తి
(T.K.M) గారు, M.Sc., (Physics)
శాతవాహన కాలేజి

శ్రీ K. వెంకటేశ్వరరావు
(K.V.R) గారు, M.Sc., (Physics)
శాతవాహన కాలేజి

శ్రీ P. రాజేంద్ర ప్రసాద్
(P.R.P) గారు, M.Sc., (CHEMISTRY)
శాతవాహన కాలేజి

అప్లికేషన్ మరియు ప్రాస్పెక్టస్ కౌంటరు రూ. 20/- స్వయంగా గాని, రూ. 25/- ప్రిన్సిపాల్ గారికి M.O. ద్వారా చెల్లించి పొందవచ్చును.

ప్రిన్సిపాల్

PHONE : 52822.

వడ్డించింది కమల.

అందులో హనుమంతు కాస్త తొందరగానే లేచాడు. లేచిన వెంటనే ప్రక్కను ఆక్రమించాడు కూడా.

దామోదరమే ఏమీ తొందరపడలేదు. అడిగి మరీ వడ్డించుకుని తాపీగానే లేచాడు.

తర్వాత సరాసరి వరండాలోకి సంచీతో సహా కాలు సాగించాడు. అక్కడ సంచీ లోంచి ఒక పేక పెట్టె తీశాడు. ముక్కలు కలపటం మొదలు పెట్టాడు. తర్వాత పేషన్స్ ఆట సాగించాడు తనొక్కడే.

పేక ముక్కలు కలుపుతున్న శబ్దం హనుమంతును ఇట్టే ఆకర్షించింది.

"పేక వుందా మీదగ్గర? చెప్పరేం?" అంటూ దగ్గర కెళ్లాడు.

"ఆడదామా " అంటూ అరుగు మీద చతికిల బడ్డాడు.

"డబ్బులున్నాయా?" అన్నాడు దామోదరం.

"తెస్తా" అంటూ లోపలికెళ్లాడు హనుమంతు – సరాసరి వంటింట్లోకి

"చెల్లాయ్ ; చెల్లాయ్; రెండు రూపాయలుంటే ఇవ్వు . మన పరువు పోయే సమయం ! అందుకనీ " అన్నాడు. కమల వెళ్లి – అలమార లోంచి – రెండు రూపాయలు తీసి యిచ్చింది.

పిల్లలు అప్పటికే వరండాలో ఏదో ఆడుకుంటున్నారు.

"ఏమిటీ పిల్లలూ ! వెధవ ఆటలూ మీరూనూ! పొండి ; చదువు కోండి." అంటూ వాళ్లను తరిమేశాడు హనుమంతు . వాళ్లు తోటలోకి పరుగెత్తారు.

అక్కడే – పిల్లల సంసారం ఆట చోటనే బంధువులిద్దరూ పేకాట వేశారు. ఆట ఆటకీ పెద్ద పెట్టున మాటలు? పేచీలు! పెడ బొబ్బలు! చిన్న పిల్లలు ఎంత ఆడుకున్నాఅంత గోల లేదు. గదిలో కమలకు నిద్ర పట్టలేదు. అవతల గదిలో వున్న జానకికీ విసుగు పుట్టింది. అయినా?

"ఏం బంధువులో ఏమో!" – కమల ఊరుకుంది. జానకీ మిన్నకుంది. ఆ వేళ హరిహరం ఎందుకనో ముందరే కోర్టు నుంచి వచ్చాడు. అయినా అరుగు మీద గోల – గోలగానే సాగిపోతోంది. సాయంత్రం సురేష్ ఇంటికి వచ్చే దాకా సాగింది.

5

సురేష్ ఇంటికి వచ్చాడు.

దామోదరం – హనుమంతూ పేకాటా – ఆ పేచీలు కట్టిపెట్టి – సురేష్ చుట్టూ జోరీగల్లాగా మూగారు.

ముందు వాళ్లను చూడగానే సురేష్ నిర్ఘాంత పోయాడు.

"ఎప్పుడొచ్చారు?"

"ఎల్లా వచ్చారు?"



"ఎందుకు వచ్చారు?"

ప్రశ్న మీద ప్రశ్న వేశాడు సురేష్.

సవివరంగా అంతా వాళ్లు వినిపించారు. "నువ్వీ ఊళ్లో వుద్యోగం చేస్తున్నావని తెలుసుగా! నచ్చి బ్యాంక్‌లో వాచ్‌మన్‌ని కనుక్కున్నాను." అన్నాడు దామోదరం.

"నేను ఎటెండర్‌ని కనుక్కున్నాను" అన్నాడు హనుమంతు.

"ఫలానా ప్లీడరు గారింట్లో వుంటున్నారూ అన్నాడతను."

"హరిహరం గారింట్లో అన్నాడు నాతో"

"ఇక ఫలానా ప్లీడరు గారి ఇల్లెక్కడా? అంటూ ప్లీడర్లనందర్నీ అడుగుతూ వచ్చాను. అమ్మమ్మో ! చాలా శ్రమ అయిపోయిందిలే"

"నాకేం శ్రమ లేదు. నేరుగా వచ్చాను."

ఒకరిని మించి ఒకరు – ఒకరి మాట మీద ఒకరు – ఒకరి మాట ఒకరు వినకుండా – తమ తమ ప్రతాపాలు వర్ణించారు.

తర్వాత ఇద్దరూ కమల గుణగణాల గురించీ – అతిథి మర్యాదల గురించీ పొగడ్తలు సాగించారు. హనుమంతు వారి ఆదర్శ వివాహం గురించి మరింత పొగిడాడు – దామోదరంతో పోటీ పడి.

ఎనిమిది గంటల దాకా సురేష్ కదల లేదు – వదల్లేదు. వంటయింది.

భోజనాలయ్యాయి అందరివీ.

అప్పుడు పడక లెట్లాగా అన్న సమస్య వచ్చింది.

"ఒరే సురేష్ పెద్దవాణ్ణి. నేనీ మంచం మీద నడుం వాలుస్తారా! కింద పడుకోలేనూ!" అంటూ –పర్మిషన్ రాకుండానే నడుం వాల్చేశాడు దామోదరం.

"సరే ఏం చేస్తాం . నాకూ క్రింద పడుకునే అలవాటు లేదు. కాని సర్దుకు పోవాలి బంధుత్వం అల్లాంటిది.

"నాకీ చాపా దిండూ చాలు" అంటూ హనుమంతు వాటిని అందుకున్నాడు. కింద వేసుకున్నాడు. చోటూ ఆక్రమించేశాడు పూర్తిగా ! వంటిల్లే మిగిలింది దంపతులకు.

ఈ మాటలన్నీ వినబడ్డాయో! ఆమెకే తట్టిందో పనివాడి చేత మంచం ఒకటి పంపించింది జానకి. అది వంటింట్లో వేసుకుని, ఆలుమగలు తలుపులేసుకున్నారు.

'పడక' చాలా బాగా కుదిరిందేమో ! – పడుకోగానే నిద్ర పట్టేసింది దామోదరానికి . గాఢ నిద్రే పట్టింది. అందులో గుర్రు కూడా.

గుర్రు ! గుర్రంటే గుర్రు కాదు – ఒకసారి మోటారు స్టార్టు కానట్లు ! మరో నిమిషంలో గండు పిల్లులు కయ్యమాడుతున్నట్లు ! ఇంకోసారి కారుమేఘాలు ఘూర్ణిల్లుతున్నట్లు . . .



గుర్ గుర్ – ఫట్ మంటూ ఒకసారి . . . .

గుర్ గుర్– ఛస్ అంటూ ఒకసారి . . . .

గుర్ గుర్ – హాస్ అంటూ ఒకసారి రకరకాల భీషణ వినాదాంతో డాబా గది ప్రతిధ్వనించింది.

హనుమంతు లేచి – తల పట్టుక్కూర్చున్నాడు. కొంతసేపటికి చాప దిండుతో బయటకెళ్లి వరండాలో పక్కేసుకున్నాడు.

వంటింట్లో ఆలుమగలు నిద్ర పట్టక గోడకు జేర్ల పడి కూర్చున్నారు.

గోడ మీద వంకెకు తగిలించిన విసన కర్ర అదిరి, అదిరి పడి – చివరకు ఎగిరి క్రింద పడింది.

అవతల గదిలో హరిహరానికి 'లా' పుస్తకంలో ఒక అక్షరం తల కెక్కి లేదు.

"ఎవడా రాక్షసుడు?" అని గద్దించాడు కొంతసేపటికి.

"వాళ్ల చుట్టమట!"

"రేప్పొద్దున వాళ్లను ఖాళీ చెయ్యమను."

గదికీ – గదికీ మధ్య వున్న వాకిలి తలుపులు గుర్రు గుర్రుకూ ఉర్రూతలూగుతున్నాయి.

గుర్ గుర్ గుర్ గుర్ – బుస్

గుర్ గుర్ గుర్ గుర్ – బుస్

అంతలో పొరుగింటి వాళ్ళూ ఇరుగింటి వాళ్లూ లేచి వచ్చి తలుపులు కొట్టారు. సురేష్ వెళ్లి తలుపు తీశాడు.

"మీరు మెలుకువగానే ఉన్నారా? మీ వంటింట్లో ఏవో పిల్లులు జేరి. ."

అంతలో కుంభ కర్ణుడే వాళ్ల కంట బడ్డాడు.

"ఎవర్నాయనా!"



"మా బంధువులెండి."

"అయినా సరే . వెంటనే రేపు వెళ్ల గొట్టండి. ఇల్లాగయితే ఈ వీధిలో ఎవ్వరికీ నిద్దర ఉండవు."

"మాకు మాత్రం ఉన్నాయా?" అన్నాడు హనుమంతు నవ్వుతూ. ఇంత గొడవ జరిగినా కుంభ కర్ణుడు గుర్రు పెడ్తూనే ఉన్నాడు.

ప్రతి అయిదు నిమిషాలకొకసారి గుర్రు శైలి మారుతున్నది.

గుర్ర్ – గుర్ర్ – గుర్ర్ – టప్ టప్ టప్ టప్ . . .

గుర్ర్ – గుర్ర్ – గుర్ర్ – టప్ టప్ టప్ టప్ . . .

హనుమంతు పైకే శివ స్తోత్రం చెయ్య సాగాడు.

సురేష్ ఉస్సూరుమంటూ వంటింట్లో చతికిలబడ్డాడు.

అవతల భాగంలో హరిహరం కారాలూ మిరియాలూ నూరుతున్నాడు.,

అందరిలోకీ నవ్వుతున్నది జానకే.

ఆ నవ్వు అవతలగదిలో గుర్రుకు కాదు. . . హరిహరాన్ని ఏడిపించటానికే.

"కోర్టులో సాక్ష్యాల్ని నోరు మూయించ గలరు. సరే . ఈ 'హోరు' మూయించండి చూద్దాం . తెలివి . . . ."

మళ్లా నవ్వు .

నిలబడి నవ్వు . కుర్చీలో కూలబడి నవ్వు. పక్క మీద తిరగబడుతూ నవ్వు . . . ఆ గుర్రు తనూ అనుకరిస్తూ నవ్వు . కోపం , ఉక్రోషం పట్టలేక – హరిహరం మధ్య తలుపు దాకా వెళ్లాడు.

"ఏమండీ సురేష్ గారూ . . . ఇక మేం నిద్ర పోనక్కర్లేదా."

"అదే నేనూ చూస్తున్నానండీ . . . ఏం చెయ్యటానికీ తోచటం లేదు."

"చూస్తున్నారు గదా ! నేను మీరూ ఆనందిస్తున్నార సుకున్నాను. చూడండి ; చూడండి ఏదో ఒక ఉపాయం లేదా నేను పోలిసుల్ని పిలిపించాల్సి వస్తుంది."

అంతలో హనుమంతు కేదో ఉపాయం తట్టింది.

"ఆగండి ; ఆగండి నాకో ఉపాయం తట్టింది . . . . ఈ వేలు ముక్కు దగ్గర పెడితే గుర్రు తగ్గుతుందంటారు."

ఆ ఉపాయాన్ని అమలు జరిపి చూశాడు.

గుర్రు మాత్రం తగ్గలేదు.

దొడ్లోంచి పచ్చడి బండ ముక్కు పక్కనే పెట్టి చూశాడు.

గుర్రు గుర్రుకీ పచ్చడి బండ ముక్కు దగ్గరికీ దూరానికీ దొర్ల సాగింది.

అది చూసి అందరూ నవ్వసాగారు.

హరిహరం ఉంకెలు.

పొట్ట పగల నవ్వులు.

కళ్లు నులుముకుని . . . . . ఒక్కసారి దామోదరం కళ్లు తెరిచి చూశాడు – ఎల్లాగో.

"ఏమిట్రా ఈ గోలా ! ఎందుకూ నవ్వుతున్నారు. ఆ అర్ధరాత్రి నవ్వు లేమిటి?"

"ఏం లేదు. మీ గుర్రులో మాకింత వరకూ నిద్ర లేదు లెండి అందుకనీ . . ."

"నేనా! గుర్రా!! బాగుంది. నేను గుర్రు పెడతానని నా జన్మలో ఇంత వరకూ ఎవ్వరూ 'రిమార్క్' చెయ్యలేదు."

"ఏమో ! మా పిన్నిగారు . . . అదే – 'మీ పెళ్లాంగారు' మిమ్మల్ని ఎందుకువదిలేసిందో నా కివ్వాళ తెలిసింది" అన్నాడు హనుమంతు.

"ఎందుకనీ?" రెట్టించాడు దామోదరం.

" ఈ గుర్రు భరించలేకే?"

"ఏడిశావ్ ! అట్టే పేలావంటే – ఈ పచ్చడి బండతో నిన్ను నూరి పారెయ్యగలను."

"ఏదీ ? నూరి పారెయ్యండి చూద్దాం."

భీముడిలాగా కోపంతో – పచ్చడి బండ తీసుకుని , దామోదరం వెంట పడ్డాడు.

గదిలోనే నాలుగు స్తంబాలు ఆట ప్రారంభించాడు హనుమంతు.

"మీరందరూ వెళ్లి సుబ్బరంగా పడుకోండర్రా నేనీయన్ని తెల్లవార్లూ ఇల్లాగే ఆట ఆడిస్తాను" అంటూ గెంతుతూ – తప్పించు కుంటున్నాడు –

అంత కంటే గత్యంతరం లేక అదే మంచిదనుకున్నారు.

దామోదరం తరుముతుంటే – హనుమంతు పరుపు మీద పరుగు లెత్తాడు. అలమారు మీద కెగిరి కూర్చున్నాడు.

గోడల మీద కెగ్రబాకి కూర్చున్నాడు. అమిత చాకచక్యంగా తప్పించుకున్నాడు గనక గానీ – లేకపోతే – దామోదరం పచ్చడి బండలో తలబ్రద్దలు కొట్టేసేవాడే.

ఆ రాత్రి కల్లాగే తెల్లారింది.

తెల్లారిన తర్వాత చూస్తే – గోడల కున్న పఠాలన్నీ, బద్దలై నేల మీదున్నాయి. గదిలో హనుమంతుకేం దెబ్బ తగల లేదు.

ఉదయానికి రాజీ అయింది. దామోదరం హనుమంతూ వరండాలో అరుగు మీద కూర్చుని – కాఫీకి ఎదురు చూస్తూ కబుర్లు చెప్పు కుంటుంటే – జానకీ హరిహరం వచ్చి ఇద్దర్నీ చూసి వెళ్లారు. తర్వాత వీథిలో వారందరూ వచ్చి 'సర్కస్' లో వింత మృగాన్ని చూసినట్లు చూసి వెళ్లారు.




# AMIRUDDIN
## RESIDENTIAL COLLEGE

Aravinda Nagar, NELLORE - 524 003.
Phone : 4552

* 1990-91 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్ అడ్మిషన్లు.
* M.P.C, Bi.P.C గ్రూపులకు మాత్రమే ప్రవేశం.
* తెలుగు ఇంగ్లీషు మీడియంలలో బోధన.
* విద్యార్థి, విద్యార్థినులకు హాస్టల్ వసతి, క్లాసులు వేరు వేరుగా ఉంటాయి.
* ప్రాస్పెక్టస్, అప్లికేషన్ల కొరకు రూ.20.00.లకు D.D./M.O. కరస్పాండెంట్ పేరిట పంపాలి.

కమల కాఫీ కాస్తోంది. సురేష్ ఇద్దర్నీ వెళ్లి పొమ్మని చెప్పటం ఎల్లాగా అని ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నాడు. జానకి తొంగి చూసి వెళ్ళింది. ఆ వెనకనే హరిహరం వచ్చాడు.

"సురేష్ గారూ? ఎవరండీ రాత్రొచ్చిన బంధువులు."

"దూరపు బంధువులే లెండి . వెళ్లి పొమ్మని చెప్తాను . కాని 'ఎల్లాచెప్పాలా!" అని ఆలోచిస్తున్నాను. . ."

"సరే ; చెప్పండి. లేదా హొటల్ రూం కెళ్లి వుండమని చెప్పండి కాని రాత్రికి వుంటే మాత్రం . . ."

"అల్లాగే!"

హరిహరం వెళ్లి పోయాడు.

కాఫీ కప్పుల్తో కమల అరుగుమీది కెళ్లింది. వెనకనే సురేష్ వెళ్లాడు. పిల్లలిద్దరూ అప్పటికే అక్కడున్నారు.

"బాబాయ్' ' అన్నాడు సురేష్ - దామోదరం కాఫీ కప్పు అందుకుంటుంటే.

"ఏంసురేషూ!"

"ఈ భాగం చాలా ఇరుకు. ఇద్దరికయితే ఫర్వాలేదు గానీ - అంతకంటే . . ."

"అవునురా ; అందుకే పెద్దలు ముందు చూపు వుండాలన్నారు. నువ్వు సరే నంటే సాయంకాలం లోపల నేను వేరే ఇల్లు చూసి పెడతాను."

"కాని పెద్దయిల్లయితే అద్దె భరించాలిగా!"

"ఏమిట్రా పదిహేను వందల జీతగాడివి! అయిదు వందలు అద్దె భరించలేవా ? ఇల్లన్నాక చుట్టాలొస్తారు. పక్కాలొస్తారు. ఇల్లు చూసే ముందు మనం అన్ని వీట్లా చూసుకోవాలిరా."

"అదే పొరబాటయి పోయింది. నువ్వు ఈ వూళ్లో ఎన్ని రోజులు వుందామనుకుంటున్నావ్?"

"ఓ నెల రోజులు వుందామనే వచ్చా. కాని ఇల్లు ఇరకాటం చూసి ఓ వారం కంటె ఎక్కువ వుండలేం అన్పిస్తోంది."

"ఈ వారం రోజులూ ఏదన్నా సత్రంలో వుండు"

"సత్రమా? మన వాడివి నువ్వుండగా - నేను సత్రంలో వుండనా?"

"పోనీ హొటల్ లో వుండు. ఆ అద్దె నేనే యిస్తాను."

"అది మాత్రం మర్యాదా అని . . . ?"

● కన్నులున్న వలే చేపలు పడుతుంది.



"తప్పదు బాబాయ్."

వాళ్లిద్దరూ అల్లా మాట్లాడుతూనే వున్నారు. హనుమంతు పిల్లల్ని మచ్చిక చేసుకుని, తన వెంట తీసుకు పోయాడు - రోడ్డు మీదికి. దారిలో సురేష్ ఖాతా కొట్టు ఎక్కడ అని అడిగాడు.

వాళ్లు ఒక కిళ్లీ బంకు చూపించారు.

అక్కడకి సరాసరి నడిచాడు. రెండు సిగరెట్టు పెట్టెలూ అగ్గి పెట్టె తీసుకున్నాడు. "అన్నీ మా తమ్ముడి ఖాతాలో రాసుకో . ఎరుగుదువుగా . సురేష్ గారు. బాంక్ లో ఆఫీసర్ గారు."

పిల్లలు వెంట రావటంచూసి నమ్మి వాడు 'సరే లెండి' అన్నాడు.

తర్వాత సరాసరి హనుమంతు పెరట్లోకి నడిచాడు. అక్కడ నూతి దగ్గర స్నానం చెయ్యటం మొదలు పెట్టాడు - దాదాపు అరగంట ! ఆ అరగంటసేపూ , చూపంతా జానకి వంటింటి వేపే . ఏదో పని మీద జానకి పెరట్లోకి వచ్చింది గూడా! రెండు సార్లు హనుమంతు వైపు చూసింది కూడా. మూడోసారి-

"వదినగారూ ; పేరు ఏమిటండీ మీదీ ? " అన్నాడు.

"నా పేరు పేరమ్మ!" అన్నది జానకి నవ్వుతూ . . . .

"ఈ నుయ్యి చాలా లోతండీ ! ఓ పంపు సెట్ పెట్టించక పోయారూ? సౌఖ్యంగా వుండేది!" అన్నాడు.

"ఈ తడవ మీరొచ్చే సరికి పెట్టిస్తాను . ఈ తడవకి మీరు నీళ్లన్నీ తోడి పోసెయ్యండి " అంది జానకి నవ్వుతూ. నవ్వుతూనే లోపలకెళ్లి పోయింది.

అరుగు మీద సంభాషణ జరుగుతూనే వుంది.

"అల్లాగంటే ఎల్లాగురా అబ్బాయ్ ! హొటల్ అంటే మాటలా? రోజుకు అద్దె ఇరవై వుంటుంది. పోతే అన్నానికి . . . . . . ఇక్కడకే వచ్చి తినవచ్చు కాని, పై ఖర్చులూ - రానూ పోనూ రిక్షాకు మరొక పదిహేన అవుతుంది " . . . . .

"అయితే అయింది. రెండు రోజులేగా నువ్వుండేది?"

"ఏమో . రెండు రోజులే పడ్తుందో - వారం రోజులే పడ్తుందో. ఆ ప్లీడరు గార్ని తొందర పెడితే బాగుంటుందా?"

"సరే; ఇదంతా ఎందకు ? ఓ రెండొందలు పారెయ్యి నేను ఎల్లాగో అల్లా సర్దుకుంటాను."

" ఓ వంద యిస్తాను. వెళ్లిపో - బాబూ"

"సరే ; అంతగా నీ దగ్గర యిబ్బందయితే - ఓ నూటేభై పారెయ్యి."

"ఉహూ ; వందే !"

"సరే ; మరో పాతికపారెయ్యి! ఏం చేస్తాం!'

"ఉహూ ; వందే."

అంతా పిల్లలు - ఆట్టే వింటూ, స్తంబాల కానుకుని నుంచున్నారు. దొడ్లో హనుమంతు స్నానం అయింది.

"కమలతో మాట్లాడితే ఏమెుస్తుందీ ! - కోటలోనే పాగా వేద్దాం " అనుకున్నాడు హనుమంతు . జానకీ వాళ్ల భాగం లోకెళ్లాడు.

"మీ పోర్షన్ చూసి పోదామని వచ్చాలెండి . చాలా విశాలంగా వుందే మీ పోర్షన్!"

"ఆ - విశాలమే!"

"వంట మనిషి లేదా ? - మీరే వంట చేస్తున్నారూ !"

"లేదు"

"అదేమిటండీ హరిహరంగారి లాంటి పెద్ద ప్లీడరు - వంట మనిషిని పెట్టుకోకుండా, మిమ్మల్ని ఇబ్బంది పెడ్తున్నారా?"

"కష్టమేముందీ. అందరు ఆడవాళ్లకి వంట తప్పుతుందా?"

"మీరు అందరి ఆడవాళ్ల వంటి వారా ? లలిత లవంగ లతల్లాంటి చేతులు ! ఎల్లా కరుకు దేరి పోయాయో!"

"మీరు 'లవంగలత'ల్నెప్పుడన్నా మీ జన్మలో చూశారా!"

"లేదనుకోండి. ఇవ్వాళ మీ చేతుల్ని చూశాగా ! మీ చేతులలాగే 'లవంగలత'లుంటాయి. తప్పదు. బాగానే వుండక పోతే - ఆ మహాకవి ఎవరో అల్లా ఎందుకు రాస్తాడూ? పోతే మీ అంద చందాలని వర్ణించటానికి మాత్రం ఈ చిన్న 'కవి' చాలడు. మహాకవి పుట్టాల్సిందే."

"మీరు . . . . . కవులా?"

"ఆ కొద్దిగా ! అంటే ఇన్స్పిరేషన్ వచ్చినప్పుడు ! అదే మీలాంటి సుందరాంగులు కనబడ్డప్పుడు ! మీ వంటిల్లే ఇంత అందంగా తీర్చి దిద్ది నట్లుంది. ఈ వంటింట్లో మీరే ఇంత బాగా వున్నారు. ఇక మీ పడక గది ఎంత దివ్యంగా వుంటుందో ! అందులో మీరెంత దివ్య ప్రభలతో వెలిగి పోతారో?"

"చూస్తారా?"

"చూపిస్తానంటే - అంత కంటే అదృష్టం వుంటుందా?"

"ఆగండి . వస్తా . . ." లోపల గదిలోకి వెళ్లింది - జానకి.

వంట పండినట్లే కలలు గంటున్నాడు హనుమంతు వంటింట్లో.

అంతలో ఇక్కడ - ఇవతల భాగంలో చాలా గమ్మత్తు జరిగింది. సురేష్ దగ్గర దామోదరం ఎల్లాగయితేం వంద రూపాయలు సంపాదించాడు. ఇక హనుమంతు గాణ్నిఎల్లా వదిలించటమా అని ఆలోచిస్తూ వంటింట్లో కెళ్లాడు సురేష్. అక్కడ హనుమంతు జానకితో మాటలు కలపటం చూసి - కాస్త కళవళ పడ్డాడు.

పడక గదిలో పరుపు మీద - ఉన్న కా... ...గమ్మే



అనుభవిద్దామనుకున్నాడేమో - ! దామోదరం పేపర్ చదవటంలో మునిగి పోయాడు - అదీ బిగ్గరగా . . . . "రాజధానిలో కుళ్లు కంపు . . . . "

"పోలీసు మహిళల దౌర్జన్యం . . . . "

ఆయన దీర్ఘాలు తీస్తూ చదువుతుంటే - పిల్లలిద్దరికీ నవ్వు వచ్చింది. నవ్వుతూ నుంచున్నారు.

"సర్కస్ లోంచి పెద్దపులి తప్పించుకున్న వైనం . . ."

అమ్మో ! ! దామోదరం పేపర్లో ఆ 'కాలం' లో వున్న వ్యాఖ్యంతా అమిత శ్రద్ధగా చదవ సాగాడు.

"నిన్న రాత్రి నేషనల్ హిందూ సర్కస్ కంపెనీ వారి సర్కస్ ప్రదర్శన జరుగుతుండగా - అమాంతం ఒక పెద్దపులి - అమాంతం కటకటాల మీద నుంచి దూకి - అమాంతం తప్పించుకు పారిపోయింది. ప్రేక్షకులు భయ భ్రాంతులై పారి పోయారు. పులి ఎటు పోయిందో ఆ చూకీ దొరక లేదు. ఇంతవరకూ పోలీసులు గాలిస్తున్నారు. పులి ఆచూకీ తెలిపిన వారికి అయిదొందలు బహుమతి. ఆచూకీ తెలిసిన వారు బ్రతికి వుంటేగా - పోలీసులకి తెలపటానికీ - !! అనుకున్నాడు దామోదరం.

అంతలో ఆయనకి ప్రక్క ప్రక్కనే వున్న కిటికీ లోంచి కనిపించింది. అటుతల తిప్పాడు. నిశితంగా చూశాడు. . . పులి తల !!" చెవుల దాకా కిటికీ లోంచి కనిపించింది.

'పులా!' అనుకున్నాడు లోపల.

పులి తల కాస్త పైకి లేచి, మరి కాస్త స్పష్టంగా కళ్లబడింది!.

"అమ్మో ! పులి" అని చిన్న కేక పెట్టాడు దామోదరం.

సురేష్ అదిరిపడి - సావిట్లోకి వచ్చాడు.

అంతలో - ! అంతలో - !

అంతలో హనుమంతు గెంతుతూ - దొడ్లోంచి సరాసరి ఆ పడక గదిలోకే పరుగెత్తుకొచ్చాడు.

"పులి ! పులి ! చిరుతపులి!"

"ఏదీ ! ఎదీ!!"

"దొడ్లో దొడ్లో ! . . . . . చిరుతపులి తరుముకు వస్తోంది నన్ను . "

"కాదు. పెద్దపులి కిటికీలో -!"

"కాదు. చిరుతపులి దొడ్లో ! సర్కస్ లోంచి పారిపోయింది."

"పెద్దపులి"

"దొడ్లో వున్నది - చిరుతపులి"

"కాదు"

"అవును".

"వచ్చింది . . . . వచ్చేసింది . . . . అదిగో "

"పరుగెత్తు . . . . పరుగెత్తు " . . . . ఇద్దరూ వెనక్కి చూడకుండా బయటకు పరుగెత్తారు.

దొడ్లోంచి చీపురు కట్టతో తరుముకు వచ్చింది జానకి.

అప్పటికే హనుమంతు గేటు దాటి పోయాడు.

"వెధవ వెధవ్వేషాలు వేస్తున్నాడు," అంటూ, రౌద్రాకారాన్ని ఉపసంహరించుకుంటూ, జానకి వెనక్కి తిరిగింది.

"ఏం చేశాడో!" అంది కమల – జానకి వెళ్లిన తరువాత.

అంతలో ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ పిల్లలు కనిపించారు. రంగడి చేతిలో – గోడ మీద తగిలించే పులి తల ఒకటి కనిపించింది. సంగతి అంతా చెప్ప కుండానే సురేష్‌కు అర్థమయింది.

"ఓరీ ! మీ పనాయిదీ?"

పగలబడి నవ్వసాగాడు సురేష్.

తర్వాత . . . . . . అందరూ !

* * *

ఆ రాత్రికి – అంతా అంగరంగ వైభోగమే!

మొదటి ఆట సినిమా కెళ్లి ఆలుమగలు – రెండవ ఆట సినిమాకు వచ్చారు. భోజనాలేదో హోటల్ లోనే చేశారు. సినిమా హాలులో గువ్వలాగా మూడు గంటలు కూర్చున్న తమకం తీరటానికి – మూడు గంటలన్నా పట్టదా?

సినిమా కథంతా మంచం మీదే సాగింది – మళ్ళీ ఒకసారి. మంచం మీదే విరహతాపాలూ – ఉపశమనాలూ. స్వభావోక్తులు అయి పోయాయి. అన్నీ అతిశయోక్తులే జరిగాయి.

కళ్లకు కనబడక పోయినా జానకి విన్న మాటల్ని బట్టే – వాళ్లు 'కన్న సినిమా' నంతా కళ్లతో చూసెయ్యగలదు. మంచం మీద కళ్లు మూసుకుని పడుకుంది జానకి తన పడక గదిలో.

ఇప్పుడు సురేష్ కమల మీదకు ఒరిగి ఒంగి వుంటాడు. వన్నె కాటుక కళ్ల చాటు నుండి – సురేష్ వంక చూస్తూ వుండి వుంటుంది కమల. చిన్న చేతుల్తో – చిన్ని చిన్ని కొన గోరుల్తో , సురేష్ క్రాపింగును చిన్నగా దువ్వుతూ వుంటుంది. సురేష్ కళ్లలోంచి ప్రేమ మధు బిందువులు కమల కనుబొమ్మల్లోకి జారిపడి పోతూ వుంటాయి. నులి వెచ్చని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కలిసి వెలువడి, ఒరిసి ప్రవహిస్తూ, కమల నిండు గుండెల మీద రాసులు పోసుకు ఎగసి పోతుంటాయి. వలపు చిత్రాలు రెండూ, తలపులతో మత్తిల్లి తనువుల ఒరపుల్లో – మైమరపుల్లో ఒల్లమాలిన తమకంతో తలమునకలై పోతుంటాయి. ఆ గది అంతా 'మది'గా మారి – ఈ 'మది' అంతా వన్నె వన్నెల 'పొది'గా మారి – ఆ 'పొది' అంతా దట్టమైన వెదుళ్ల పొదగా మారి, వేణువుల రొదగా, ప్రణయ శిఖరాగ్ర సంపదగా విధిని వెక్కిరిస్తూ వుండి వుంటుంది.

జానకి ఊహకు – దంపతుల నిర్వహణలకూ తేడా అట్టే లేదు. ఉంటే ఆసక్తిలో అత్యుక్తులు కొన్ని తప్ప. ఇద్దరిలో ఎవరి పలుకులూ బంగారం కాలేదు. ఆ కులుకు సింగారాలే బంగారాన్ని మించి పోయాయి.

కన్నులలో చిగురించి – చిలికి తనం ఒలికి పోతుంటే, కలికి తనం కురులతో పాటు విరులు నలిగి పోతుంటే – తిరిగి పోలేక – పడగలు విప్పి – పాట పాడసాగింది. తమకాలు చెరిగిపోతూ నడయాడ సాగాయి. వద్దు వద్దంటూ గారాలు వేడ సాగాయి. కాదు కాదంటూ వదలలేని మదన కదనం సాగి పోయింది.

ఉదయాన్నే తోటంతా వత్తు వత్తు గుత్తులుగా పువ్వులు విచ్చుకున్నాయి. వంటపని చక చకా పరుగులెత్తి జరిగి పోయింది. గుండెల్లోని కూని రాగం, గొంతులో మార్మోగుతుంటే, ఇల్లంతా తిరుగుతోంది – గృహలక్ష్మి లాగా తోటంతా చుట్ట బెట్టింది కమల. ఆ ఆనందంలో కమల మాటలన్నింటా 'సయ్యాట'లే తోచాయి జానకికి.



● అప్రతిష్ఠ వల్ల యేర్పడ్డ గాయాన్ని మాత్రం కాలం మాన్పలేదు!

ఎంతయినా ఇంత ఆనందమా?

ఇంత విరిసి పోవటమా?

ఇంత మిడిసి పాటా?

కమల కళ్లకి కనిపించిన కొద్దీ - జానకి కళ్లల్లో - అదేదో ఈర్ష్య చోటు చేసుకున్నది.

జానకి మనసులో ఏదో వెలితి తోచింది. ఆ వెలితి వొళ్లంతా అలుముకున్నది. తనువంతా అతనే ఆక్రమించుకున్నాడు.

వంట సంగతే విస్మరించింది - పడకటింటిలో పాన్పు మీదే పడి వుండి, కళ్ల నీళ్ల తోనే వొళ్లు చల్లార్చుకుంది జానకి.

అవతల గదిలో అనురాగా సల్లాపాల సంగీతాలు, ఇవతల గదిలో విల విల లాడే విరహ దీపాల వేదనాలాపాలు.

7

అంతసేపూ . . . .

హరిహరం తన ఆఫీసు గదిలో ఎవరో ఆస్తి కోసం - వేసిన దావాలో తల మునకలుగా తన్నుకుంటున్నాడు. అవతలున్న జానకీ పట్టించు కోలేదు.

ఇవతల వరండాలో - సాగి పోతున్న చిన్ని సంసారం సంగతే పట్టించుకునే తీరిక లేదు.

వరండాలో - ప్రక్క అరుగు దగ్గరగా - నీల రంగాల అన్యోన్యపు మాయ సంసారం సాగి పోతోంది.





నీల రంగడికి కాఫీ తెచ్చి యిచ్చింది. కాఫీ కప్పు అందుకుని మీద చెయ్యి వేశాడు రంగడు.

"ఛీ ; ఇల్లా చెయ్యి మీద వేస్తావేమిటి?" సిగ్గు బుగ్గంతో దూరంగా జరిగింది నీల.

"మరి - సురేష్‌గారు కమలగారి మీద అల్లా చెయ్యి వెయ్యలేదేమిటి?" సాగదీసి మాట్లాడాడు రంగడు.

"సరే - అయితే - "

"వంట తొందరగా కానియ్యి. ఇవ్వాళ ఆఫీసుకు తొందరగా వెళ్లాలి"

"రోజూ తొందరే నీకు ! ఇవ్వాళ సెలవు పెట్టెయ్యి."

"అమ్మో ! ఇవ్వాళ ఇన్‌స్పెక్షన్ ! సాయంత్రం తొందరగా వస్తాలే - సరేనా?"

"సరే . . . వచ్చేటప్పుడు సెనగ పప్పూ మరమరాలూ పట్రా . . ."

"అల్లాగే"

"ఈ గిన్నె చిల్లడి పోయింది. మాటేయించాలి."

"వేయించు - మాట్ల వాడొస్తాడుగా!"

"ఏమో! వాడెప్పుడొస్తాడో - దిక్కుమాలిన చచ్చినాడు - మరచిపోయా ! పచ్చిమిరప కాయలు కూడా పట్రా!"

"నువ్వు చెప్పేవన్నీ ఒక్కసారే చెప్పుండు. తడవ కొకటి కాకుండా . . . ." మొగుడి దర్పం వెళ్ల బుచ్చాదు రంగడు.

దాంతో నీలకు పుట్టెడు కోపం వచ్చింది.

"ఏమిటి నీ బోడి దర్జా ! - బోడి అధికారం ! ఆ సురేష్‌గారు ఇల్లా అంటారేం ఎప్పుడన్నా?'

"సురేష్ గారు కాదు. మా నాన్న అల్లాగే అంటాడు. మీ నాన్న అనడా?"

"అనడు - పైన మాట్లేయించుకు రమ్మంటే - "సరే. అల్లాగే నంటాడు. గిన్నె చంకన బెట్టుకు వెళ్తాడు అల్లా వుండాలి మొగుడంటే."

"సరే ; అల్లాగే ఆ గిన్నె ఇల్లా పారెయ్యి."

నీల వెంటనే ఒక్క లక్క పిడత ఇవతల పడేసింది.

ఆ లక్క పిడత తీసుకుని - రంగడు చాలా సీరియస్‌గా గేటు దాటి వెళ్లి - కాసేపటికి తిరిగి వచ్చాడు.

"ఇదుగో మాటేయించుకు వచ్చా."

"ఏదీ! ఆ గడ్డం సాయిబు దగ్గరేనా?"

"కాదు. ఆ పళ్లెత్తు నాయుడు దగ్గర!"

"సరే ! వాడు మాటేస్తే , మర్నాడే పాడయి పోతుంది. ఎన్నాళ్లకీ ఇల్లాగయితే ఎల్లా?" అంటూ గిన్నె విసిరి కొట్టింది నీల.

"మీ అమ్మ ఇల్లాగే గిన్నె విసిరి కొడుతుందా?"

"ఆ . మా అమ్మయితే మొహాన విసిరి కొడుతుంది."

"నీవ్వూ నా మొహాన కొట్టలేదేం?"

"అదే ప్రేమంటే ! దెబ్బ తగిలే వస్తువుల్తో కిందే కొట్టాలి. పుస్తకం లాంటి వస్తువుల్తో అయితే - మొహం మీదే కొట్టాలి."

"సరే. సరే అన్నం పెట్టు! సురేష్ గారి భోజనం అయిపోతుంది."

"అవతల హరిహరంగారి భోజనం కాందే."

నిజమే, సురేష్ భోజనం చేస్తున్నాడు. అవతల జానకి వంటకు లేవ లేదు.

"ఒంట్లో బాగా లేదా?" హరిహరం ఆశ్చర్యంగా అడిగాడు.

"బాగానే వుంది. వంట చేస్తానింక."

"ఇప్పుడా ! కోర్టుకు టైం అయింది. లంచ్ అవర్‌లో భోజనానికి వస్తాలే."

హరిహరం త్వర త్వరగా తన పరివారంతో కోర్టుకెళ్లి పోయాడు.

స్కూటర్ మీద సురేష్ వెళ్లి పోయాడు.

ఒట్టోట్టి స్కూటర్ మీద డుర్‌ర్... . . డుర్‌ర్ మంటూ రంగడూ వెళ్లి దొడ్డంతా తిరిగి వచ్చాడు.

జానకి లేచి వంట పూర్తి చేసేసింది.

అంతలో పదిహేను మంది - ఆ వీధిలో వాళ్ళే - ఎక్కువ ఆ చుట్టు ప్రక్కల వాళ్లే - బిల బిలా వచ్చి పడ్డారు.

అందులో రంగడి అమ్మా, నీల అమ్మా గూడా వున్నారు.

అంతా ముందు హరిహరంగారి భాగం లోకెళ్లారు. అక్కడ జానకితో . .

"వీధిలో అందరం కలిసి వచ్చే ఆదివారం నాడు వనభోజనం ఏర్పాటు చేస్తున్నామండీ . మీ దంపతులు కూడా రావాలి."

"వారి నడిగి చెప్తాను." అంటోంది జానకి. అంతలో హరిహరం వచ్చాడు రిక్షాలో.

ఆయన గూడా అంతా విని 'సరే' నన్నాడు. చందా అందరి కంటే ఒక యాభై ఎక్కువ వేశాడు.

"మరి మీ ఇంట్లో అద్దెకున్న వారి సంగతి?"

జానకి కూడా అందరితో బాటు వెళ్లి - కమలను కదిలించింది. కమల గూడా వారిని అడిగి చెప్తానన్నది.

"మీరు సరేననండి. వారు కాదంటారా ఏం? - "

"ముందు మీరు సరేననండి. వారు కాదంటారా ఏమిటి? అందరం సరదాగా కాలక్షేపం చెయ్యొచ్చు. ఆదివారమేగా ! అందరికీ వీలే ! " జానకి మరికాస్త ఆసరా యిచ్చింది.




# SALOME

M.P.H.W. TRAINING INSTITUTE
(Recognised by Govt. of Andhra Pradesh)
D.No. 44-15-21/1
(Attached Govt. Head Quarters Hospital)
By pass Road, Rajahmundry - 533 103.

ఈ పై కోర్సునందు చేరగోరు స్త్రీ అభ్యర్థులనుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. 16 సంవత్సరముల నుండి 30 సంవత్సరముల లోపు వయస్సు కలిగి వుండవలయును. Xth Class Pass అయిన వారిని తీసుకొనబడును. 18 మాసములు శిక్షణ ఇవ్వబడును. S.C, S.T, A.A.C వారికి ఉచిత భోజన వసతి కలదు. పరీక్షలు, శిక్షణ గవర్నమెంట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ నందు ఇచ్చెదరు. ఉత్తీర్ణులైన వారికి గవర్నమెంటు వారిచే సర్టిఫికేట్స్ స్కూలు ద్వారా ఇవ్వబడును. అప్లికేషన్ అండ్ ప్రాస్పెక్టస్ ఉచితం. స్వయంగా వచ్చి తీసుకొనవచ్చును. ఇందులో చదివి పాస్ అయిన వారు ఆంధ్రప్రదేశ్ అంతటా ఉద్యోగములు చేయుచున్నారు. దూర ప్రాంతములకు ప్రాక్టికల్స్‌కు వెళ్ళుటకు van సదుపాయము కలదు. ఈ స్కూలు గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గరలో రోడ్డు ప్రక్కన గలదు. జూలై నుండి కొత్త అడ్మిషన్‌లు ప్రారంభం.

V.Mary Ratnam
Manager
S.M.P.H.W.Training Institute
D.No.44-15-21/1,
By pass Road, Rajahmundry - 533 103.

"సరే," అంది కమల - చివరికి.

వెళ్తూ - వెళ్తూ ఏం చేస్తున్నార్రా మీ రిక్కడ ?" అనడిగింది. రంగడి తల్లి - రంగడ్ని.

"ఆడుకుంటున్నాం ?"

"ఇక్కడేం ఆట !"

"మొగుడు పెళ్లాలాట!" నీల జవాబు చెప్పింది - తొందరపడి.

"ఏడిశారు వెధవ ఆటల్లూ మీరూనూ - అన్నాలన్నా తినకుండా . రా; నాతో."

నీలను లాక్కెళ్లింది - నీల తల్లి.

బిక్క మొహంతో రంగడూ నడిచాడు తల్లి వెనక.

సురేష్ ఇంటికి రాంగానే కాఫీ యిస్తూ, వన భోజనం సంగతి చెప్పింది.

"వెళ్దామా?"

"వద్దా"

"సరే, ఆదివారమేగా ! పోదాం సరదాగా. ఇంతకూ వనభోజనం ఏ వనంలోనో."

"ఏమో ! నే కనుక్కోలేదు."

పిల్లలే వివరాలు చెప్పారు.

"కొండ మీద కోటేశ్వరాలయంలో . . . అమ్మ చెప్పింది."

"అక్కడో కోనేరు వుందిట.!"

"అంతా అడివేట.!"

"గుడి బాగుంటుంది. దాని చుట్టూ తోటలున్నాయిట!"

"ఈ వీధిలో వాళ్లంతా వస్తున్నారట!"

"వంటల్ను కూడా అక్కడేట."

"కొండే చాలా ఎత్తుట!"

"కాని, కారులో కూడా వెళ్లచ్చుట ! స్కూటర్లూ పోతాయట!"

వాళ్ళ మాటల కిద్దరూ నవ్వు కున్నారు.

సాయంకాలం అయింది.

ఆ పూట దంపతులిద్దరూ షికారు బయల్దేరలేదు. ఊళ్లో చూడాల్సిన ప్రదేశాలు - తిరగ గలిగిన రోడ్డులయిపోయాయేమో. స్కూటర్ మోజు నశించిందేమొ! ఎండవేడి తగ్గిన తర్వాత కమలా సురేష్ లిద్దరూ నెమ్మదిగా డాబా మీద చేరారు. డాబా మీద 'ఊరు మిరపకాయలు' ఆరబోసి వున్నాయి తప్ప - మరేం లేవు. ఇద్దరూ షికారు ప్రారంభించారు మేడ మీద. క్రింద తోటలో అప్పటికే నీలా రంగడితో బాటు మరి కొందరు పిల్లలు చేరారు. అందరూ ఒక ప్రక్క చేరి చెడుగుడు ఆట ఆరంభించారు.

హరిహరం ఎందుకనో కోర్టునుంచి ఇంటికే రాలేదు. ఆయన కోసం ఎదురు



చూస్తోంది జానకి.

డాబా మీద ఆలుమగల సరదాలారంభమయినాయి. కాని కాలక్షేపం కరువుగానే తోచింది.

"చిన్నప్పుడు నేనూ చెడుగుడు ఆడేవాణ్ణి " అన్నాడు సురేష్ పిల్లల ఆట డాబా నుంచి చూస్తూ.

"అవును . నేను చూస్తూ నుంచునే దాన్ని ." అంది కమల!

"వాళ్ల ఆట చూస్తుంటే నాకా రోజులు జ్ఞాపకం వస్తున్నాయి."

"వెళ్లి వాళ్లతో కలిసి ఆడుకోండి."

"నువ్వేంచేస్తావ్."

"చూస్తూనుంచుంటాను."

"చిన్న పిల్లలు ! వాళ్లతో ఆట ఏం బాగుంటుంది ? మనమే ఆడుకుందాం ; రారాదూ?"

"మనమా!"

"ఏం?"

దొడ్లో జానకి పూలు కోస్తూ డాబాపైకి చూస్తూనే వుంది. అంతసేపూ షికార్లు చేస్తూ - పిట్ట గోడ మీద నుంచి ఇద్దరూ కనిపిస్తూనే వున్నారు. మళ్లీ అంతలో దంపతులిద్దరూ మాయమవుతూనే వున్నారు. తర్వాత తర్వాత అదీ లేదు. ఇంతసేపూ పైన ఏం చేస్తున్నట్లు !.!

పైన వట్టి షికార్లేనా?

"బాగా చీకటి పడిపోతున్నానా?

జానకిలో కుతూహలం పుట్టి పెరిగింది. ఇంక ఆగలేక డాబా మెట్ల మీదికి నడిచింది.

'గుడు గుడు గుడు గుడు శబ్ద' మేదో మెట్ల మధ్య వుండగానే వినిపించింది.

చెడుగుడు ఆట ఆడుతున్నారా ఇద్దరూ?

తీరాపైకి వెళ్లి చూస్తే . . . కమల కూత పెడుతుంది. కమలను వాటేసుకుని సురేష్ వదలకుండ . . . . . .

కళ్లారా చూసింది జానకి.

కళ్లు తిరిగాయి. వొళ్లూ తిరిగింది. గిర్రున తిరిగి మెట్ల ముందు డాబా మీద పడిపోయింది. ఒక కాలూ చెయ్యి కొట్టుకోసాగాయి. "జానకి గారు ! జానకి గారూ . . . " కమల ఖంగారుగా పలకరిస్తూ కొట్టు కుంటున్నచేతులు నొక్కి పట్టింది. పోయి పిల్లల్ని కేకేశాడు సురేష్.

---

• శృంగారం దాసించెక్క. దాన్ని నములుతున్నంత సేపూ మరింకేదీ రుచించదు.

---

పిల్లలూ మరికొందరూ పైకి పరుగెత్తుకు వచ్చారు.

ఎవరో డాక్టరు కోసం పరుగెత్తారు. అంతరూ అల్లా పట్టి క్రిందికి [illegible] జానకిని. డాక్టరు వచ్చాడు. వెనకనే హరిహరమూ వచ్చాడు.

[illegible] లెండి . ఫర్వాలేదు. ఇంతకు ముందు ఎప్పుడన్నా వచ్చిందా?

"లేదండి." హరిహరం జవాబు.

"ఇంజెక్షన్ యిస్తున్నాను. రేపటిదాక నిద్రే ! రేపటి కంతా బాగానే వుంటుంది లెండి." అన్నాడు డాక్టర్.

-8-

వనభోజనం అనుకున్న ఆదివారం - అంతలోనే వచ్చేసింది. ఉదయాన్నే వనభోజన నిర్వాహకులందరూ వెళ్లారు. అంతకంటే ముందు - మూడు ఆటోల సామాన్లు వెళ్లాయి.

స్నానాదులు కానిచ్చి - వీధిలో కూడా అందరూ బయలు దేరారు. చాలా మంది ఆటోల మీదే ! హరిహరం దంపతులు కారులో కమలా సురేష్‌లు ఒక కెమేరాతో స్కూటర్ మీదా - పిల్లలు వాళ్ల తల్లి తండ్రుల్తో బయలు దేరారు.

ఎనిమిది గంటల కల్లా ఆ ప్రదేశమంతా ఏభై అరవై మందితో బిల బిల లాడుతోంది. తొమ్మిది గంటలకల్లా రావల్సిన వారంతా వచ్చారు. జరగవల్సిన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కొందరు రావటంతోనే పేకాట కూర్చున్నారు. కొందరు పరిసరాల పరిశీలనకు బయలు దేరారు - జట్లు జట్లుగా ! - జంటలు జంటలుగా . .

అతిథులంతా ఎవరి ఇష్టానికి వాళ్లు తిరుగుతుంటే - వంట వాళ్లంతా వంట ప్రయత్నం చేస్తుంటే - హనుమంతు దామోదరం వాళ్ల మీద పెత్తనం చేస్తున్నారు. వాళ్లిద్దరినీ ఎవరు పిలిచారో ఎవరికీ తెలియదు. కాని పెత్తందార్ల మీదే - వీళ్లు పెత్తనం చేస్తున్నారు. అందరి తలలో నాలికలూ వాళ్ళే అయిపోయారు.

"పులిహోరలో నిమ్మకాయలు యాభై పిండి వెయ్యండి లేకపోతే చాలవ్ " అంటున్నాడు దామోదరం.

"ఇటువెపు పైకి నడిచి వెళ్తే - జలపాతం . దిగితే వెంకన్న గుడి. వెళ్లి చూస్తారా ? నన్నూ రమ్మంటారా " అంటూ వాలంటీరు చేస్తున్నాడు - కొందరు ఆడవాళ్ల గుంపులో - హనుమంతు. దామోదరం కూర్చునే హంగు చేస్తుంటే - హనుమంతు తిరుగుతూనే పనులు చేస్తున్నాడు - ముఖ్యంగా మహిళల ముందు.

కొండగాలికి అందరికీ ఉల్లాసంగానే వుంది. చిన్న పిల్లలందరూ - ఏ వయసు వాళ్లు ఆ వయసు వాళ్లతో - చెట్టు క్రింద చేరి తోచిన ఆటలు ఆడుకుంటున్నారు.






మగ పిల్లలు చెడుగుడు! ఆడ పిల్లలు తొక్కుడు బిళ్లా ! - నాలుగు స్తంభాలాటో !

ముదురాకు పచ్చలు నిండిన విశాల పకృతి అందమంతా . . .

ముదురాకు పచ్చలో లేతాకు పచ్చలు - లేతాకు పచ్చలో చిగురాకు మొలకలు నిండినదా ప్రదేశమంతా . ఏవో ఎరగని పువ్వులు ! . . . ఎప్పుడూ చూడని ఆకులు ! ఎక్కడా కనిపించని ఆకుల అంచుల డిజైన్లు ! పలకరిస్తూ ప్రకృతి చూస్తున్న మనుషుల్ని చూసి, మనిషి వికృతాన్ని చూసి నవ్వుకుంటోంది - మరీ మరీ.

అందరితో బాటుగా - అందరికీ కాస్త ఎడంగా - కమలా సురేష్‌లూ పరిసరాల్లోనే విహరిస్తున్నారు. పరిహాసాల్తో నవ్వు కుంటున్నారు. పరవశిస్తున్నారు.

ఆకాశపుటంచుల్లో నిలిచి కనిపిస్తున్న ఒక అందమైన కొండ ఒకటి - మెడ చాపి - వెనక నున్న కొండ రాజును ముద్దుగొంటోంది. మబ్బులు కొండ శిఖరాల చుట్టూ తిరగటం చూస్తుంటే అందమైన భార్య చీర చెంగులాగు కుని భర్త తన మొగానికి కప్పుకుంటున్నట్లు అనిపిస్తోంది. పెరుగూ తరుగూ లేని కొండల మీద చెట్లు - పంతాలు పడి, శిఖరాల కంటే పెరగాలని ప్రయత్నిస్తున్నట్లనిపిస్తోంది. పర్వతాలెంత ఎత్తో - లోయలంత లోతు - కళ్ళు తిరిగే అగాధాలు.

"ఆ చెట్టు చూడూ ! ఎంత ఎత్తుందో !" అన్నాడు సురేష్ దూరానికి చూపిస్తూ "ఏదీ?" అంటూ అటు చూస్తోంది. అంతలో ముద్దొకటి దొంగిలించాడు.

"అమ్మ దొంగా " అంటూ కొట్టబోయింది కమల . కమలకు అందకుండా పారిపోయాడు సురేష్. వాళ్ళిద్దరూ ఒక పొద చాటున వున్నా – ఆ ఇద్దరు దొంగల్నీ కనిపెట్టేశారు – హరిహరం దంపతులు.

'కుర్రతనం' అనుకున్నాడు హరిహరం.

అంతగా నవ్వు రాలేదు జానకికి.

చూసీ చూడనట్లే ఆ దంపతులిద్దరూ దూరంగా నడిచారు.

అడుగు వేసీ వెయ్యనట్లే ఈ దంపతులు ఒక పొద చాటున మాయమవుతున్నారు మాట మాట్లాడితే. కాని . . . జరగాల్సిన గందరగోళం అంతా నిజానికి జరిగిపోతోంది. జలపాతం దగ్గర. సన్నని జలపాతం అది. దాని ముందున్నదే ఒక చిన్న కోనేరు!

చాలామంది స్త్రీలంతా చేరి అక్కడే స్నానాలు సాగిస్తున్నారు. హనుమంతు పెత్తనమే అక్కడా సాగుతోంది. హనుమంతు అక్కడ దారికి కాపలా కాస్తున్నాడు. అటువచ్చిన మగవాళ్లందర్నీ అలకాయిస్తున్నాడు.

"అక్కడ అందరూ స్త్రీలు స్నానాలు చేస్తున్నారు" స్త్రీలు అయిన తర్వాతే మగవాళ్ల ' స్నానం. అంత వరకు మగ పురుగు పోవటానికి వీల్లేదు తెలుసా ? వాళ్లందరూ గౌరవమైన కుటుంబ స్త్రీలు. . . . . . "

నిజమేననుకుని పురుషులు – స్త్రీలనే పంపించి తాము వెనక్కి పోతున్నారు. అక్కడ ఎవ్వరూ లేకుండా చూసి – తను మాత్రం – పొదల మాటున దాగి ఉండి – స్నానాలు చేస్తున్న, స్త్రీలందర్నీ తనివిదీరా చూస్తున్నాడు హనుమంతు. దీనిని మొదట కనిపెట్టిందొక ఘన జఘన సుందరి. పేరు మాణిక్యం. పెళ్లి కాలేదు. స్నానానికి దిగబోతూ – చీర మార్చుకోటానికొక పొద చాటుకు వచ్చింది, అక్కణ్ణించి హనుమంతు కనిపించాడు.

పొదల చాటుగా చుట్టి చుట్టి హనుమంతు వెనకకు వచ్చింది. దోవలో ఒక 'దురదగొండాకు మొక్క' జాగ్రత్తగా పీక్కు వచ్చింది.

"ఏమిటి చేస్తున్నావ్ ?" మొగ గొంతుతో అడిగింది.

"చూస్తున్నాను."

"ఏం చూస్తున్నావ్?"

"ఆ తొడల్ని!"

"ఇంకా?"

"ఆ పిరుదుల్ని " – పరవశత్వంతో మాటలు వదిలేస్తున్నాడు.

హనుమంతు . . . . అంతలో దురద గొండాకు మొక్క వీపు మీద ఛెళ్లు మన్నది.



"ఆ ! నువ్వా?" . . . . .

"ఆనేనే!"

"క్షమించాలి. బుద్ధి గడ్డి తిన్నది."

"అందుకే దురద గొండాకు దెబ్బతిన్నది."

"క్షమించాలి తప్పదు. తప్పదంటే తప్పదు " అంటూ బ్రతిమాలుతూ హనుమంతు ఆమె చేతులు పట్టుకోటానికి ప్రయత్నించి – " ఇవి చేతులు కావు. కాళ్లు అన్నాడు.

"ఇవి చేతులు కావు . ఆకులు. దురదగొండాకులు " అన్నది మాణిక్యం.

"అమ్మో ! " – అప్పటికి గాని హనుమంతు వీపు మీద దురద ప్రారంభం కాలేదు. దురద! ఒకటే దురద! వీపంతా దురద. కేవలం కోతి గంతులే ఆరంభించాడు హనుమంతు పగలబడి నవ్వుకుంది మాణిక్యం.

హనుమంతు గంతులేస్తూనే వున్నాడు. బ్రతిమాల్తూనే వున్నాడు.

"ఆ ఆకులు పారేసి దగ్గరకు రండి. చేతులు పట్టుకు బ్రతిమాలు కుంటాను,"

"అబ్బే ! కాళ్లు పట్టు కోవాల్సిందే – బుద్ధి రావటానికి."

"ఓ, యస్. ఒక్క కాళ్ళేమిటి ! అంతకంటే పైవే పట్టుకుంటాను – మీరు క్షమిస్తానంటే . . . ప్రాణ విత్త మాన భంగాల్లో ఇదొకటి. దగ్గరగా రండి . . . "

మాణిక్యం దగ్గరగా వచ్చింది. హనుమంతు కాళ్లు పట్టుకున్నాడు. మరి వదల్లేదు. మాణిక్యం నఖశిఖ పర్యంతం జలదరించింది.

"నేనూ వాళ్ల లాగే స్నానం చేస్తుంటాను. మీరు నా ఒకత్తె వంకే చూస్తారా!"

"ఓ ; అల్లాగే. మీరు మధ్యాహ్నం రండి ఒంటరిగా – హాయిగా సినిమా హీరో

---

శోభనం గదిలోంచి పెళ్లికూతురు ధడాలున తలుపులు తెరిచి రివ్వున పురుగెత్తుకొచ్చి తల్లిని కౌగలించుకుని బావురు మంది –

తల్లి ముందు భయపడింది – తర్వాత నెమ్మదిగా ఓదారుస్తూ

"ఏం జరిగిందమ్మా – నిజం చెప్పు – అల్లుడు గారు నిన్నేమయినా అన్నారా!" అని అంది తల్లి.

"నేనాయన్తో కాపురం చేయలేనమ్మా–" అని మళ్లీ బావురుమన్నది పెళ్లికూతురు.

"చెప్పమ్మా! ఏం జరిగిందో కాస్త వివరంగా చెప్పు తల్లీ" అంది తల్లి

బలవంతంగా ఏడుపుని ఆపుకుని "పక్కన కూచున్నప్పుడు సరదాగా చాలా సేపు కబుర్లు చెప్పాడమ్మా!

చివరకు సిగ్గు విడిచి నేనే వెళ్ళి ఆయన ఒళ్లో కూచున్నానమ్మా – వెంటనే ఆయన కబుర్లు మాని ఆఫీసు ఉత్తరాలు డిక్టేట్ చేయటం మొదలు పెట్టారమ్మా"– అని అంది పెళ్లి కూతురు –

హీరోయిన్ల లాగా - డ్యూయెట్లు పాడుకుందాం. క్రిందపడి దొర్లుదాం . . మీద పడి గుంజా కుందాం. ఇంకా. . . ఇంకా . . ."

"ఎల్లా ? ఇక్కడంతా ముళ్లు ! ఎత్తు పల్లాలు !"

"అవును. అదీ నిజమే. పెగా మీరు దొర్లటం మొదలు పెడితే ఆపలేం. సరాసరి లోయల్లోకే పోతాం పోనీ - పోనీ ఆ కోనేరు వుందిగా జలకా లాడదాం . . . సరేనా !"

"సరే!"

"ఓ గంటాగి రండి. అప్పటికెవ్వరూ వుండరు."

"అవును"

రాజీ అయింది.

ఆడబోయిన తీర్థం ఎదురయింది హనుమంతుకి. తీర్థంలోనే ఆడబోతున్నాడు.

వనభోజనం దగ్గరా . . . . చిన్న పిల్లలంతా చేరి కాస్త దూరంగా 'చెడుగుడు ' ఆడుతున్నారు.

వంటలయి పోతున్నాయి - ఒక ప్రక్క.

పేకాట సాగిపోతోంది ఒక ప్రక్క.

మధ్యలో పులుసులోకి ముక్కలు తరుగుతున్నాడు దామోదరం. మనసంతా పేకాట మీదున్నా చేతి వేళ్లు కత్తిపీట మీదున్నాయి.

"పులుసులోకి ముక్కలు ఇక్కడికే ఎక్కువయ్యాయి. దామోదరంగారూ ఇక తరక్కండి " అన్నాడు వంటాయన.

"పోయవయ్యా ; ముక్కలు తింటారు - ఇంతలో నీ సొమ్మేం పోయింది."

"నా సొమ్మేం పోదుగానీయండీ - పప్పు పులుసు - 'పప్పు కూర' అవుతుందండి. అంతే!"

ఇవతల రావి చెట్టు క్రింద 'రమ్మీ' జోరుగా సాగుతోంది. తన లాంటి వాడు కూర్చుంటే వందో రెండొందలో సంపాదించవచ్చు.! పెట్టుబడి లోపం చేశాడా భగవంతుడు. కావల్సిన వేళకి కావల్సిన వాళ్లకి ఏమీ ఇవ్వడు, అక్కర లేనప్పుడన్నీ ఇస్తాడు ఈ భగవంతుడు. ఒక్కసారి కనిపిస్తే నాలుగూ అడిగి కడిగేద్దామనుకున్నాడు దామోదరం.

కూరల తర్వాత అరిటాకులుసైజుకు తరుగుతూ కూర్చున్నాడు షికార్లు తిరగటానికి పరిసరాలకు వెళ్లిన జంటలేవీ, తిరిగి వచ్చే వేళ కాలేదింకా. చూడాల్సిన వేడుకలయి పోనూ లేదు. గుడి చుట్టూ తిరుగు తున్నారు. హరిహరం దంపతులు. గుళ్లో ఏవేవో రక రకాల శిల్పాలున్నాయి. హరిహరానికి శిల్ప కళంటే కాస్త అభిరుచి వుంది. శిల్పాలను జానకికి చూపిస్తూ ఒక శిల్పాన్ని గురించి చెప్తూ ఈ పద్ధతిని "అమరావతి పద్ధతి" అంటారు అన్నాడు. మరో



'మేరీ' గోల్డు కవరింగ్ జ్యూయలరీ ఫ్యాషన్సులో అందెవేసిన చేయి. ప్రపంచంలోని స్త్రీలందరూ నాణ్యతకు - మన్నికకు వాడవలసినవి - ధరించవలసినవి - అలంకరించవలసినవి. కంటికింపగు యీ ఆభరణముల కొరకు నేడే మీ ఆర్డరును పంపించండి. వి.పి.పి. ద్వారా ఆభరణములను పొందండి డిజైను నంబర్లను మరియు ఉచితమైన కేటలాగులను ప్రత్యేకముగా అడుగుట మరిచిపోవద్దు.




MERI GOLD COVERING WORKS
PO Box 1405
NAGAR, MADRAS 600

## మనవి

చిన్న బడ్జెట్‌లో - తక్కువ వేషధారులతో, కొద్ది సెట్లతో - చిత్రం తియ్యటానికి పనికి రాగల శృంగార రస ప్రధానమైన కథయిది. నవలిక కాబట్టి వర్ణనలు వగైరా వదిలివేసి, నన్నివేశ ప్రధానంగా రచన చేయడం జరిగింది.
రసగ్రహణ పారీణుడైన ఏ దర్శకుడైనా ఈ మాత్రం కథతో మంచి చిత్రమే తీయవచ్చు. ఆసక్తి లేకపోవటమే మనకున్న లోపం. సినిమాలు తియ్యటంలో సాంకేతిక జ్ఞానం, నేర్పు ఎంత అవసరమో, దర్శకుడికి ప్రతిభావ్యుత్పత్తులు కూడా అంతకంటే అవసరం. దర్శకుడు నేర్పరి అయితే పూచిక పుల్ల చాలు. పాటలకున్న అవకాశాలు చెప్పకనే తెలుస్తుంటాయి. కనుక ప్రత్యేకంగా సూచించ లేదు.

—డా॥కొ(రపాటి గంగాధరరావు.

శిల్పాన్ని చూపిస్తూ ఇది "అజంతా" అన్నాడు. అంతలో మరో బూతు బొమ్మ ఇద్దరి కళ్లా బడింది ? ప్రియుడి పై నుండి - ప్రియురాలు పురుషాయితం చేస్తున్నది ! ! ఈ పద్ధతి ? " అనడిగింది జానకి - కొంటెగా !

"ఇదా ! ఖజరహో అనుకుంటాను" అన్నాడు హరిహరం నిర్వికారంగా తర్వాత దేవాలయం మలుపు తిరిగి, మరో ప్రక్క చూడటానికి వెళ్లి పోయారిద్దరూ.

కాస్త వెనగ్గా చూస్తూ వస్తున్నారు కమలా సురేష్‌లు.

వస్తూ వస్తూ హఠాత్తుగా ఆ ఖజరాహో శిల్పం దగ్గర ఆగి పోయారు. సిగ్గు పడుతూనే తనివి దీరా శిల్పాన్ని చూస్తోంది కమల . సురేష్ తన కెమేరాతో దానికే ఫొటో తీశాడు. తర్వాత . . . అటూ ఇటూ దిక్కులు చూశాడు సురేష్. ఎటూ కను చూపు మేరలో ఎవ్వరూ కాన రాలేదు. చటుక్కున పట్టుకుని - చక్కగా వాటేసుకుని - మరి ఒక పట్టాన వదల లేదు సురేష్ కమలను.

ఇంకా సురేష్ దంపతులు రాలేదేమాని, జానకి గుడి మూల - చివరకు వచ్చి తొంగి చూసింది. ఈ దృశ్యం కళ్ల బడింది. వెను వెంటనే తొలగి పోయింది. అంతలో ఆలుమగలను పారవశ్యమే వదిలి వెళ్లింది. కదిలి ముందుకు సాగారు. ఏనాటి అదృష్టమో అనుకుంటూ - దృష్టి కమలా సురేష్‌ల మీద వుంచి - జానకి భర్తను అనుసరించింది. దట్టమైన చెట్టు క్రింద కూర్చుని -గుడ్డి వాడొకడు కొత్త పాట ఒకదాన్ని పాడనారంభించాడు.

ఏనాటి అదృష్టమో . . . . శిల
తీనాడు పులకించెలే . . . . కను
పసందుగా - సుందరీ - సుందరులు - రమణించ ॥ ఏనాటి ॥



ఆ పాట ఆసాంతం విన్నది జానకి - కళ్ల నీళ్లు సుళ్లు తిరుగు తుంటే గుడ్డివాడి గంభీరమైన కంఠస్వరం అందర్నీ ఆకర్షించింది. అంతరార్థం కొందర్నే ఆకర్షించింది. కమలా సురేష్‌లకు పాటలే పట్టలేదు. అర్థాలు అవసరమూ లేదు. తర్వాత హరిహరం జేబులోంచి రెండు రూ ॥ లు తీసి, అతని ముందు పడేసింది జానకి.

గుడ్డి వాడికి తన పాటేమో ! తనేమో ! . . . పాడు కుంటూనే వున్నాడు.

తొలి వలపులే జల్లు మీదెల్ల పడసాగ
చలిగాలిలో మనసు కలలోనె కొనసాగ
చెలి మనసుగల కోర్కె కనులతో తెలిసికొని
సొలసి కౌగిలిలోన ప్రియుడు తానును మిగుల
॥ ఏనాటి ॥

కన్దామరల యందు సుందరాంగుండగ
మన్మందిరము ఆ - నందాల నిండంగ
విను వీథిలో నందు మబ్బు లూగు లూగంగ
ఆ వనములో - యవ్వనములో - మరునిసా మ్రాజ్యమ్ము సాగంగ
॥ ఏనాటి ॥

అతన్ని పట్టించు కోకుండానే కమలా సురేష్ లు కొత్త కొత్త శిల్పాల కోసం వెతుకులాడుతున్నారు. కాస్త దూరానే వున్నా, జానకి చూపంతా కమలా సురేష్‌ల మీదే వుంది. కళ్లల్లో ఏదో ఆశ నిరాశలతో కళవళిస్తూనే వున్నాయి. హరిహరం ఒకటి రెండు సార్లు అది గమనించాడు కూడా.

కోనేరు ప్రక్కనే జలపాతం ధార సన్నగా పడుతూనే వుంది. స్నానాలు చేసి వెళ్ళే వారు వెళుతూనే వున్నారు. అందరూ వెళ్లేదాకా అందాకా క్షేమ కూర్చున్నారు హనుమంతూ - మాణిక్యం.

తర్వాత ఇద్దరూ 'డ్యూయెట్లు' సాగించేరు.

అంతా సరిగా సినిమాల్లో చూసినట్టే -

కాలిబాటల వెంట నడిచి వెళ్లారు - చెట్లల్లో - చెట్ల కొమ్మల మీద ఊగులాడారు: - పాడు కుంటూ - కోనేటి నీళ్లల్లో కాళ్లు పెట్టారు - నీళ్ల చిమ్ముకుంటూ ప్రక్కనున్న వంతెన మీద పరుగులెత్తారు - పరవశిస్తూ చిన్నపాటి పొదల మాటున మాయ మయ్యారు.

ఫలితం మాత్రం అంత అందంగాసూ లేదు.

కాలి బాటల వెంట పరుగులెత్తు తుంటే , నేపథ్య సంగీతం ఏదీ లేదు, గనక పేలవంగా అనిపించింది. పైగా . . . కా[illegible] జారి ఓ కొండ బండ మీద కూలబడ్డది మాణిక్యం . . . . లేపడియటానికి హను[illegible]తు చేత కాలేదు.

'పాడుకుంటూ చెట్ల కొమ్మల మీద ఊగులాడుతుంటే మాణిక్యం బరువుకు పాడు కొమ్మ విరిగి పడ్డది.

కోనేటి నీళ్లల్లో కాళ్లు పెట్టి - నీళ్లు చెదర గొడుతుంటే, మాణిక్యం పట్టు చీర బురద బురద అయింది.

ప్రక్కనున్న వంతెన మీద పరుగెత్తు తుంటే, చేతులు కొట్టుకుని - గాజులు పగిలి - గాయాలయ్యాయి. చిన్నపాటి పొదల మాటున మాయమయినప్పుడు, ఇద్దరికీ వొళ్లంతా పల్లేరు ముళ్లు గుచ్చుకున్నాయి. ఇద్దరూ ఒకరి మీద వున్న పల్లేరు కాయలు ఒకరు ఏరుకుంటుంటే, భోజనాల వేళయింది.

వేళ అవటమే గాదు.' గంట లాగ - పళ్లెం మోత విన్పించింది.

హడావిడిగా యిద్దరూ, చెరో త్రోవనా బయలు దేరారు. అల్లా బయలు దేరినప్పుడు కూడా, మాణిక్యం తన ఒంటి మీదున్న నన్న గొలుసు సంగతి మర్చే పోయింది.

అప్పి అట్ట హాసాలతో భోజనాలారంభమయ్యాయి. దామోదరమే అన్ని ఏర్పాట్లు చేశాడు. విస్తళ్లు వేయించాడు. మంచి నీళ్లు పెట్టించాడు. వడ్డనంతా తనే బంతులు గుండా తిరుగుతూ జాగ్రత్తగా చేయించాడు. తీరా 'హెచ్చరిక' జరిగే సమయానికి, తనూ ఒక చోట విస్తరేయించుకు కూర్చున్నాడు. హనుమంతు వడ్డన చేయటం మొదలెట్టాడు - వంట బ్రాహ్మలూ మరికొందరు ఆడవాళ్లతో చేరి -

"ఆ వైపు కూర కలవ లేదు" . . .

"ఈ మూల అద్దాలు పడలేదు." అంటూ, బంతులంబటి పరుగెత్తుతూ, హనుమంతు - ఒక్క కమలా జానకి వున్న లైను తప్ప అన్ని లైన్లూ తిరిగాడు. మొహమాటం లేకుండా చెప్పాలంటే అతను ఎక్కువ భాగం మాణిక్యం వున్న వైపే శ్రద్ధ కేంద్రీకరించాడు. మాణిక్యానికి ఎక్కువ అద్దాలు వడ్డించాడు - వద్దంటున్న కొద్దీ. చాలామంది సహ్యపాకులకే ఈ హడావాడి చేస్తే ఆశ్చర్య మేసింది.

"ఎవరండీయన ?" అని అడిగాడు ఒకాయన - ప్రక్కనున్న ఆయనని.

"తెలియదు"

ఈ ప్రశ్న బంతి వెంట చాలా మందిని అడుగుతూ చాలా దూరం పోయింది. అందర్నూ 'మాకు తెలియదంటే మాకు తెలియదను కున్నారు -

"ఎవరో తిని పోవటానికి వచ్చిన వాళ్లు లె" మ్మను కున్నారు - చాలా మంది.

"పోనీలే చాకిరీ చేస్తున్నారుగా !" అనుకున్నారందరూ.

అందరి భోజనాలయ్యాయి.

● ధనంతో ప్రమేయం లేకుండా సాధించేదే - సాధనం !



9

భోజనాంతరం.

పేకాట వారు - మళ్లీ పేక ఆటలో పడ్డారు.

చాలామంది జంపకానాల మీద ఒళ్లు వాల్చేశారు - నిద్ర కాగలేక. అందరితో పాటు హరిహరం కూడా. నిద్ర పోలేదు గానీ తనువు వాల్చేశాడు.

కొందరు మాత్రం మళ్లా పరిసరాలకు బయలు దేరారు. ఆ ఊరికి కొత్త వారవటం వల్ల - కమలా సురేష్‌లు గూడా మరి కొన్ని ప్రదేశాలు చూద్దామనుకుని బయల్దేరారు. కాసేపుండి జానకి "మీతో బాటు నేనూ వస్తాన"న్నది. నిర్మొహమాటంగా. . .

హరిహరం "నేను రాలేను బాబూ " అన్నాడు. అయినా జానకి బయలు దేరింది. కొంచెం చిన్న బుచ్చు కున్నాడు - హరిహరం. అప్పుడు చేరాడు దామోదరం - హరిహరం ప్రక్కకు - అందరూ తలా ఒక దారినా వెళ్లిన తర్వాత, ఒంటరిగా హరిహరం పడుకుని వుంటే . . .

"నమస్కారమండీ ప్లీడరు గారూ !" అంటూ ప్రక్కనే నడుం వాల్చాడు.

"నమస్కారం"

"గుర్తుందా?"

"ఉంది . ఆ వేళ మీ గుర్రు . . . "

"ఆ వేళ ఏదో మంచి నిద్రలో వుండి . . . గానీ . . . మామూలుగా అంత వుండదు లెండి."

"అల్లాగా!"

"వెధవ ! ఆ సురేషు - మంచి వాడే గానీ . . . దూరమైనా బంధువే గానీ - పొద్దు నుంచీ పలకరించనన్నా లేదు, చూడండి. ఎంత చెడ్డా - పెద్ద వాణ్ణి గదా

" . . . . . . "

'అదృష్టం కొద్దీ మంచి ఉద్యోగం వచ్చింది. వచ్చింది సరే ... లందరం తన బాగు కోరే వాళ్లమే, గానీ పరాయి వాళ్లం కాదు గదా? ఇంత మాత్రానికే అంత మిడిసి పాటా?"


" . . . . . . "

"ఆ ! మా అందరి సంగతీ ఏముంది లెండి. తల్లి తండ్రుల మాటే లెక్కలేదు వాడికి !"

"అల్లాగా!"

"అబ్బే ! కష్టపడి చదివించాడు తండ్రి . ఇంకా ముగ్గురు పిల్లలున్నారు చదువుకుంటూ ! తనకి పదిహేను వందల దాకా జీతం . ఏదీ ? దమ్మిడీ ఇంటికి పంపడు."

"ఉహూ"'



"వాడికి 'తండ్ర'ంటే అసలు లెక్క లేదు లెండి. ఉంటే ఇల్లా ఎందుకు చేస్తాడూ ! తండ్రి వద్దంటున్నా ఈ అమ్మాయిని ఎందుకు తెచ్చి పెట్టుకుంటాడూ?"

"తండ్రికి ఈ అమ్మాయి ఇష్టం లేదా?"

"సరే ! అసలు మీకేం తెలియదు లాగుంది ! అసలు పెళ్లెక్కడ అయిందండీ ?'

"పెళ్లే కాలేదా?"

"లేదు. వాళ్లది లవ్ మారేజ్ ?"

"అల్లాగా?"

"పోనీ ఏదో ఒక మారేజీ . . . . జరిగివితే బాగుండును . కానీ - ఏదీ ఆ పిల్లకీ వీడికీ ఏవో గుసగుసలు జరిగాయి. 'సరే ' నంటే 'సరే' అనుకున్నారు. ఉత్తరాలు కూడా రాసుకున్నార్ట ! లేచి రమ్మన్నాడు. వచ్చేసింది. మీ ఇంట్లో పెళ్లయినట్లే కాపురం పెట్టేశాడు. అంతా అయిన తర్వాత తండ్రి ఏమంటాడూ ! రెండ్రోజులు "లబో - దిబో ' మన్నాడు. తర్వాత ఊరుకున్నాడు ."

"ఉహూ!"

"ఊరు కోక ఏం చేస్తాడూ కన్న కొడుకును కాదంటాడా? వదులుకుంటాడా?"

"అవును , మరి "

"ఆ ! ఇప్పుడు వదులు కోక ఏమయింది లెండి . పాపం ఆ అమ్మాయి తల్లి



తండ్రులే మరీ ఇదయి పోతున్నారు."

"ఏం?"

"ఏమిటండీ! ఒక్కగానొక్క ఆడపిల్ల ! చేతులారా పెళ్లి చెయ్యాలనీ కన్నె ధార పొయ్యాలనీ ఎవరి కుండదూ?"

"ఉంటుంది."

"ఉండి ఏం చేస్తారు లెండి. ఈ మాత్రం సంబంధం తీసుకురాగలరా. పెట్టగలరా ! సరే - కొడుకుల్ని చదివించలేక సతమతమవుతున్నారు."

"ఏం?"

తరువాత లేచి నడవటం ఆరంభించాడు - జానకీ వాళ్ళు బయలు దేరి వెళ్లిన వైపుకే కాళ్లు సాగాయి.

మాణిక్యానికి బంగారపు నగలు దిగబోసినన్ని వున్నాయి. అన్నీ పెట్టుకునే వచ్చింది. అందులో సన్న గొలుసు పోయింది. కాని చాలాసేపటి వరకూ చూసుకోలేదు. భోజనాలయినాక చూసుకుని - " అయ్యో నా గొలుసు ! " అంటూ ఏడుపు మొదలు పెట్టింది.

విన్నవాళ్లంతా చుట్టూ చేరారు.

నానారకాల ప్రశ్నలూ వేశారు.

"ఎక్కడెక్కడ తిరిగావ్ !"

"ఎప్పుడు చూసుకున్నావ్!"

"ఆఖరు సారి ఎప్పుడు ఎక్కడ కళ్ల చూసుకున్నావ్!"

ఏదీ జ్ఞాపకం లేదు - మాణిక్యానికి . . . .

ఏడుపే ఏడుపు.

" మా అమ్మ ఏమంటుందో ఇంటి కెళ్తే !"

"నాన్న ఏమంటాడో ఇది తెలిస్తే ! . . . . . ."

మాణిక్యం గొలుసు మాయమ యిందన్న వార్త పాక్కి పార్లిందా ప్రాంతమంత- పది నిమిషాల్లో !

అందరూ ఆ ప్రదేశమంతా గాలించేశారు. వెళ్లి కోనేటి ప్రాంతమంతా వెతికి వేశారు.

ఎక్కడా దొరకలేదా గొలుసు.

అందరి సంచీలు దులిపి చూపించారు. జంపకానాలన్నీ దులిపి చూశారు.

అంతలో ఈ గందరగోళానికి దామోదరం మేలుకున్నాడు.

వార్త వినగానే "హనుమంతు ఏడీ" ? అని అడిగాడు.

హనుమంతు "ఏడీ " . . . " ఏడీ" . . .? అందరూ అదే ప్రశ్న.

- అహంకారియైన మేధావంతుడు విరిగిన పాలతో సమానం.

అక్కడెక్కడా లేడు హనుమంతు.

"ఏయేమిటండీ - వచ్చేదీ రెండొందలు రూపాయలు. ఎన్నింటికని తట్టుకుంటాడూ ?"

"పాపం!"

"పాపం ఏముంది లెండి ! పదెకరాల ఆస్తి వుంది. కాని - "

"ఇంకేం?"

"ఇంకా ఏముంది లెండి. దానికి తగ్గ అప్పూ వుంది."

"అల్లాగా"

" ఉంటే ఏం లెండి. ఈ పిల్ల పెళ్ళి ఖర్చు తగలకుండా తప్పిందిగా ! ఫర్వాలేదు. తట్టుకుంటాడు."

"ఇంకేం ?"

హరిహరం ఏదో వింటూ ప్రశ్నలు వేస్తున్నాడే కాని, మనసు అక్కడెక్కడా లేదు. చాలా దూరానికెళ్లి - అక్కడెక్కడో జానకి - సురేష్‌లున్న చోట విహరిస్తున్నది. జానకిని అనుమానించటానికేం ఆయన మనస్సు అంగీకరించటం లేదు. అయినా వయసులో - వయసులో - వున్న వాళ్లు ! ! ! ఏమో ! మనసందరిదీ చంచలమైనదే కదా !

దామోదరం చెప్పుకు పోతున్న చరిత్ర మీద, ఆయన కంత శ్రద్ధ లేదు. కమలా సురేష్ అంత బుద్ధిమంతులు. జానకి కంటే కమల అంత అందగత్తె . . . కాని మనసులో ఏదో ఒక ముల్లు గుచ్చు కుంటే - ఆ గాయం ఇక మాసదు.

హరిహరం మాట్లాడ కుండా వుంటే - మరేదో ఇంకా చెప్పాలన్న కుతూహలం - దామోదరానికి తరిగి పోయింది. సుష్టుగా భోజనం చేశాడేమొ ! 'ఈ హరిహరానికి పురి ఎక్కించటం కంటే - నిద్ర పోవటమే ప్రయోజన కరం' - అనుకున్నాడు. నిమిషంలోనే నిద్ర వచ్చింది. హరిహరానికి నిద్ర రానూ లేదు. ఆ అలవాటూ లేదు. పైగా దామోదరం గుర్రు ఆరంభమయింది. చివాలున లేచాడు.

ఒకరెవరో - భోజనాల తర్వాత ఆయన్ని చూడనే లేదన్నారు.

ఆ మాటే అందరూ ఖాయం చేశారు.

"ఇంకేం ! అతని పనే ఇది" అన్నాడు దామోదరం.

మాణిక్యం మళ్లీ ఏడుపు మొదలెట్టింది . . . .

"కొంప ముంచాడ్రోయ్ ; దేవుడోయ్ ! . " . . .

కమలా సురేష్‌లు గానీ, జానకి గానీ ఎక్కడా కనిపించలేదు - ఎంత వెతికినా - హరిహరానికి. వనభోజనం సభ్యులెవ్వరూ కనిపించలేదు - ఎవర్నన్నా అడగటానికయినా. వెతికి వెతికి విసుగు వచ్చింది.

తర్వాత నీలా - రంగా - వాళ్ల తల్లి తండ్రులు కలిసే కనిపించారు. వాళ్ల



నడిగితే ఇందాక ఆ రోడ్డున వెళ్తూ కనిపించారన్నారు. మాకూ్కడా ఫోటోలు తీశారన్నాడు - రంగా.

"నాకూను " అన్నది నీల.

హరిహరం త్వర త్వరగా ఆ రోడ్డు వెంట నడిచాడు -ఆ ఎండలో నిజమే !

ఆ పిల్లలు చెప్పింది నిజమే !

దేవాలయానికున్న తోటలో అందరూ వున్నారు - అల్లంత దూరాన . . . జానకి . . . . కమల . . . . సురేష్ ఇంకెవరెవరో . . . .

సురేష్ ఫోటోలు తీస్తున్నాడు - కమలకీ -జానకికేనా ? ఒక్క జానకికేనా ?-

మరికాస్త దగ్గరగా నడిచాడు - పొదలేవో అడ్డుగా వున్నాయి.

"జానకి గారూ ! మీరు కాస్త నవ్వాలి " అంటున్నాడు సురేష్.

"ఈ పొదల చాటునుండి కాసేపు ఆగి చూస్తే - ?" అనుకున్నాడు.

హరిహరం ఒక పొద చాటున ఆగిపోయాడు.

కమలా జానకీల నవ్వులు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"జానకి ఇంత హుషారుగా ఎప్పుడన్నా వుందా?"

ఆలోచించ సాగాడు హరిహరం.

"సురేష్ ఇంత చనువుగా జానకితో ఇదివరకెప్పుడన్నా మాట్లాడాడా?"

"ఛీ - జానకి తననే ఇంత మోసం చేస్తోందా ?"

"ఇందుకే తను దగ్గర కెళ్తే కాదంటోందా?"

"ఇంతకంటె అవమానం వుందా ! ఇంత బ్రతుకు బ్రతికే ! !!"

ప్రక్కనే అగాధమైన లోయ!

"ఇందులో దూకేస్తే - !"

"లేక వెళ్లి - సురేష్‌ను ఎడాపెడా వాయిస్తే - !"

"సురేష్‌తో తను కలియబడి నెగ్గ గలడా!"

ఆ ఒక్క నిమిషంలో ఎన్నెన్నో ఊహలు చెలరేగుతున్నాయో - హరిహరానికి!

ఆలోచనలోనే పొదల మాటు నుండి, బయట పడి కనిపించాడు హరిహరం - అందరికి.

"రండి ; హరిహరం గారూ, మీకూ , జానకి గార్కి కలిపి ఒక 'స్నాప్' తీస్తాను." ఆహ్వానించాడు సురేష్. అప్పుడే కమలకీ, జానకికీ ఒక ఫొటో తీశాడు.

"మా కెందుకు లెండి వద్దు " అన్నది - జానకి. తర్వాత ఎంత బ్రతిమాలినా "వద్దంటే - వద్దూ " అన్నది. అవిడ వద్దన్న కొద్దీ హరిహరానికి కోపం ఎక్కువయింది.

"అవును ఈ ముసలాడితో ఫొటోకి ఎందుకు ఒప్పు కుంటుంది" తను పసుపు పిల్లాయె.

ఈ లోగా మాణిక్యం వూరు కోలేదు. గొలుసు ఎవడో కొట్టేశాడనీ, -

వంట వాడ చేత ఇంటికి కబురు చేసింది. ఆ తండ్రి తన 'వస్తాదు దార్ల'యిన పదిమంది రౌడీలను వెంటనే కారు మీద పంపించాడు. వాళ్లు వచ్చి మాణిక్యాన్ని కలుసుకున్నారు. వాళ్లకి హనుమంతుని వెదికి పట్టుకోమని - నలుదిక్కులకి పంపించింది మాణిక్యం. తలా దిక్కుకూ వెళ్లారు. వెతుకుతూ వెళ్లి, దోవలో హరిహరాన్ని కలుసుకున్నారు.

అక్కడాయన్ని వాళ్లు "హనుమంతు అనే ఆయన ఎక్కడ ?" అని అడిగాడు.

"ఎందుకూ?"

"దొంగతనం చేశాడుట - వనభోజనం లో " అన్నాడొకడు.

"దొరికితే చావగొట్టటానికి " అన్నాడు మరొకడు.

హరిహరం ఆలోచించాడు.

"అదుగో !" అని - సురేష్‌ను చూపించాడు.

వాళ్లు అంత హంగామాగానూ - కమలా,సురేష్, జానకీలు వున్న వైపు వెళ్లారు.

"హనుమంతు అంటే మీరేనా?"

"కాదు"

"కాదూ? మమ్మల్ని తప్పించుకుందామనే!"

వెనక నుంచి ఒక గుద్దు గుద్దేడు ఒక రౌడీ.

తక్కిన ముగ్గురూ చేతులెత్తారు.

"తియ్యి బయటికి ! మాణిక్యం గారి గొలుసు బయటికి తియ్యి" తెల్లబోయి చూశాడు సురేష్.

చాలాసేపు ఎవ్వరికీ ఏమీ అర్థం కాలేదు.

రౌడీలు కొట్లాటకు దిగారు.

సురేష్ ఎదురు తిరగక తప్పలేదు. ఆత్మరక్షణ కోసం - వాళ్ల ముష్టి యుద్ధం బహా బహీగానే జరగ నారంభించింది.

జానకీ తక్కిన వారూ నిస్సహాయంగా నిలిచిపోయారు.

సురేష్ మరింత విజృంభించాడు.

దెబ్బకు దెబ్బ . . . దెబ్బ మీద దెబ్బ.

ఒక రౌడీ దవడ పగిలింది.

మరో రౌడీ తల రాయి మీద పడి - మరి లేవలేదు.

ఇంకొకడు పారిపోయాడు - వచ్చిన దోవన.

సురేష్‌కి వంటి నిండా గాయాలే.

"దుర్మార్గులు ! ఎవరో వీళ్లు ?" కసిగా అన్నది జానకి.

"ఏమండీ! ఎల్లా వుంది !" ఖంగారు పడ్తూ దగ్గర చేరింది కమల.

ఎవరిదో వాటర్ బాటిల్ తీసుకుని స్రవిస్తున్న రక్తాన్ని కడిగారు ఇద్దరూ.

కాసేపు అక్కడే విశ్రాంతి తీసుకున్నాడు సురేష్.



చాలాసేపటికి గానీ, వాళ్లందరూ అక్కణ్ణించి బయలు దేరలేదు.

అంతసేపూ . . . . . . !

హరిహరం ఆదుర్దాగానే వనభోజనం జరిగిన చోట కాచుకునే వుండి కాలక్షేపం చేశాడు.

ముందు రౌడీలు వచ్చి, ఆయనతో ఏం మాట్లాడ కుండానే వెళ్లారు - మాణిక్యాన్ని తీసుకుని.

తర్వాత ఈ వార్త అక్కడున్న వాళ్లందరికీ తెలిసిపోయింది. అంతా తెలిసిన తర్వాత దామోదరం - "ఇంకెక్కడుంటాడూ హనుమంతూ ? ఈ పాటికి రైలు ఎక్కేసి వుంటాడు. లేదా - ఆ గొలుసు అమ్మేసి వుంటాడు" అన్నాడు.

సురేష్ అందరితో బాటువనభోజన స్థలానికి వచ్చిన తర్వాత మరింత ఖంగారు పడ్డారంతా . అంతా పరామర్శించే వాళ్లే! అంతా పరితపించే వాళ్లే.

అంతరితో బాటు హరిహరం గకూడా . . . .

"ఏమండీ తొందరగా మనం బయలుదేరుదాం, వీరిని తీసుకుని వారు స్కూటర్ మీద రాలేరు " అన్నది జానకి.

హరిహరానికి సరే అనక తప్పలేదు.

నలుగురూ కారులో బయలు దేరుతుంటే పిల్లలు గూడా కారులో ఎక్కుతామని గోల చేశారు. జానకీ 'సరే' అన్నది. హరిహరం ఊరుకోక తప్పలేదు. రంగడి తండ్రి స్కూటర్ మీద వస్తానన్నాడు.

వనభోజనం అల్లా వెళ్ల మారింది.

* * *

## 10

కారు ఘాట్ రోడ్డులో వెళ్తున్నంత సేపూ ఏవేవో దుర్మార్గపు ఆలోచనలు పొడసూపుతూనే వున్నాయి హరిహరానికి.

దానికి - జానకి తన ప్రక్కన కూర్చోకుండా, వెనక సీటులో కమల ప్రక్కన కూర్చోటం కొంత కారణం . లోపలున్న తీరని పగ కొంత కారణం.

"ఈ కారు మొత్తాన్ని ఘాటు రోడు తప్పించి, లోయలోకి పట్టిస్తే . . . .

ఆ వచ్చే చెట్టుకు గుద్దేస్తే . . . .

ఈ కాలవ లోకి దింపేస్తే . . . !"

దేనికీ ధైర్యం చాల లేదు హరిహరానికి. ఒక్కడి మీద కోపంతో - ఇంత మంది మీద కశా - అందులో ఈ పరాయి పసి పిల్లల మీదా కసి ? ఆ ఆలోచని అంతటితోనే ఆగిపోయింది హరిహరానికి.

ఘాట్ రోడ్డు దాటి - కారు ఊరి వీధుల్లోకి వచ్చేసింది.

తర్వాత హరిహరానికి అటువంటి ఆలోచనేదీ రాలేదు.

ఆలోచనలు వేరే వేరే పరుగెత్తాయి.

చంపటానికిదొక్కటేనా పద్ధతి ? చాలా వున్నాయి ! తనకే ధైర్యం వుండాలి గానీ !

అంతలో లోపలున్న లాయర్ బుద్ధి బయటకు వచ్చింది.

"నీ కోపం జానకి మీదా ? సురేష్ మీదా?"

"సురేష్‌మీదే!"

"సురేష్ చేసిన తప్పేమిటి?"

"తను అందంగా వుండటమా ? యవ్వనంలో వుండటమా?"

ఎంత వెతికినా అతని తప్పేమీ కనిపించలేదు.

"అయితే జానకి తప్పా?"

"అదే మరి ! వయసులో వున్నాను గదా అని – కట్టుకున్న భర్తను మోసం చేస్తుందా ?"

"ఏం మోసం చేసిందీ ? ఇప్పటికేం చెయ్యలేదే ! తనే బాధ పడి – ఊరుకొంటోందిగా!"

"వాళ్లతో చనువుగా మాట్లాడుతోంది. ఫోటోలు తీయించుకుంటోంది. తనను చూస్తే ఉల్లాసంగా కనబడటం లేదు."

"పదేళ్ల కాపురం తర్వాత ఇంకా ఏం ఉల్లాసం?"

అదీ ఆలోచించ తగ్గదే ! ఇన్నేళ్లబట్టి జానకిని ఏమన్నా అనగలిగాడా ? – వీళ్ళు ఇంట్లోకి వచ్చి చేరేదాకా?

నిజానికి మార్పంతా కమల ఇంట్లోకి వచ్చి చేరిన తర్వాతే ! – అంతకు ముందు?

మాటన్నా మాట్లాడేది కాదు జానకి – సురేష్‌తో – నెల రోజుల్నించీ – తమ ఇంట్లోనే వున్నా? . . . .

" ఆ దామోదరం ఏదో చెప్పాడు. ఆ గోల సంగతేమిటి?

అదంతా నిజమేనా?

వీళ్ళిద్దరూ లేచి వచ్చిన వాళ్ళేనా ?"

కులాంతర వివాహమా – వీళ్లది?

"కాకపోతే లేచి రావట మెందుకూ?"

అబ్బాయి కులాంతరమా ? అమ్మాయి కులాంతరమా?

"కాని అల్లా కనిపించదే!"

హరిహరంగారి 'వాద పటిమ' కు ఏదీ అందటం లేదు. కారు ఇంటి ముందు కొచ్చేసింది. ఇంటి ముందు ఆగింది. అందరూ బిల బిలా దిగారు. సంతోష స్వాంతాలతో ఎవరి భాగాలలోకి వాళ్లు వెళ్లారు.

---

● విరిచివున్న విమానాన్ని కేవలం కాలినడకతో అధిగమించ వచ్చు!

---



జానకి – కమల వాళ్ల భాగంలోకి వెళ్లి – సురేష్ విశ్రాంతిగా పడుకున్న తర్వాత – తనే నెమ్మది పడి, తమ భాగం లోకెళ్లింది.

లోపలి కొచ్చినా కూడా, హరిహరం ముఖారవిందం ముకుళించుకునే వుంది.

"ఏం . అల్లా వున్నారు?"

"ఏం లేదు."

"కాఫీ పెట్టనా? నివ్వరం తాగలేదుగా!"

"పెట్టు"

జానకి అందరికీ కాఫీ పెట్టింది. భర్త కిచ్చిన తర్వాత రెండు కప్పులు తీసుకెళ్లి కమల కిచ్చింది.

"ఎందుకండీ . నేను పెట్టేదాన్నిగా?"

"ఇప్పుడేం పెడతావ్ ! కాస్త ఆయన దగ్గరుండి ఏం కావాలో చూడాడు. పాపం నలుగురు రౌడీలతో పోట్లాడారు. వాళ్ల దుంప తెగ – ఎవళ్లో వాళ్లు ?"

". . . . . . . . . . . . ."

ఆ మాటలన్నీ హరిహరం వంటింట్లోంచి విన్నాడు. ప్రాణం చివుక్కుమన్నది.

అంతలో జానకి తిరిగి వచ్చేసింది. తన కాఫీ గ్లాసు తీసుకుని పడక గదిలోకే వెళ్లింది. మధ్య తలుపు వద్దే నుంచుంది. రంధ్రం ద్వారా అవతల గదిలోకి చూస్తోంది.

వెనకనే హరిహరం వెళ్లాడు. జానకిని చూశాడు.

"ఏమిటి చూస్తున్నావ్"

"ఆయన కెల్లా వుందోనని."

"బాగానే వుందిలే. అల్లా రంధ్రాల్లోంచి చూడటం మర్యాద కాదు."

"మర్యాద కాదు నిజమే ! కాని పట్ట పగలేగా ! అందులో ఆయన వొళ్లంతా గాయాలు!"

"మరేం పర్వాలేదు. కుర్రాడు. ఏ 'ఫుట్ బాల్ ' ఆడుతుంటే తగలవ్ – ఆ మాత్రం దెబ్బలు?"

"ఇది ఫుట్‌బాల్ లాంటి ఆటా ? నలుగురు రౌడీలు – దున్న పోతుల్లాంటి వాళ్లు – అల్లా మీద పడి కుమ్మేస్తే . . . . . . . ఆ మాత్రం సానుభూతి లేదేమిటండీ – తోటి మనిషి మీద ?"

"ఆ ! నీకున్నది చాల్లే!"


"ఏమో బాబూ ! నాకు మాత్రం కడుపు చెరువై పోయింది."

"అల్లాగేం ! పాపం ! వెళ్లి నువ్వు కాస్త కాపడం పెట్టక పోయావ్ ?

"నిజంగా పెట్టమంటారా?"

"నోర్మూయ్యి!"

" నా నోరు ముయ్యటానికి తొందరేముంది గానీ, మీరు వెళ్లి కాస్త పరామర్శించి



రండి. బాగుండదు. తోటి వాళ్లం. తోడుగా తోట కెళ్లాం . . రండి . పదండి . . . రండి "

హరిహరానికి వెళ్లకా తప్పాలేదు. పరామర్శించకా తప్పలేదు. సురేష్ బాగానే మాట్లాడుతూ వున్నాడు. నవ్వుతూనే పలకరించాడు. అంతలో పిల్లలూ వచ్చారు. వాళ్ల తల్లి దండ్రులూ వచ్చారు.

ఇక్కడ పరామర్శలు జరుగుతుంటే, అటు ఊళ్లో కొంపలంటుకు పోతున్నాయి.

దామోదరం సరాసరి తనూ మాణిక్యం ఇంటికి వెళ్లాడు. ఈ పని హనుమంతుదేనని - మాణిక్యం తల్లి తండ్రులు నమ్మ బలికాడు. దానికి మాణిక్యం వత్తాసు కూడా దొరికింది. తర్వాత దామోదరం వాళ్లను పోలిసు రిపోర్టు ఇవ్వమన్నాడు. రిపోర్టిచ్చారు వాళ్లు. మాణిక్యమే హనుమంతు గుర్తులన్నీ చెప్పింది. తర్వాత " ఆ హనుమంతుకు ఈ వూళ్లో చుట్టా లెవ్వరూ లేరు. ఉంటే ఈ వూళ్లో ప్లీడరు హరిహరం గారింట్లో అద్దెకున్న సురేష్ గారేన"ని చెప్పాడు. వాళ్ల ఇంటి గుర్తులూ చెప్పాడు. "ఉంటే హనుమంతు అక్కడ వుండాలి . లేదా ఈ సరికా గొలుసు అమ్మేసి వుండాలి" అన్నాడు చివరి మాటగా దామోదరం. పోలీసులు వెంటనే - నిమిషాల మీదు - సురేష్ ఇంటి ముందున



వాలారు. ఇల్లు సోదా చెయ్యక తప్పదన్నారు - హరిహరంగారితో గూడా.

హనుమంతు పోయినా అల్లరి తప్పలేదు. సోదా అయితే జరిగింది. ఇల్లంతా ఆగమాగమయింది. సొమ్ము దొరకలేదు. పోలీసులు వచ్చారూ, వెళ్లారు.

చూసిన వారందరికీ - "ఇదేం గొడవ" అని అసహ్యమేసింది.

హరిహరం మాత్రం లోలోన సంతోషించాడు.

ఇక నా సాయంత్రం . . . .

రంగడు మరింక నలుగురు పిల్లల్ని ఆ దొడ్లోనే చేర్చాడు. వాళ్లందరూ రౌడీలట ! - తను సురేష్‌ట ! నీలను వాళ్లందరి నుండీ రక్షిస్తున్నాడట! - దొడ్లో పడి ! - అంతా సురేష్ లాగే "డిష్యూం" . . . . "డిష్యూం" . . . .

బాగా పొద్దు కూకింది. చీకటి పడింది. రంగడి కోసం నీల కోసం వాళ్ల తల్లి తండ్రులు వచ్చి - ఎవరి పిల్లల్ని వాళ్లు వరుసగా బాది, లాక్కెళ్ళేదాకా - రంగడు నీలను రక్షిస్తూనే వున్నాడు.

## 11

పగలంతా అలసి సొలసి ఉన్న మీదట జానకి కన్ను మూయగానే కునుకు దీసింది. హరిహరానికే నిద్ర పట్టలేదు. మరునాటికి పడివున్న పదికేసుల సంగతి కూడా పట్ట లేదు. ఏమీ పాలుపోక చాలా సార్లు పచార్లు చేశాడు. తర్వాత మధ్య వాకిలికి వున్న రంధ్రం జ్ఞాపకం వచ్చింది. దాంట్లోంచి సురేష్‌ను చూద్దామనుకున్న కుతూహలం పెరిగింది . చూడసాగాడు.

అవతల గదిలో సురేష్ బాగానే వున్నాడు. కులాసాగా కబుర్లు చెబుతున్నాడు. కావాలనిపించినప్పుడల్లా, సురేష్ కమలను దగ్గరకు లాక్కుంటున్నాడు. సురేష్ కాదన్నా, నొప్పి అనిపించినప్పుడల్లా మీదికి వొంగి కమలే మెత్తగా ముద్దులు అద్దుతోంది. ముద్దు ముద్దుకూ నొప్పులు తగ్గి పోతున్నాయో ! ముద్దుల ముద్దర్లకే నొప్పులు పుట్టు కొస్తున్నాయో ! హరిహరానికి తేలటం లేదు. - ఎంతసేపటికీ. "ఛీ !ఇల్లా కాద"ని హరిహరం వెనక్కి తిరిగి వచ్చి పడుకున్నాడు. టేబుల్ లైట్ వెలిగించాడు. తన ఫైళ్ల కట్ట విప్పాడు.

709/79 మనోవర్తి దావా . . . . కట్ట విప్పగానే ఆ కేసు విషయమంతా జ్ఞాపకం వచ్చింది.

"ఆ కేసు రెండేళ్ల బట్టి నడుస్తోంది - మనోవర్తి కేసు - రావణాసురుడి కాష్టం లాగా. ఎన్ని సార్లు చెప్పినా వినదా అభిమాన వంతురాలు - కోర్టుకు వున్న వస్తువులన్నీ పెట్టుకు వస్తుంది. " ఇది కోర్టు అమ్మా నువ్వు మనోవర్తి కోసం వచ్చావ్ ! దిక్కూ మొక్కూ లేక నువ్వు అల్లాడి పోతున్నానంటూ వచ్చావ్ - నువ్వు ఆకలితో అలమటించి పోతున్నావ్ - అని మేం గొంతు పగిలేటట్లు వాదించాలి. ఆ నగలేవో నువ్వు ఆ గేటు దగ్గరే వదిలి పెట్టిరా . అప్పుడు గానీ నీ కేసుకు బలం రాదు. మెళ్లో ఇన్ని నగలుంటే - నిన్ను చూసి ఏ జడ్జి జాలి

గౌతమ్ ESTD 1984
రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి
కరెన్సీనగర్, రామవరప్పాడు-521108, విజయవాడ, Ph: 84496

మా ఫలితాలు

| | 1984-86 | 1985-87 | 1986-88 | 1987-89 |
|---|---|---|---|---|
| ఇంటర్ | 95% | 94% | 94% | 95% |
| ఇంజనీరింగ్ | 40/82 | 76/135 | 116/156 | 81/182 |
| మెడికల్ | 5/14 | 4/17 | 3/15 | 1/8 |

1990-91 అడ్మిషన్ నోటీసు
1990-91 జూనియర్ ఇంటర్‌లో చేరదలచిన విద్యార్థులు రూ.25/- ఆఫీసులో చెల్లించి గాని ప్రిన్సిపాల్ పేర రూ.30/- M.O. పంపి పోస్ట్ ద్వారా పొందవచ్చును.
అప్లికేషన్ పూర్తిచేసి పంపుటకు ఆఖరితేది : 15-5-1990
ప్రవేశపరీక్షతేదీలు: అప్లికేషన్ నెం. 1-700 : 16-5-1990
700 పైవారికి : 17-5-1990
పరీక్షాస్థలం: గూడవల్లి క్యాంపస్

గౌతమ్
రెసిడెన్షియల్ మహిళా కళాశాల
భారతీనగర్, విజయవాడ-520008. Ph: 473582
1990-91 జూనియర్ ఇంటర్‌లో చేరదలచిన విద్యార్థినులు రూ.25/- ఆఫీసులో చెల్లించిగాని డైరెక్టర్ పేర రూ.30/- M.O. పంపి పోస్టుద్వారాగాని అప్లికేషన్ పొందవచ్చును.
అప్లికేషన్ పూర్తిచేసి పంపుటకు ఆఖరితేది: 19-5-1990
ప్రవేశపరీక్షతేది: 20-5-1990
పరీక్షాస్థలం: భారతీనగర్
డైరెక్టర్స్
G.BULLIAH Dr. K.KOTESWARARAO N.CHOWDARYBABU



పడదూ " అని ఎన్నిసార్లు మొత్తుకున్నా వినదా మనిషి . పైగా వంటినిండా నగలు ! కాలికి పాదరక్షలు. వేళ్లకుంగరాలూ – " హరిహరం తన క్లయింటు సంగతే ఆలోచిస్తున్నాడు.

అదే సమయంలో అవతల గదిలో . . . .

"వద్దు . వద్దు ; మీకు వొంట్లో బాగుండలేద"ంటోంది కమల.

"నీకు బాగానే వుందిగా !" మీదికి లాక్కుంటున్నాడు సురేష్.

"వద్దంటుంటే . . . . ."

"రమ్మంటుంటే . . . ."

'ఛీ' ఈ కేసు కాదని మరో ఫైల్ తీసుకున్నాడు హరిహరం.

అదో రెడ్డిగారి ఆస్తి-దావా కేసు. మరీ బోరు. ఒకే ఆస్తి కోసం పధ్నాలుగురు ఆశపడ్తున్నారు. అంతా అన్న దమ్ములే – ఆ రెడ్డి గారి కిద్దరు భార్యలు . ప్రతి ఏటా ప్రతి భార్యకీ ఒకరు చొప్పున అక్కడా ఇక్కడా అని పక్షపాతం లేకుండా, పిల్లల్ని కన్నాడాయన. వెరసి – పధ్నాలుగు. ఒక భార్యకు పుట్టిన బిడ్డకు ఏ పేరు పెట్టాడో – ఆ ఏడు ఆ పేరు రెండో భార్యకు పుట్టిన బిడ్డకు పెట్టాడు.

అక్కడ రంగారావు అయితే ఇక్కడ రంగారావు. అక్కడ పద్మావతి అయితే ఇక్కడ పద్మావతి. ఆ ఏడాదేదో 'హరి వంగడం ' ఒకటి కొత్తగా బహుళ ప్రచారంలోకి వచ్చింది. దాని పూర్తి పేరు నోరు తిరక్క – రైతులు దాన్ని "డాష్" అని పిలవ సాగారు. ఆ ఏడాదే ఈయనకి ఆఖరి పిల్లాళ్లు అక్కడా ఇక్కడా పుట్టడం వల్ల – ఆ పిల్లలిద్దరికీ – వేరే పేర్లు దొరక్క "డాషూరావు" – "డామూ రావు" అనే పేర్లు పెట్టేశాడు. తర్వాతెప్పుడో కాలం చేశాడు. ఇప్పుడు కోర్టులో ఇరు పక్షాల ప్లీడర్లకీ ఇదో సమస్య.

ఎవర్ని పిలవాలన్నా ఎవర్ని సూచించాలన్నా – తల్లుల పేర్లు ముందు పెట్టి పిలవాల్సిందే లేక పోతే డామూరావూ – అంటే ఇద్దరూ వస్తారు. ఇద్దరూ పలుకుతారు. లేదా ఒక్కడూ పలకడు.

కేసులో ఆర్గ్యు మెంట్లు మాత్రం మిగిలి వున్నాయి. ఆ సమయంలో అవతల ప్లీడరు – ఇవతల భార్యతో జరిగిన వివాహం చట్ట బద్ధం కాదని పిటీషన్ పెట్టాడు. అసలు కేసు వదిలి పెట్టి ఈ కేసు సాక్ష్యాలు సేకరిస్తున్నారు – పార్టీలు . . .


ఇందాకా హరిహరం మనసు తన ఫైల్ మీదే వుంది. తర్వాత చట్ట విరుద్ధంగా ప్రక్క భాగంలో కాపురం చేస్తున్న కమలా సురేష్‌ల మీదికి పోయింది.

చట్ట విరుద్ధంగా ఇంత పబ్లిక్‌గా కాపురం చేస్తుంటే ఇదేమిటని అడిగే నాథుడు లేడా ?

---

● విద్యాహీనుడు తీగలు లేని వాయిద్యము !

---




నిలదీసి అడిగే అధికారం ఎవరికీ లేదా?

ఇన్నాళ్లూ కమల తల్లీ తండ్రీ ఊరుకున్నారేం ? కట్నాలివ్వలేక పోనీ గుండెల్లో కుంపటి దిగి పోయిందే చాలని ఊరు కున్నారా?

ఏమో!

చట్టాలున్నాయి. అన్నీ కట్టు దిట్టంగానే వున్నాయి. కోర్టులున్నాయి. అంత పట్టుదలగానూ పని చేస్తున్నాయి. న్యాయమేదో అన్యాయమేదో అంతా రాసి పెట్టే వుంది – 'లా' పుస్తకాల నిండా . కాని F.I.R. లేందే ; ఖూనీ కేసు కూడా లేదు. . . . ఆ రాత్రి మన్మధ విక్రీడితం ఆ గదిలోనూ . . .'లా' అనే అమృత మధనం ఈ గదిలోనూ జరుగుతూనే వుంది.

ఒక వారం రోజులయి పోయాయి. సురేష్‌కి నయంగానే వుంది. మామూలుగా రోజూ బ్యాంకుకు వెళ్లి వస్తున్నాడు. కాఫీ గిన్నెలు మరుగుతున్నా యొక రోజు ఉదయాన్నే.

వంటింట్లో కెళ్లి హరిహరం నెమ్మదిగా అన్నాడు జానకితో

"ఇంతకూ ఇది విన్నావా? వాళ్లిద్దరికీ పెళ్లి కాలేదుట!"

"ఎవరికీ!"

"ఆ కమలా సురేష్‌లకీ . . . . ఇతను ఉత్తరం రాస్తే తల్లి తండ్రులకు చెప్పకుండా లేచి వచ్చిందిట!"

"నిజంగా!"

"ఇది వట్టి రూమరు కాదు. ఆ దామోదరం చెప్పాడు. నేనూ ఇతరత్రా అడిగి కనుక్కున్నాను. కావాలంటే నువ్వే వెళ్ళి అడిగి చూడు."

జానకింక అక్కడ ఆగలేదు.



భీషణాకారయై అవతల భాగం వంటింట్లో కెళ్లింది. అక్కడ జానకిని చూడగానే – ఆ ఆకారానికే – కమల నిస్తేజ రాలయింది.

"మీ . . . . మీ ఇద్దరికీ పెళ్లి అయిందా?"

"లేదు" . . . . ఎంతో ఖంగారు పడిపోతూ కమల ఎల్లాగో అనగలిగింది.

"లేకుండానే కాపురం చేస్తున్నారా?"

జానకి మరిక అక్కడ ఆగ లేదు. గబగబా వెళ్లి పోయింది.

త్వర త్వరగా రిక్షా ఎక్కింది.

ఎక్కడి కెళ్లిందోనని కమల గాభరా పడి సురేష్‌తో చెప్పింది. ఇద్దరూ ఇదేం గోల అవుతుందో అని ఆందోళన పడ్తున్నంతలోనే – జానకి తిరిగి వచ్చి – రిక్షా దిగింది.

సరాసరి లోపలికే వచ్చింది.

చేతిలో మంగళ సూత్రాలు తీసి – ఇదిగో పూల దండలు. గోడ మీద దేముడూ రెడీగానే వున్నాడు. మంగళ సూత్రాలు కట్టించుకో . . . .

కమలా సురేష్‌లు ముందు నిర్ఘాంత పోయారు.

నెమ్మదిగా తెప్పరిల్లారు.

"ఇప్పుడు మీరెళ్లి బజారు నుంచి తెచ్చారా?"

"అదంతా తర్వాత. ముందు మంగళ సూత్ర ధారణ కానివ్వండి."

దైవ సన్నిధిలో మంగళ సూత్ర ధారణ అయింది. తోటలో దైవికంగా పిల్లల పెళ్లి ఊరేగింపు ఆట సాగుతోంది. రక రకాల వాయిద్యాలు మ్రోగాయి. పిల్లలు పల్లకితో సహా – పెళ్లి ఊరేగింపు నిర్వహిస్తూ రోడ్డంతా తిరుగుతున్నారు. దొడ్డంతా కాసేపు రణగొణ ధ్వనితో నిండి పోయింది.

కాసేపు అందరి హృదయాలు బాజా భజంత్రీలతో మోగి పోయాయి.

జానకి అంతటితో ఆగలేదు.

అంత హడావుడిగాను తమ భాగంలో కెళ్లింది. చెయ్యి పుచ్చుకుని హరిహరాన్ని ఇటు లాక్కు వచ్చింది.

"నూతన దంపతులు నమస్కారం చేస్తారు. ఆశీర్వదించండి"

"ఏమని ! ఏమని ఆశీర్వదించ మంటావ్ ?"

" ఆ మాత్రం తెలియదా ? దీర్ఘ సుమంగళీభవ ! అని "


"ధీర్ఘసుమంగళీభవ"

"పుత్ర పౌత్రాభి వృద్ధి రస్తు"

"ఇక పదండి అన్నం పెడతాను."

ఆ దంపతులిద్దరూ వారి భాగంలో కెళ్లి పోయారు.

"అమ్మో ! జానకమ్మగారు ఎంత ఉత్తమురాలూ ! . . . . ఏమోననుకున్నా . . . . ఈ పని ఎల్లాగా అనుకున్నా ఇన్నాళ్లూ !"



అన్న వారందరికీ – 'అది పచ్చి అబద్ధమ'ని పనిగట్టుకు చెప్పండి. తోటి వాళ్లం. ఇరుగు పొరుగున వున్న వాళ్లం. ఒకరి నొకరు ఆదు కోవల్సిన వాళ్లం మనం ; మనం . అపవాదుల్ని అణి చెయ్యవలిసిన వాళ్లమూ మనమే."

జానకి చెప్పినట్లే అందరూ మనస్ఫూర్తిగానే కమలను ఆశీర్వదించారు.

"చిలకలాగున్నావు. నీ కడుపు చల్లగా వెయ్యేళ్ళు కాపురం చెయ్యితల్లీ '!' అంటూ, ఒక పెద్దామె – గబగబా పసు నీళ్ల దిష్టి తీసి – అవతల పారబోసింది.

మరొకామె – "నీకేం కావల్సినా నన్నడుగమ్మా ! అందరం నీ తోడ బుట్టిన వాళ్లం కాకాపోతే నీ పినతల్లి లాంటి వాళ్లం అనుకో !" అన్నది.

ఆ మాటా – ఈ మాటా అయిన తర్వాత వచ్చిన వాళ్లందరూ వెళ్లి పోయారు – కాఫీ వేళకి. . . .

అందాకా ఒంటరిగా సురేష్‌కు పిల్లలతో కాలక్షేపం అయిపోయింది. నీలా, రంగా సురేష్ పక్క మీద చెరో ప్రక్క చేరారు. ఏవేవో కబుర్లు –

"స్కూటర్ నేర్చుకోటానికెన్నేళ్లు పడ్తుందండీ ?"

"బాంకులో ఉద్యోగం దొరికేదాకా పడ్తుంది " – సమాధానం నీల చెప్పింది.

"పెద్ద వాడివయితే మూడు రోజులు చాలు"

"అంతేనా?"

"మరి పెద్దవాడిని కావటానికో ? "

"మరో ఇరవై ఏళ్ళు ."

"మరో ఇరవైయ్యేళ్లు తర్వాత మాత్రం – స్కూటర్ కొంటాడేమిటి ఈయన గారూ ! మహో మహో మానాన్నే కొనలేదు " అంటూ నీల ఎత్తి పొడిచింది.

ఆ సాయంత్రం మళ్లీ భార్యా భర్తలు స్కూటర్ మీద షికారు వెళ్లారు.



పిల్లలిద్దరూ మూడు చక్రాల సైకిల్ మీద మూడు వీధులూ తిరిగి వచ్చారు.

హరిహరం ఇంటికి వచ్చాడు గానీ – వెంటబడి క్లయింటులెవ్వరూ రాలేదు. రోజూ ఆ మాత్రం తీరిక వుండదాయనకు. కాఫీ వగైరా కానిచ్చి తోటలో పడక కుర్చీ వేసుకుని కూర్చున్నాడు – ఏవో 'లా' రిపోర్టులు చూస్తూ

మొత్తానికి చీకటి పడింది.

పిల్లలు తమ సైకిల్ మీద వీధులు తిరిగి వచ్చారు – మరిద్దరు పిల్లలతో కూడా . అందరూ చెట్టు క్రింద చేరి దాగుడు మూతలు ఆడుతున్నారు – ఆట చాలా వరకు హరిహరానికి దూరంగానే సాగింది. ఆయన కేమీ 'శ్రద్ధా భంగం' జరగలేదు. కాలి అంతలో పిల్లలందరు పెద్ద పెద్ద కేకలు పెట్టారు. ఒకచోట ! 'ఏమిటా ?' అన్నట్లుగా జానకి అటు వైపుకు వరండాలోకి నడిచింది. హరిహరం తల ఎత్తి చూశాడు.

"పాము ! పాము! పాము!"

పిల్లా డెవడో దాన్ని రాయి పుచ్చుకు కొట్టాడు లాగుంది. ఆ పాము బుస్సుమంటూ రోషంతో వెంట బడింది. భయ భ్రాంతులై పిల్లలందరూ పడక కుర్చీ వెనక కొచ్చి దాక్కున్నారు.

పాము కూడా పెద్ద పామే!

హరిహరం పడక కుర్చీ దాకా తరుముకు వచ్చింది. బెదిరి బెదిరి చూస్తూ ఎదురుగానే పడగ ఎత్తింది. నోట మాట పెగలక – ఏం చెయ్యనూ తోచక అల్లాగే కుర్చీలో బిగుసుకు పోయడు హరిహరం . వరండాలో కాలాగక – వరండా నుంచి కాలు దిగక వరండాలోనే తెగ చెమటలు కక్కింది జానకి.

పిల్లలు వణికి పోతున్నారు.

హరిహరం ఏదో గొణుగు తున్నాడు. ప్రాణాల మీద ఆశ చాలా వరకు ఆడుగట్టింది. అప్పుడే స్కూటర్ లోపలికి దార్లి వచ్చింది. కళ్లెత్తి చూస్తే – పరిస్థితి అంతా అర్థమయింది – వెంటనే – సురేష్"లోపలి కెళ్లి ఒక దుప్పటి పట్రా " గుస గుస లాడేడు సురేష్ కమలతో . . .

కమల గబగబా వెళ్లి దుప్పటితో వెను దిరిగి వచ్చింది.


ఆ దుప్పటి చేత్తో పట్టుకుని, వెనగ్గా వెళ్లాడు సురేష్.

నేర్పుగా పాము పడగ మీదకు విసిరి వేశాడు. పాము గిల గిలా కొట్టు కుంటుంటే – నాలుగు చెరుగులూ అంది పుచ్చుకుని – విసిరి – నేలకు కొట్టాడు సురేష్.

దుప్పటి అంతా నెత్తురుతో తడిసి ముద్దయింది.

అప్పటికేవీధిలో వాళ్లంతా పరుగెత్తు కొచ్చారు.

హరిహరం ప్రాణాలు కుదుట పడ్డాయి. పిల్లల కేరింతాలు – పెద్దల ప్రశంసలు. జానకి కృతజ్ఞతా పూర్వకంగా అభినందనలు – అరగంట వరకూ ఆగ లేదు.




హరిహరం ఏకంగా సురేష్‌ను కౌగలించుకుని చాలాసేపు వదిలి పెట్టలేదు.

"ఎన్నడూ లేదు ! ఎక్కణ్ణించి వచ్చిందో ఈ పాము" వాళ్ల దొడ్లో మూల పుట్ట వుందిగానీ – ఎవ్వరం పాములున్నాయనుకోలేదు.

ఇవాళ ప్లీడరు గారు పాము గండం తప్పించుకున్నారు."

"ఆ ; సమయానికి సురేష్ గారు రాబట్టి !"

"ఆ . ఆ ! ఎంత ధైర్యం ! ఎంత ఒడుపు!"

చుట్టూ వున్న వారందరూ ఎవరి వాక్చాతుర్యాన్ని వారు ప్రదర్శిస్తూ పొగిడారు

అందరిలో మాట్లాడని దొక్క జానకే.

జానకి తన సంతోషాన్నంతా తన కళ్లతోనే విప్పి జెప్పింది.

ఆ రాత్రి పడక గదిలో –

"ఆయన సమయానికి వచ్చారు గానీ – లేకపోతే – !" అనుకుంది.

"లేకపోతే – !" రెట్టించాడు హరిహరం.

"లేకపోతే అల్లాగే చూసి చూసి విసిగి – తన దోవన తను పాకి వెళ్లి పోయేది! అంతేగా!"

"కాకపోతే – ?"

"కాకపోతే నన్ను కాటేసేది ! చచ్చేవాణ్ణి ! అంతేగా !"

"ఊరుకోండి , పాడు మాటలు . . . . ."

హరిహరం నవ్వాడు. తర్వాత జానకిని దగ్గరకు లాక్కున్నాడు. గట్టిగా కౌగిలించుకున్నాడు. అయిదు నిమిషాల వరకూ వదల లేదు.

మల్లె పువ్వులాగ చల్లగా వుండే జానకి వళ్ళు, హరిహరం కౌగిట్లో వేడిగా కాగి పోయింది.






**ANNOUNCEMENT FOR ADMISSION**

**JOURNALISM**

**One Month**

Intensive Full time Course

**Contact :**

**DIRECTOR**

**INSTITUTE OF JOURNALISM**

**P.B. No. 509,**

**Brundavan Gardens, GUNTUR-6.**

అవతల గదిలో – అదే సమయంలో . . . . "రా " అన్నాడు సురేష్ మెత్తగా, కమల కన్ను లెత్తగానే.

"రాను" గుమ్మం దగ్గర్నుంచి కదల లేదు కమల.

"మా అమ్మవు కదూ!"

"అబ్బ! రా"

"అమ్మో ! రాను"

"వస్తే అరిగి పోవులే ! రా"

"ఉహు ! నలిగి పోతాను."

"రమ్మంటుంటే!"

" రానంటుంటే!"

"సరే నేను పడుకుంటాను. నీ యిష్టం"

"నిద్ర కూడా పొండి – త్వరగా !"

"అప్పుడొస్తావా?"

"ఉహూ ! ఇక్కడే చాపేసుకుంటాను!"

"ఏం ! నా మీద కోపమా?"

"కాదు"

"అయితే . . . తాపమా?"

"ఆ, అదే!"

"ఎప్పుడూ ?"

"ఇప్పుడే !"

"ఇహ విరహ తాపమేనా?"

"అంతే !"

"పోనీ విరహ గీతాలు పాడుకుందాం . ఏం?"

"అల్లాగే!"

సన్నగా – సంగీతం సాగింది.

కన్నులే సరసాలు సాగించాయి.

మనసులే మురిపాలతో నిండి పోయాయి.

పాటలోని భావాలకు మాటలకు, అవతల గదిలో మురిపాల మూటల్లో ముళ్ళు విప్పుకున్నాయి. మనసుల్లో ఉయ్యాల లూగి ఊగీ, కను రెప్పలు బరువు లెక్కవాలి పోయాయి.

జానకికే ఇంకా నిద్ర రాలేదు . . . అప్పుడే కమలా సురేష్‌ల యుగళం గీతంముక్తాయింపుతో ముగిసింది. హఠాత్తుగా రెండు గదుల్లోను నిశ్శబ్దం అవులించింది.



"ఇదేం చోద్యమో !" అనుకుంటూ జానకి తలుపు దగ్గర కెళ్లి ఒంటి కంటితో గురి చూసింది.

"ఇదేం చోద్యమో " అనుకుంటూ అదే సమయంలో కన్ను అదే రంధ్రానికానించాడు – సురేష్ – అవతల గదిలో . . . కన్ను కన్నుకూ గుచ్చుకుంది.

వెన్ను వెన్నూ జలదరించింది.

బంగారు పడి కాళ్ల కదం తొక్కాయి.

రెండు గదుల్లో లైట్లు ఆ వేళ ఒక్కసారే ఆరిపోయాయి.

13

మరునాడు పిల్లలిద్దరూ ఆడు కోటానికి పరుగెత్తుకు వచ్చేసరికి, కమల ముందు గదిలోనే కూర్చుని వుంది - వంటింటి గుమ్మం దగ్గరగా . వంటగదిలో సురేష్ తంటాలు పడ్తున్నాడు.

"బియ్యం రెండు గిద్దలు పొయ్యండి . చాలు."

"ఆ " గిన్నెలో బియ్యం కొలిచి పోశాడు – సురేష్

"ఆ . . . . . తర్వాత?"

"ఆ తర్వాత ఆ చిన్న గిన్నెలో పోసి . . . . ."

"పోసి?"

"నిండా మునిగేట్లు నీళ్లపొయ్యండి."

"చాలా."

"ఆ. చాలు. తర్వాత 'స్టౌ' మీద పెట్టండి."

"పెట్టా."

"ఆ వత్తులు కాస్త తగ్గించండి."

". . . . . . . . . . . . . ."

"ఇక ఎదురుగుండా నెత్తిన చేతులు పెట్టు కుకూర్చోండి "

"కూర్చున్నా!"

కమల నవ్వింది. నవ్వి "అల్లా కూర్చుంటే ఎల్లా ! ఆ కూరలూ, కత్తిపీటా ఇల్లా పడెయ్యండి. తరిగి యిస్తాను. "

"ఇయ్యి."

పిల్లలిద్దరూ తెల్లబోయారు గాని, తొందరగానే అర్థం చేసుకుని తెప్పరిల్లారు. తమ ఆటలకు తాము పరుగెత్తారు.

సరాసరి వెళ్లి నీల – అరుగు కానుకుని మూల కూర్చుంది. రంగా దగ్గరకు రాంగానే "అనుంటా" – "అనుంటా" అంది.

"ఎప్పుడూ"

"ఇప్పుడే తగలడ్డా!"

"సరే, ఏం చేస్తాం! వంట నేనే తగలెడతాలే!"

" ఆ పెద్ద లక్క పిడతలో సెనగపప్పు వుంది చూడు '. ఆ చిన్న బుట్టలో కుంపటి అవ్వీ వున్నాయి."

"అల్లాగే . . . . . ."

జానకి చూస్తూ ఊరుకోలేదు. తను చేసిన కూరలు, రెండు ఊరగాయలూ తెచ్చి యిచ్చింది.

"ఎందుకండీ మీకు శ్రమా?"

"నెలకోసారేగా!"

తెచ్చినవో మూల పెట్టి, నవ్వుకుంటూ వెళ్ళి పోయింది. హరిహరమే తన ఆఫీసు గదిలో మాట్లాడుతూ ఆశ్చర్యం మీద ఆశ్చర్యంలో మునిగి పోతున్నాడు. దామోదరం అన్ని రహస్యాలు చెప్తున్నాడు - ప్రక్కనే మీసాల ఆసామి కూర్చున్నాడు - పెదవి కదపకుండా.

"అదండి సంగతీ ! నన్ను ఇంక కేసు పెట్టమనే, నన్నూ ఈయన్నీ పంపించారు.- కమల తండ్రి గారు. అసలు సురేషుకూ కమలకూ చదువుకునే రోజుల్నుంచి రహస్యంగా వ్యవహారం జరుగుతున్నదే అను కోండి . కాని ఇంతదాకా వస్తుంది వ్యవహారాం అనుకోలేదు."

"కమల తండ్రి గారి పేరు ఏమన్నారూ ?"

"రామనాథం గారు."

"ఏం చేస్తున్నారూ?"

"డిప్యూటీ తాసిల్దారు."

"కమల ఏం చదివింది?"

"B.A."

"అంటే పద్దెనిమిదేళ్లు నిండాయి."

"కానీ అయన తాసిల్దారేగా ! 'బర్త్ సర్టిఫికెట్' - పదిహేడున్నరే అని తీసుకున్నాం."

"ఆహా!"

"మీకే కాగితం కావాలన్నా తీసుకువస్తాం. కమలను లేవ దీసుకొచ్చినట్లు మనం కేసు పెట్టాలి. గెలిచి తీరాలి - అంతే గదయ్యా.

"అంతే"! అన్నాడా మీసాల చీంబోతు.

"ఉద్యోగ రీత్యా రామనాథంగారు రావటానికి వీలు లేక పోయింది. అందుకని నాకీయన్ని తోడిచ్చి - ఇద్దరికీ డబ్బిచ్చి పంపించారు ఆయన ? అంతే కదండీ!"

"మరే మరే" - తల గంగిరెద్దులాగ ఊపేశాడు చీంబోతు.



"కేసు మీ చేతిలో పెట్టాం ఫీజు మీ యిష్టం వచ్చినంత తీసుకోండి. సరే, తక్కిన శ్రమంతా నేనే పడతాను గనక నా కమీషన్ నా మొహాన పడెయ్యండి. అదీ సంగతి !ఇవళే మీరు కాగితాలు రాసేస్తే టైప్ చేయించి కోర్టులో దాఖలు చేసేద్దాం. . . "

"కానీ . . . . కానీ . . . . " నీళ్ల నములుతూనే వున్నాడు హరిహరం, చాలాసేపు.

"చెప్పండి. ఇంత కంటే పెద్ద పాయింట్ ఏం కావాలో చెప్పండి."

"కావాలి. ఇంత కంటే పెద్ద పాయింటే కావాలి!"

"ఇది చాలా? " అంటూ దామోదరం ఒక ఫోటో తీసి యిచ్చాడు. దాంట్లో సురేష్ ప్రక్కన ఇంకో అమ్మాయి వుంది. అదోక పెళ్లి ఫొటో ! మెళ్లో దండలు. చేతిలో చెయ్యి . . . . . .

"ఇదేమిటి ! సురేష్‌కు మరొక పెళ్ళి కూడా అయిందా!"

"అయింది - శాస్త్రోక్తంగా . ఆ పురోహితుడి సాక్ష్యం కూడా చెప్పిందాం - కావాలంటే. ఆ ఫోటో చూశారుగా ! దాని బాపతు 'నెగిటివ్' కూడా సంపాయించాం. ఇదిగో ఆ నెగటివ్ !"

"ఈ విషయం బయట పడితే అతని ఉద్యోగానికి కూడా ముప్పే మరి - !"

హరిహరం ఆలోచించాడు. కేసు బలంగానే వుంది. అంతకంటే బలంగా సురేష్ మీద ఈర్ష్య పెరిగి పోయింది. సురేష్ అంద చందాల మీదా - యవ్వనం మీదా ఈర్ష్య! వాళ్ల దాంపత్యం మీద ఈర్ష్య ! వాళ్లిద్దరి కంటే జానకి మక్కువ మీద ఈర్ష్య! ఏదో - ఇదీ అని చెప్పరాని ఈర్ష్య!

గుమాస్తాను పిలిచి పిటీషన్ చెప్పనారంభించాడు అరగంటలో కాగితాలు తయారయ్యాయి. అవి టైప్ చేయించుకు రమ్మనీ - వకాల్తా మీద తండ్రి చేత సంతకం చేయించుకు రమ్మనీ ఆ కాగితాలు దామోదరానికిచ్చాడు హరిహరం.. వెంటనే ఆ పెళ్లి ఫొటోలో వున్న ఆ పెళ్లి కూతుర్ని తీసుకురమ్మని మాత్రం, పదే పదే చెప్పాడు - హరిహరం - తన దగ్గరే పెళ్లి ఫొటో పెట్టు కున్నాడు. దామోదరం మీసాల పోతుతో వెళ్లి పోయిన తర్వాత ఆ పెళ్లి ఫోటో వంకే చూస్తూ కూర్చుండి పోయాడు. ఫొటో అంతా - పెళ్లి ఫొటో లాగే వుంది.

హరిహరం ఆలోచిస్తూనే వున్నాడు. సురేష్ భోజనం అయిపోయింది. కమల భోజనం చేస్తుంటే సురేష్ ఆఫీసుకు బయల్దేరి వెళ్లి పోయాడు - రివ్వున హరిహరం ఆలోచనలు రివ్వునే పరుగెత్తాయి.

ఈ ఫొటో వాళ్ల కిటికీలోంచి జార విడిస్తే - !

సంసారంలో కలతలు లేపటానికి ఈ ఫొటో చాలదూ ? తనకి కావాలంటే 'నెగటివ్' వుంది. కావల్సినన్ని కాపీలు ! హరిహరం వరండా అంతా నడిచి సురేష్ పోర్షన్ దగ్గర ఆగాడు. కిటికీ లోంచి చూస్తే మధ్య గదిలో కమల గోడ

చాటుగా కూర్చుని భోజనం కానిస్తున్నది. అదే సమయం . . . . .

హరిహరం ఆ ఫొటోను కిటికీలోంచి లోపలికి జారవిడిచాడు. తను వెనక్కి నడిచాడు. ఆయనటు నడిచారో లేదో ! ఇటు గేటు వైపు నుంచి పిల్లలు పరుగెత్తుకు వచ్చారు. సరాసరి కమలా వాళ్ల భాగం లోకే వెళ్లారు. హరిహరం పడేసిన పెళ్లి ఫొటో చూశారు.

"ఇదేమిటి ? సురేష్ గారి ప్రక్కన . . . . . !"

"కమల గారు కాదే !"

"ఇదెవరిదో ? సురేష్ గారు కాదేమో !"

"మరి . . . మరి . . . సరిగ్గా అల్లాగే వున్నారే !

"సరిగ్గా . . .. అల్లాగే . . . . . . . ఉన్నారు "

"ఆ ! హరిహరంగారు పడేశారుగా ! దీన్ని తీసుకువెళ్లి ఆయన గారికే యిచ్చేద్దా."

"అమ్మో ! అంత పెద్దాయనకి మనం ఇవ్వటమా ? ఆయన్ని చూస్తేనే నాకు భయం . . . . . . !!"

"నాకూను . . . . . . సరే ! జానకి గారికిస్తే . . . . !"

"అదే . . . . . పద ఖా"

"ఏమిట్రా ఆ గుసగుసలు ?" అన్నది లోపల గదిలోంచి కమల.

"ఏం లేదు " అంటూ పరుగెత్తారూ పిల్లలిద్దరూ పెరట్లోకి

జానకి అప్పుడే భోజనం ముగించింది.

"ఏం కావాలీ ! – పరుగెత్తు కొచ్చారూ ?" . . . . . . పిల్లల్ని అడిగింది.

"ఏం అక్కర్లేదు."

"సెనగ పప్పా ? మరమరాలా?"

"ఉహూ!"

"ఆ చేతిలో ఏమిటి !" జానకి నీల చేతిలో ఫొటో గమనించి అడిగింది!

"ఏమో! ఏదో ఫొటో ! "

"హరిహరంగారు . . . . ఆయనే ! . . . . . ఆయనే ఇది వరండాలో పడేశారు."

"ఏదీ ? ఫొటో – " తీసుకుని చూసింది – జానకి – తడి చేత్తోనే.

చూడగానే నాలుక తడారి పోయింది – జానకికి.

"ఇదేం ఫొటో ! ! సురేష్‌కు యిది వరకే పెళ్లి అయిందా ? అయితే కమలది అక్రమ సంబంధమా ? అయితే మాత్రం హరిహరానికి దీనికి ఏమిటి సంబంధం? . . . . . ఉదయాన తలలు పట్టుకున్న కేసు ఇదేనా?"

జానకి గబగబా ఆఫీసు గదిలోకెళ్లింది . అప్పుడే హరిహరం కోర్టుకెళ్లటానికి 'రెడీ' అవుతున్నాడు.

"ఈ ఫొటో ఏమిటండీ "



"ఆ , అదా ? అదీ . . . . సురేష్‌ది . సురేష్ పెళ్లి ఫొటో ! అతనికింకో పెళ్ళి అయినట్లుంది."

"నిజంగా!"

"ఆ నిజంగానే – ఈ ఫొటోలో వున్న 'పిల్ల తండ్రి' – కేసు పెట్టమని నాకు 'వకల్తా ' పంపాడు.ఙ ఇవ్వాళే కేసు పడేస్తున్నాను."

"ఆ దామోదరం ఇందుకేనా వచ్చిందీ?"

"ఆ ఇందుకే ! ఈ పెళ్ళి బయట పడితే – పాపం , వీళ్ల సంసారానికే కాదు – అతని ఉద్యోగానికే మోసం . వస్తా కోర్టుకి టైం అయింది."

హరిహరం కోర్టు కెళ్లి పోయాడు – ఆట్టే మాటలు పెంచ కుండా !

చేతిలో ఫొటోతో జానకి మిగిలి పోయింది. ఏం చెయ్యాలి ఇప్పుడు? ఈ ఫొటో బయట పెడితే కమల మనస్సు వికల మవుతుంది. ఆలోచనలోనే ఫొటో జాకెట్టు లో పెట్టుకుంది. అప్రయత్నంగానే వాకిలి తలుపు వేసి కమల దగ్గరికి నడిచింది. వరండాలో పిల్లలిద్దరూ ఆవిణ్ణే చూస్తూ కూరున్నారు. కాసేపు పలకరింపులయ్యాయి.

ఇతర కబుర్లూ అయ్యాయి. తర్వాత అడిగింది జానకి . . . . "సురేష్ గారి కిదివరకే మున్నా పెళ్లి అయిందా.? "

"పెళ్లా !" కళవళ పడింది కమల!

"ఈ ఫొటో ఏమిటో చూడు . . . . . ." జానకి తన దగ్గరున్న ఫొటో అందించింది.

అది చూడగానే పగలబడి నవ్వింది కమల . . . . "ఇదా"

అంటూ విరగబడి నవ్వేదంది. "ఇదీ " అంటూ ఆగి తిరుగు ఎక్కిళ్లొచ్చేట్లు నవ్వింది కమల.

ఆ నవ్వుకే జానకి గుండెలు తేలిక పడ్డాయి. "ఏమిటో చెప్పి నవ్వు"

"ఇది నాటకంలో ఫొటో అండీ . . . . ఆయన చదువుకునే టప్పుడు, మా అన్నయ్యతో కలిసి నాటకం వేసారు – అందులో వున్నాది . . . . మా . . . మా. . . అన్నయ్యే ! సరిగ్గా చూడండి. మీకే తెలుస్తుంది."

జానకి వెంటనే నిశితంగా ఫొటో వంక తేరిపార చూసింది. నిజమే. కమల పోలికలున్నాయే గాని మగవాడి వేషమని బాగానే తెలుస్తోంది. ఆవిడ కడుపార నవ్వుకోక తప్పలేదు. ఇద్దరూ నవ్వుతుంటే . . . . . అర్థం కాక, కొంతసేపున్న తర్వాత – చిన్న పిల్లల మొగాల్లోనూ చిరు నవ్వులు మొలకెత్తక తప్పలేదు.

## 14

దామోదరం హరిహరంగారి దగ్గర కాగితాలు తీసుకుని సరాసరి టైపు కొట్టించటానికి వెళ్ల లేదు. అర్జంటుగా సురేష్ వుండే బాంకుకు వెళ్లాడు. అక్కడ సురేష్ తీరిక చేసుకుని ఇవతలకు వచ్చే దాకా నిరీక్షించాడు. తర్వాత

ఎదుట కూర్చుని గొల్లున ఏడవసాగాడు. "కొంప మీదికే వచ్చింది నాయనా ? కమలను లేవ దీసుకు వచ్చావని, కమలా వాళ్ల నాన్న కేసు పెట్టిస్తున్నాడు. ప్లీడరు గారితో మాట్లాడమని ఆదిగో - ఆయన్ని పంపించాడు - డబ్బిచ్చి. ఆయన హరిహరంగారినే కలుసుకుని 'దావా' రాయించాడు. ఇవిగో కాగితాలూ, అఫిడవిట్లూ" అంటూ హరిహరం గారిచ్చిన కాగితాలన్నీ సురేష్ ముందు పడేశాడు.

సురేష్ అంతా టూకీగా చూశాడు.

"హరిహరం గారే ఈ కేసు పట్టుకున్నారా" అని ఆశ్చర్య పోయాడు.

"ఆయన కమల తండ్రికి స్వయానా వేలు విడిచిన అన్నగారు. నేనెరుగున్న మొహం కనుక పల్కరించా ! అంతే ; ఆయన మండి పడుతూ , ఈ కేసు సంగతి చెప్పాడు. కాళ్లా వేళ్లా పడి శాంత పర్చి, నీ దగ్గరికి లాక్కొచ్చా ! ఇక నీ యిష్టం. ఆయిన వాడివి కనక అడ్డదలం పడ్డా. తర్వాత నువ్వు కోర్టుకే ఎక్కుతావో? గెలుస్తావో ? ఓడతావో ? ఓడితే ఈ ఉద్యోగానికే ఎసరేమో ? అంతా ఆలోచించుకో!"

సురేష్ నిర్లిప్తంగా అయోమయంగా ఆగి పోయాడు.

"కమల నీతో లేచి వచ్చిందన్న మాట విన్నప్పుడే అనుకున్నా . . . . ఇదేదో కొంప మునిగే వ్యవహారమని . కమల తండ్రి వర్తి కోర్టు పక్షి అని నాకు బాగా తెలుసు. ఇన్నాళ్లూ వేరే పనుండి ఊరుకున్నాట్ట ! పైగా కమలకి పద్దెనిమిదేళ్లన్నా లేవని 'సర్టిఫికెట్' పుట్టించాడు. ప్లీడరుగారి దగ్గరుందది . . . . .ఎల్లా చేస్తావో ఏమో! అంతా నీ యిష్టమింక ! . . . మరి ఇదంతా మీ నాన్నకు తెలిస్తే ఏమవుతుందో ! ఏమంటాడో! ఏమో! ఆయనసలే అగ్గిరాముడు ! ఆయన కావేశం వస్తుందిరా బాబూ ! ఎల్లా బయట పడి వస్తావో - ఏమో!"

"ఏం చేద్దామో చెప్పు బాబాయ్, నాకు ఏమీ తోచటం లేదూ !" అన్నాడు సురేష్ - చివరికి.

"ఏదైనా ముందు ఈ కేసు ఫైల్ కాకుండా చూడాలి. కేసు పడగానే ఊరంతా అల్లరి. నలుగురి నోళ్లల్లో పడక తప్పదు . . . . కనక ఒక పని చేస్తే . . . . . . ."

"ఏమిటది?"

"ఉండు . చెప్తా" నంటూ దామోదరం గబగబా దొర్లి వెళ్లాడు. దూరాన నుంచున్న ఆయన్ని మరింత దూరంగా తీసుకెళ్లాడు. తీరుబడిగా యిద్దరూ చుట్టలంటించుకున్నారు. పదిహేను నిమిషాలు అయిన తర్వాత దామోదరం గబగబా - మళ్లా దొర్లుకుంటూ తిరిగి వచ్చాడు. అంత వరకూ సురేష్ ఆదుర్దాగా తన సీట్లో కూర్చున్నాడు. దామోదరాన్ని దూరాన చూడగానే తిరిగి , లేచి వచ్చాడు.

"ఏం చేస్తున్నావ్?"



"ఆ తల ప్రాణం తోకకి వచ్చింది. కేసు ప్రస్తుతానికి పడకుండా వుండేందుకు ఆయన - వర్తి ఆశపోతులే ! - మూడు వేలు అడుగుతున్నాడు."

"మూడు వేలా?"

"ఆ ! అంతకు తగ్గేట్లు లేదు. ఇవ్వాల్సిందే! తప్పదు. నీ దగ్గర లేకపోతే ఎవ్వరి దగ్గరున్నా తీసుకు ఇవ్వాలి మరి ! తప్పో ఒప్పో ఇరుక్కున్నాం ! ఏం చేస్తాం.?'

సురేష్ ఆలోచనలో పడ్డాడు. కమల తండ్రి పరమేశ్వర రావుగారి సంగతి ఆలోచించాడు. వారి కుటుంబ పరిస్థితులు ఆ లోచించాడు. దామోదరం సంగతి ఆలోచించాడు. కమల తండ్రి ఈ కబురెట్టాడని నమ్మలేక పోయాడు చిట్ట చివరికి . . . . . ."ఒక పాతిక రూపాయలిస్తా బాబాయ్ . ఇక నువ్వెళ్లు" అంటూ పాతికా యిచ్చాడు.

"కాని ఆయన ఒప్పుకోడు . కేసు పడేస్తాడు"

"పడెయ్యనియ్యి . నువ్వు వద్దనకు!"

సురేష్ గబగబా వెళ్లి తన సీటులో కూర్చున్నాడు. కాసేపట్లా ఆగి - నిలబడి - దామోదరం నెమ్మదిగా బయటకి కాళ్లీడ్చుకుంటూ నడిచాడు.

ఆ సాయంకాలం హరిహరం గారు దామోదరం కోసం పొద్దు పోయే దాకా ఎదురు చూస్తూనే వున్నాడు. కాని దామోదరమే అయిపు లేడు. 'తన పడేసిన ఫాటో కారణంగా కమలలో మార్పేమన్నా వచ్చిందా?' అని పరిశీలనగా చూశాడు. కమలా సురేషులూ ఆ పగలూ రాత్రీ కూడా మరింత విచ్చల విడి వున్నట్లు కనిపించింది. "దామోదరం ఎందుకు రాలేదు?

కమలా సురేష్‌లు ఎందుకు మొహాలన్నా ముడుచుకుని లేరూ?"

అంతా ఆశ్చర్యంగానే వుండి పోయింది - హరిహరం గారికి.

## 15

వారం రోజులు ఒడుదుడుకు లేమీ లేకుండానే గడిచింది. దంపతులిద్దరికీ కుతూహలంగానే నడిచింది. ఆ తర్వాత - ఒక రోజు మధ్యాహ్నం - సురేష్ బాంకుకు వెళ్లి పోయిన చాలాసేపటికి , అకస్మాత్తుగా - హరిహరంగారి గేటు ముందు సురేష్ తండ్రి రాఘవేంద్రరావుగారు రిక్షా దిగారు. ఆయన వెనకనే 'హనుమంతు' దిగాడు గానీ - ఆయన వెనకగా గేటు తెరుచుకుని ఇంట్లోకి రాలేదు. కమల చూస్తూనే వుంది. హనుమంతు మొహం తప్పించి అటొటో వెళ్లిపోయాడు. రాఘవేంద్రరావు గారు మాత్రం సరాసరి కమలా వాళ్ల గుమ్మంలోకే వచ్చాడు. ఆయన దగ్గర కొస్తున్న కొద్దీ కమల గుండెలు తల్లడిల్లి పోయాయి. మనసు అయోమయం అయిపోయింది.

'ఎందుకొస్తున్నారో? వచ్చి ఏమంటారో . . . . . .?"

ఆయన సరాసరి తలుపులు తీసుకుని లోపలికే వచ్చారు. కమలను చూసి

ఆయన అడగనే అడిగారు.

"సురేష్ వుండేది ఇక్కడేనా అమ్మా?"

"అవునండి "

మనసులో వెయ్యి శూలాలు గుచ్చినట్లయింది - కమలకి . అయినా తప్పదు. ఇంకెన్ని శూలాలు పుచ్చుకు వచ్చాడో ఆయన. ఆ హనుమంతు గాడు ఎంత పుర్రెక్కించి తీసుకు వచ్చాడో ఇంత దూరం.

"వాడు ఇంటికెన్ని గంటల కొస్తాడు బాంకు నుంచి?"

"సాయంకాలం నాలుగున్నర అవుతుంది కూర్చోండి."

"ఊహూ " ఆయన కాస్సేపేమీ మాట్లాడలేదు. ఎలా ఆరంభించాలా అని ఆలోచిస్తున్నాడేమో!

కమలే అడిగింది.

"మంచి నీళ్ల యిమ్మంటారా?" అంటూ లోపలకెళ్లబోయింది కమల.

"ఆగు .. . . . . . ఒక్క మాట ! . . . . .నా కోడలిగా యిస్తావా? వీధిలో మా ఇరుగు పొరున వున్న పరమేశ్వర రావు గారి కూతురుగా యిస్తావా?"

నిలువెల్లా కన్నీరై పోయి, విల విల లాడింది కమల ఆ క్షణంలో .

"మంచి నీళ్ల యిస్తాను. ముందు తాగండి - ఎండలో వచ్చారు. కోడలిగానో - ఎరిగి వున్న పరాయి ఆడపిల్లగానో మీ యిష్టం! ఏమనుకున్నా సరే. ఏదైనా మంచి నీళ్ల యిస్తే తాగ కూడని దాన్ని కాదుగా!"

"కుల గోత్రాలు సరి పోయినంత మాత్రాన మీ యిష్టం వచ్చినట్లు ప్రవర్తించటమే ననుకున్నారా?"

"లేదు"

"లేకపోతే ఎందుకింత మొండి ధైర్యం చేశారు?"

కమలింక మాట్లాడలేదు. శక్తి అంతా - ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోటానికే సరిపోతుందేమో!

"మేమంతా బ్రతికే వున్నామమ్మా ! ఇంకా బ్రతికే వున్నాం: బ్రతికినన్నాళ్లా ఊళ్లో తిరగక తప్పదు. ఊళ్లో తల ఎత్తుకు తిరిగమంటారా, భూమిలో పాతి పెట్టుకు తిరగ మంటారా? - అది చెప్పు ముందు మీ నాన్నకి. తర్వాత నాకూ - -" కమలేదో చెప్పాలను కుంది. కాని ధైర్యం చాలటం లేదు. వున్నదేదో ఆయన వంక చూస్తుంటేనే అణగారి పోయింది.

"నాకు వాడు చెప్పలేదు సరే ! పోనీ నువ్వు మీ నాన్నగారితో అమ్మగారితో నన్నా చెప్పావా?"

"లేదు"

"అవతల నీకు యిద్దరు చెల్లెళ్లున్నారు. తమ్ముళ్లున్నారు. అందరికీ పెళ్లిళ్ల కావల్సి వున్నది. ప్రేమించుకున్నారు. గనక లేచిపోతే సరిపోయిందనుకున్నావా? లేచి వచ్చి కాపురం పెట్టుకోగలరు గానీ ,కుటుంబ





సంబంధాలు తెంపుకోగలరా? తెంపుకుని ఇల్లా ఒంటరిగా బ్రతకగలరా? మీరు తెంపుకున్నంత తేలిగ్గా - మేం కని పెంచిన వాళ్లం తెంపు కోగలమనే అనుకున్నారా?"

ఆయనకీ - కళ్ల నీళ్లు తిరిగాయి. కంఠం గద్గదికమయింది. పైమాట - గొంతులోనే అణిగి పోయింది.

దుఃఖంతో వివశుడై అయన దుఃఖాన్ని దాచుకోలేదు.

"నేను నిన్ను మందలించటానికి రాలేదమ్మా . . . . బ్రతిమాలుకోడానికే వచ్చాను. ఆస్తి పాస్తులిచ్చి సంతోష పెట్టగల వాళ్లమే గానీ, మీ ఇష్టా యిష్టాల్ని శాసించే హక్కు మాకు లేదు. మీరు సుఖపడ్తుంటే చూసి సంతోషించటమే మాకు మిగిలిన పని . . . . మీరు చేసిన పని మాకెవ్వరికీ ఇష్టం లేదు. పోనీ - మీ కన్నా సౌఖ్య ప్రధమా అంటే - దాని మీదా నమ్మకం కుదరటం లేదు. సరేః విధి వ్రాత యిదే ననుకుని తలవంచుకుందాం. కాని అనాలోచితంగా మీరు చేసిన పని - ఇది మీకెల్లా వున్నా - మమ్మల్ని మాత్రం జన్మాంతం వేధిస్తూనే వుంటుంది. తర్వాత మీ యిష్టం. మా ఖర్మం. . . . ."

"అయితే నన్నేం చేయమంటారింతకూ?"

"నాకు పుత్రభిక్ష పెట్టమని అడగటానికి వచ్చాను. అడిగాను. ఇక . . . . . ఇక వెళ్తున్నాను. . . ."

"మంచి నీళ్ళన్నా తాక్కుండా వెళ్తారా ?"

"ఇందాకే చెప్పానుగా . . . . . . వస్తాను. . . . . ."

ఆయన గేటు వైపు నడిచారు. ప్రాణాల్నే వెంట తీసుకెళ్తున్నట్లు ఉసూరుమనిపించింది - కమలకు . ఆయన వెనక్కి అన్నా తిరిగి చూడకుండా వెళ్తున్నారు - సరే ; తను కోడలు. మరి కొడుకును గూడా ఇల్లాగే వదిలి వెళ్తారా? మంచినీళ్ళన్నా తాగకుండా వెళ్లి పోతాకాః

పచ్చి గుండెలు ఇంతలో కటిక రాళ్ళయి పోతాయా?

ఆయన గారి కొడుకును నేనేం దొంగిలించానా? ఇవ్వాళ పుత్రభిక్ష పెట్టటానికి?

జానకి గారు నిద్ర పోతోంది కాబోలు. నయమేః ఇదంతా వినలేదు. ఎండని కాబోలు పిల్లలెవ్వరి సందడీ లేదు.

సాయంకాలం దాకా పలకరించే వాళ్ళెవ్వరూ లేరు. ఒంటరిగా కడుపులో దుఃఖమంతా కడిగేసుకోవచ్చు . . . . . . సాయంకాలం సురేష్ యింటికి వస్తాడు . . . . . . అతనితో - ఈ విషయం చెప్పటమా? మంచినీళ్ళు కూడా తాగకుండా తండ్రి వెళ్లి పోయాడంటే - ఏ కొడుకు బాధ పడకుండా వుంటాడు. తన తండ్రి ఇల్లా వెళ్లిపోతే - ! ఏమయ్యేది ఈ తల!

సురేష్ తో ఈ సంగతి పొరబాటునన్నా చెప్పకూడదు. తనే ఈ సమస్యని పరిష్కరించాలి . . . . . . . . . . . . . . . . . .



నిజమే . అంతిమ పరిష్కారం - తనదే . . . . ఎంత జటిల సమస్య . . . ఎంత తేలికగా తెమిలి పోయింది !!!

16

ఆ రోజు ఇంటికి రాక ముందే, నాలుగైదు పిండి వంటలతో సహా వంట చేసింది కమల. ఒక ప్రక్క వంట చేస్తూనే, మరో ప్రక్క ఇల్లంతా సర్దేసింది. గదంతా చక్కగా తీర్చిదిద్దింది. పక్కంతా దులిపి చక్కని దుప్పటి పరిచింది. మల్లెపువ్వులన్నీ ప్రక్క మీద చల్లటానికి వుంచింది. అరగంట ముందు నుంచే సురేష్ కోసం ఎదురు తెన్నులు చూస్తూ, ద్వార బంధంలోనే నిలుమండి పోయింది.

అరక్షణం ఆలస్యం చేయకుండా ఆ వేళ సురేష్ సరాసరి బ్యాంకు నుంచి వచ్చేశాడు.

చాటంత మొహం చేసుకుని "వచ్చారా!" అంటూనే తలుపేసి మీదపడి - ముద్దుల్తో ముంచేసింది. . . . . . . . . .

"పదండి. టిఫిన్ కానివ్వండి. మనం ఇవ్వాళ ఊరంతా 'స్కూటర్' మీద తిరిగి రావాలి" అంది.

"అల్లాగే. నీ చిత్తం " అన్నాడు సురేష్.

ఇద్దరూ గబగబా మొహాలు కడిగి ముస్తాబయ్యారు. నిమిషం నిర్లక్ష్యం చేయకుండా స్కూటర్ మీద బయలు దేరారు.

పట్నంలో పది వీధులూ తిరగటం అయిపోయింది. జన సంచారాన్ని లక్ష్య పెట్టకుండా - బిడియ పడకుండా సురేష్ నడుం చుట్టూ చేతులేసి పట్టుకుని - మరింతగా హత్తుకుంటూ కూర్చుంది కమల.

"పోనివ్వండి. ఇంకా స్పీడుగా పోదాం పదండి. . . . . . . . ."

"ఎక్కడికి?"

"అదిగో ; ఆ ఆకాశపు అంచుల మీదికి"

"పెట్రోలు అయిపోతే . . . !"

"నా రక్తం పోసి నడిపిద్దాం."

"ఇవ్వాళ నీకు పిచ్చెక్కినట్టుంది."

"అప్పుడే ఏం చూశారు."

ఇద్దరూ జనసంచారమే కాదు - నర సంచారం ఆగిన రోడ్డు మీద పయనం సాగించారు. మైళ్ళ కొలదీ దూరం.

"ఇక్కడ ఆగుదామా?" అన్నాడు సురేష్.

"అప్పుడేనా " అంది కమల భుజం మీద ముద్దు అద్దుతూ.

"నీకు యివ్వాళ పూనకం వచ్చింది. . . . . . ."

"మీరు దాన్ని వదల కొట్టాలి."

"ఇంటికి పద ; చెప్తా!"

నవ్వులు చెలరేగి పోయాయి. అనంద సందోహాలు ప్రతి ధ్వనించాయి.

"ఇక వెనక్కి వెళ్దాం. తొమ్మిదయింది."

"అయితే పదండి సినిమాకి."

"ఇప్పుడా?"

"ఇకనెప్పుడూ అడగనుగా?"

"సరే పద. ఏ సినిమా?"

"ఏదైనా సరే ! మంచి శృంగారమున్నదైతే!"

"ఇవ్వాళ నువ్వూ. . . . !!"

"ఇవ్వాళ నేను . . .. మిమ్మల్ని నిద్రపోనివ్వను!"

సినిమాకు వ్యవధి ఉండాగానే ఇద్దరూ ఊళ్ళోకి వచ్చేశారు. ఏదో ఇంగ్లీషు సినిమాకెళ్ళి హాల్లో కూర్చున్నారు. హాలు పల్చ పల్చ గానే వుంది- ఇద్దరికీ అను కూలంగా. ఒకళ్ళ ఒళ్ళో ఒకరు కూర్చున్నారు. . . . . . . .

"ఇల్లాగే ఈ కౌగిట్లో ప్రాణాలు పోతేనా?" అంది కమల . . . . సినిమా సగం అయిన మీదట ! సురేష్ పెదవి మీద మాట బయటికి రాకుండానే పెదవుల్తో నొక్కేశాడు – కమలకు ఊపిరాడనివ్వకుండా!

సినిమాలో ఆఖరి ముద్దు కూడా అయిపోయింది. ఇద్దరూ తిరిగి ఇంట్లో పడ్డారు. . . . . . .

భోజనం ఏదో అయిందనిపించారు.

పక్క మీద వాలిపోయిన మీద – బాహు బంధాలు బిగిసి పోయాయి. మొలకు నవ్వులు చెలరేగిపోయాయి. అనంగరంగ సంగరం సాగి పోయింది.

"ఊరుకో ! నెమ్మది ! జానకి గారు వింటారేమో!" అన్నాడు సురేష్.

"ఎవరు వింటే నాకేం లెక్క " వేలు విదిలించేసుకుంది కమల. పక్క మీద దంపతులూ – గడియారంలో ముళ్లూ దొర్లి – దొర్లీ – భళ్ళున తెల్లారింది – ఎవ్వరూ కళ్ళు ముయ్యకుండానే . . . . రోజూ వున్న టైం టేబుల్ మళ్లా ఆరంభమయింది. కాఫీలు- తర్వాత స్నానాలూ. తర్వాత వంట ప్రయత్నాలూ . . . . భోజనాలూ ఆఫీసుకు పరుగెత్తటాలూ.

తర్వాత మళ్ళా ఒంటరిగా . . . . మంచం మీద మేను వాల్చి – ఆలోచనలూ !!

"అడ్డం తప్పుకోవాలి. ఎల్లా? బ్రతకటం ఒక సమస్యల పుట్ట మనిషికి చావటం గూడా పెద్ద సమస్యేనా – తీరా అందాకా వచ్చిన తర్వాత . . . . ఏమన్నా విషం మాత్రలు దొరికితే హాయిగా తేలిగ్గా ప్రాణాలు వదలవచ్చు. వాటి కోసం మెడికల్ షాపు కెళ్ళాలి. వెళ్లి వస్తే . . . ."

కమల లేచింది. గబగబా కొత్త చీర ఒకటి పెట్టె లోంచి తీసి కట్టింది.



చావబోయే మనిషికి ఈ చీర సింగారాలెందుకో – ఎందుకో ?" అనుకుంటూ నవ్వుకుంది.

వరండాలో కొచ్చి వీధి తలుపులు తాళం వేసింది. ఎదురుగా రంగడు బిళ్లతో ఆడుకుంటూ కనిపించాడు.

"రంగడూ నాతో వస్తావా ? మెడికల్ షాపుకు వెళ్ళి వద్దాం!"

"ఓ" అన్నాడు రంగడు.

ఇద్దరూ కలిసి దగ్గరున్న మందుల షాపుకు చిరు పరుగులే తీశారు. దోవలో అంతా విని వున్న మందుల పేర్లే జ్ఞాపకం చేసుకుంది.

గార్డినాల్, కాంఫోజ్ అల్లాంటివి పదో పదిహేనో మింగేస్తే చచ్చి పోయిన వాళ్ళను గురించి చాలా విన్నది.

మెడికల్ షాపులో కెళ్ళి అడిగింది. 'గార్డినాల్' మాత్రలున్నాయా?

"ఉన్నాయ్ ! డాక్టరు గారి చీటీ తెచ్చారా?"

"లేదు. కాని అర్జంటుగా కావాలి.

"అయినా ఇవ్వం! చీటీ తెచ్చుకోవాల్సిందే. ఈ మధ్యచాలా మంది ఆ మాత్రలు తీసుకెళ్ళి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు." అన్నాడా షాపు కుర్రవాడు.

కమల నిరాశతో వెనక్కి నడిచింది.

"ఆత్మహత్య చేసుకోటానికి కూడా, ఇక నుంచి డాక్టరు గారి రికమండేషన్ కావాలన్న మాట!" అనుకుని నవ్వుకుంది – పేలవంగా!

దోవలో ఎరువుల షాపు ఒక దానిని చూసింది."ఇచ్చట డి.డి..టి – ఎండ్రిన్ – క్రిమి సంహారపు మందులు అమ్మబడును." మందుల షాపుల్లో అయితే డాక్టరు ప్రిస్క్రిప్షన్ కావాలి ! ఈ క్రిమి సంహారాలకయితే ఏ డాక్టరు గారి ప్రిస్క్రిప్షన్ అక్కర్లేదు. గబగబా ఆ కొట్లో కెళ్ళి ఎండ్రిన్ డబ్బా ఒకదాన్ని అడిగింది.

"ఎందుకండి"

"వంగ చెట్లకి."

వాడు డబ్బు తీసుకుని డబ్బాయిస్తూ "జాగ్రత్తండీ అమ్మా! పిల్లల కందుబాట్లో పెట్టకండి" అన్నాడు. అది తీసుకుని విజయ గర్వంతో యింటికి వచ్చింది కమల ! ఈ సాయంకాలానికి ఈ లోకానికి – తనకీ సంబంధం వుండదు. ఈ లోకానికి గుడ్ ... ... పాడు ప్రపంచమా?

వెంట వస్తున్న రంగడి కిదం... ... మన్పించింది.

"హరిహరంగారి తోటలో వంగ చెట్లక్... !

"కమలంత పెద్దావిడ అబద్ధం ...దుకు చెప్పింది". రంగడికన్నీ అసందర్భాలుగా తోచాయి. " ఏం చేస్తుందో కనిపెట్టి చూడాలి. మధ్యాహ్నం"

అనుకున్నాడు. నాలుగు సార్లు . . . . ఆ మధ్యాహ్నం ఇద్దరూ తోటలో చెట్టు కిందే చేరారు. చెట్టు కిందే ఆటలు సాగించారు. అక్కడుంటే – కమల తిరిగే మూడుగదుల్లో – ఎక్కడ తిరుగుతున్నా కనిపిస్తుంది.

కమల దేముడికి చాలాసేపు దణ్ణం పెట్టుకుంది. తర్వాత దొడ్లోచెట్టు కింద – చాపా దిండూ వేసుకుంది. తర్వాత మధ్యగదిలో బల్ల మీద మంచి నీళ్ళ గ్లాసు ఒకటి పెట్టింది. తర్వాత కొని తెచ్చిన ఎండ్రిన్ డబ్బా మూత తీసి పెట్టింది. మళ్ళా దేవుడి పటం దగ్గరికెళ్ళి దణ్ణం పెట్టుకుంటోంది. "అమ్మో" అనుకున్నాడు. రంగడు అది చూసి . . . . "ఇందుకా" అనుకున్నాడు పైకే చాలాసార్లు "రా; నీలా" అంటూ మధ్య కిటికీ దగ్గరికి పరుగు తీశాడు. "ఎందుకూ" అంటూ నీల వెంట పరుగెత్తింది. "అరవకు" అని సౌంజ్ఞ చేశాడు రంగడు. ఎండ్రిన్ డబ్బా గ్లాసు చూస్తుంటే – మహా భయంకరంగా కనిపిస్తున్నాయ్!

కిటికీ లోంచి చెయ్యి చాచి, వాటిని అందుకోబోయాడు. అందలేదు.

దగ్గరలో ఎక్కడా చిన్న కర్ర ఏదీ కనిపించనన్నా లేదు. మరో ఉపాయం తోచ లేదు. "ఎలా" "ఎలా" అనుకున్నాడు– పదే పదే.

"ఏమిటి"? అన్నట్లు ఆత్రుత నిండిన కళ్ళు తెగ తిప్పేస్తోంది నీల.

చెయ్యి ఎంత చాచినా గ్లాసు అందలేదు. డబ్బా ఇందలేదు. కాని టేబుల్ క్లాత్ అందింది.

గట్టిగా దాన్ని పట్టుకుని సర్రున లాగేశాడు రంగడు. దబాలున డబ్బా! దాని మీద నీళ్ళ గ్లాసూ పడ్డాయి. శబ్దానికి అదిరిపడి కమల పరుగెత్తుకు వచ్చింది.

"ఏమిటిది! ఏం జరిగింది!"

"ఇదిగో! ఈ నీలే – టేబుల్ క్లాత్ లాగేసింది బాగుందని."

"నేనా?"

"నువ్వేగా?"

"అబద్ధాలాడకు. ఆడపిల్లలు పుడతారు."

"మీ అమ్మే అబద్ధాలాడింది. అందుకే నువ్వు పుట్టావ్."

"ఆ". గభాలున గట్టిగా నీల రంగడి జుట్టు పట్టేసింది. ఇద్దరూ క్రిందా మీదా పడ్డారు. "నీలా నీలా" అంటూ కమల బయటికి పరుగెత్తింది.! నీలను విడదీసి నిలబెట్టేసరికి – కమల తల ప్రాణం తోకకొచ్చింది. "ఛా. నేను నీతో మాట్లాడను. ఆడుకోను. ఇక నీతో "కచ్చి – కచ్చి" అంటూ నీల వెళ్లి ముందు వరండాలో ఆరుగుమూల కూర్చుంది, బుంగ మూతి పెట్టి.

"రండి; ఆంటీ – నేను నీళ్లు తెచ్చి పెడతాను . . . . ఆ గదంతా కడుగుదాం? రండి!!" అంటూ కమల చెయ్యి పట్టి లోపలికి లాక్కెళ్లారు రంగా!



అన్న ప్రకారం నాలుగు బొక్కెన్ల నీళ్ళు తెచ్చి పోశాడు. కమలతో బాటు తనూ చీపురుతో గదంతా చిమ్మాడు. మందు కలిపిన నీళ్లకు! గదిలో వున్న చీమలన్నీ చచ్చాయి. తెట్టెలు తెట్టెలుగా కొట్టుకుపోతున్నాయి.!

"బలే! బలే! మంచి మందండీ మీరు తెచ్చింది. చూడండి! ఎల్లా చీమలన్నీ చచ్చిపోయాయో!" కమల ఒక్కసారి దేముడి పటం వంక చూసి, వెలితిగా నవ్వింది."

రంగడి కేకలు విని – సంతోషాన్ని గమనించి – నీల వుండబట్టలేక లోపలికి వచ్చింది.

"ఏమిటి చీమలన్నీ చచ్చాయా?"

"ఆ. చచ్చాయి. ఇదిగో చూడు!"

"ఛీ. నాతో మాట్లాడకు. నేను నీతో మాట్లాడ లేదు."

"నేను నీతో చెప్పలేదు."

"నాతోనే చెప్పావు. కాదనకు."

"కాదు."

"అవును."

"కాదు"

"అవును."

ఇద్దర్నీ దగ్గరకు తీసుకుంది కమల!

"ఆ రోజుల్లో . . . . . చిన్నతనంలో . . . . సురేష్‌తో. . . తనూ ఇల్లాగే; అన్నీ తల్చుకుని దీర్ఘంగా శ్వాస వదిలింది కమల. శివుడు తనకు ఆజ్ఞ ఇవ్వలేదు. ఆ – చీమల కాజ్ఞ ఇచ్చాడు. చీమలే చచ్చాయి– గాని తను చావ లేదు. మరో రోజు వృధాగా బ్రతకమని రాశాడు భగవంతుడు, నొసట!" అనుకున్నది కమల.

17

ఆ సాయంత్రం . . . .

సురేష్ వచ్చే వేళకి – కమల వాకిట్లోనే నుంచుంది – వరండాలో స్తంభానికి ఆనుకుని. సురేష్ మరింత అందంగా ఆనందంగా కనిపించాడు – వస్తూ!

ఎంత మధురంగా గడిచిపోయినాయో రోజులూ! ఈ నాలుగునాళ్ళ ముచ్చట రేపటితో ఆఖరుగా.

రేపు మాత్రం ఎల్లా! తెచ్చుకున్న ఎండ్రిన్ నేల పాలయింది. మరి తనెల్లా చావాలి.

నేలపాలు కాకపోయినా, నీళ్ళపాలు కావచ్చు. ఊళ్ళో పెద్ద కాలవలే వున్నాయి – దూకటానికి. దూకటానికి – వీలుగా వాటి మీద నుంచి వంతెనలూ కట్టారు. అర్ధరాత్రి పూట ఒంటి గంట తర్వాత అయితే

సరసంచారమే వుండదు . . . . అప్పుడెళ్తే, తెల్లారేసరికి – ఏ 'లాకు' దగ్గరో తేలవచ్చు.

కమల నీళ్ళల్లో మునగాలన్న ఆలోచనలో మునిగిపోయింది. మందు – స్కూటర్ దిగి – లోపలికి నడిచాడు సురేష్ బూట్లు విప్పాడు. అయినా కమల లోపలికి రాలేదు. చేతికి కాఫీ రాలేదు.

"కమలా!!"

"అయ్యయ్యో ! "ఆలోచనల్లో ఆ అరనిమిషం ఆలస్య మయినందుకు – అల్లాడి పోయింది కమల.

"వస్తున్నా ; కాఫీ తెస్తున్నా " – గబగబా లోపలికెళ్ళి కాఫీ తెచ్చి యిచ్చింది కమల . కళ్ళలో కళ్ళు గుచ్చి కాఫీ తాగేశాడు సురేష్ తర్వాత తనే పలకరించాడు.

"ఏం ? ఇవ్వాళ అల్లా వున్నావ్?"

"ఎల్లా వున్నానూ?"

"హుషారుగా లేవు."

"ఇక వుంటా!"

". . . . . . . . మీ అమ్మా నాన్నా జ్ఞానకం వచ్చారా?"

"లేదు"

"నిజంగా!"

"నిజంగానే . మీకు జ్ఞాపకం వస్తున్నారా?"

"లేదు."

"పోనీ ; ఒక్కసారి చూసి రండి – మీకు చూడాలని వుంటే. నాకోసం ఆగవద్దు."

"ఇద్దరం వెళ్దాం. ఒక నెల పోయిన తర్వాత?"

"ఎక్కడికి?"

"ఇద్దరి పుట్టిళ్ళకీ."

"వద్దు."

"ఏం. తెంచుకునే బంధాలాయివ్వి?"

"కాదేమో – కానీ – ప్రాణ బంధాల కంటే ఎక్కువా?"చటుక్కున నాలిక కరుచుకుంది – కమల – గట్టిగానే . . "అబ్బ " అనుకుంది గట్టిగానే!

"ఏం?"

"నాలిక . . . . నవ్వింది "కమల.

"ఇల్లారా మందేస్తాను" దగ్గరికి లాక్కుని నోటిలో నోరు కలిపి చప్పరించేశాడు.

"తగ్గిందా?"

"తగ్గింది" నవ్వింది కమల.



అవతరించిన అత్యల్పకాలంలోనే
అశేష విద్యాధికుల ఆదరణకు పాత్రమై
అన్నిప్రాంతాలనుండి విద్యార్థులను
అమితంగా ఆకర్షిస్తోన్న

విద్యాశ్రీ నికేతన్
రెసిడెన్షియల్ కాలేజి
(బాలురకు మాత్రమే)
కామయ్యతోపు, విజయవాడ-6, Ph 5379

- ఆరోగ్య వంతము, ఆహ్లాదకరము అయిన వాతావరణము.
- సమగ్రమైన ప్రయోగ శాలలు, పరిశుభ్రమైన హాస్టల్.
- విశేష బోధనానుభవము, ప్రజ్ఞా పాటవాలు గల ఉత్తము అధ్యాపకులచే శిక్షణ.
- ప్రారంభము నుండి మెడికల్ మరియు ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ దృష్ట్యా విద్యాబోధన.
- వారాంతపు పరీక్షలు, ప్రతినెలా విద్యార్థి పురోభివృద్ధి మదింపు.
- వ్యక్తిగతమైన శ్రద్ధ, విజ్ఞానదాయకమైన గ్రంథాలయము.
- మానసిక ఉల్లాసానికి కావలసిన క్రీడారంగము మా ప్రత్యేకతలు.

బోధనా కోర్సులు:
ఇంటర్ మొదటి సంవత్సరం
మరియు ద్వితీయ సంవత్సరం
M.P. & Bi.P.
ఇంగ్లీష్ & తెలుగు మీడియంలలో!

అప్లికేషన్ మరియు ప్రాస్పెక్టస్‌లను రూ 20/-లను కాలేజీలో చెల్లించిగాని, లేదా రూ 25/- లను M.O. ద్వారా పంపిగాని పొందవచ్చును.

మాదల కాశీవిశ్వేశ్వరరావు M.Sc.
ప్రిన్సిపాల్ & డైరెక్టర్

"ఇటువంటి మాధుర్యాన్ని వదిలి – కాలవలో కలిసి పోవటమా?"
ఉసూరుమని పోయింది కమల ప్రాణం . . . . .
"ఇవ్వాళ ఆఫీసులో . . . .! . . ." ఏదో చెప్పబోయాడు సురేష్.
"వద్దు. ఇది మన యిల్లు. మన గది. ఇక్కడ ఆఫీసు ఫైళ్ళు 'ఓపెన్' చెయ్యకండి."
"సరే. చెయ్యను. తలుపేసి రానా?"
"ఎందుకూ?"
"మన ఫైల్ ఓపెన్ చెయ్యటానికి."
నవ్వుల్లో నవ్వులు. తల్లో పువ్వులన్నీ ప్రక్క మీద రాలాయి.
"నిన్న రాత్రంతా నిద్దర లేదు. అలిసి పోయారు. ఇవ్వాళ భోజనం చేసి బాగా రెస్ట్ తీసుకోండి."
"అంటే – ఆఫ్ (off) డ్యూటియా ? Half Duty యా?
"Half Duty. పదకొండు గంటల వరకూ మనం ఈ గదిలో ఆ తర్వాత నేను మధ్య గదిలో. . . . "
"ఏం.?"
" ఆ తర్వాత నాకు వేరు 'డ్యూటీ' వుంది."
"వడియాల పిండి రుబ్బుతావా? అప్పడాలు వత్తుతావా?"
నవ్వుతూ " అప్పడాలే!" అన్నది కమల.
"అబ్బ ! అప్పడాల పిండినై పుట్టాను కాదు నేను " అనుకున్నాడు సురేష్.
వంతులు పడుతూ బలవంతాలు చేసుకుంటూ భోజనాలు కానిచ్చారు. కొంతసేపు కంతుడి సంరంభం కొనసాగింది. గాఢ పరిష్వంగంలో నిద్దర పోయాడు సురేష్. కమలకే – ఏ నిద్దరా రాలేదు. కౌగిట్లో కదులుతూనే వుంది. కదిలిన కొద్దీ – కౌగిలిస్తూనే వుంది. గెండెల మీద చెవులుంటే ఎన్నెన్ని రహస్యాలు వినబడతాయో!
"లబ్. . డబ్ . . లబ్ డబ్ ; లబ్ డబ్ . . . నువ్వు నన్ను విడచి వెళ్లి పోదామనుకుంటున్నావా ? కమలా – నా కమలా!" శ్వాసతోనే బదులు పలికింది కమల.!
"ఊ . . . . హ్ !! ఊ . . . . హు . . . ఉహూ. . . . !!"
"గడబిడలేని బ్రతుకు కుండ బోదీ గడ్డ మీద . . . . పాడు బడ్డ బ్రతుకునైనా – బాగు చేసుకోవాలి మనం. ఈ పాటి కడగండ్లకే ఓడిపోవాలా ? ఓడిపోవాలా? లబ్ డబ్ . . . . లబ్ డబ్ . . . "
"ఊహూ . . . . ఊ . . . హు . . . ఊహూ" కమల మురి వెచ్చని కంటి నీళ్ళు సురేష్ గుండెల మీదకు ప్రవహించి జారి పోయాయి!
నెమ్మది నెమ్మదిగా ఆ చేతుల సంకెళ్ళ లోంచి విడివడి వెడంగా జరిగింది



కమల ! తర్వాత " ఏమిటా ఈ అనుబంధం?" అని అచ్చెరు వందింది.
'ఇది జన్మాంతర అనుబంధమా ? తల్లినీ, తండ్రినీ తేలిగ్గా విడిచి వచ్చిందే ! మూణ్ణెల్లన్నా కాని – ఈ ప్రియుడి మీద పెరిగిన మమకారం – ఇంతలో ఇంత పెనవేసుకు పోయిందేం? దంపతుల ప్రేమ ఇంత బెల్లం, జీలకర్రా ? క్షణాల మీదనే ఇంత అల్లి బిల్లిగా అల్లుకుపోతుందా?'
పక్క మీద నుంచి లేచి గోడ ప్రక్కకు చేరింది – కమల. దీప కాంతిలో సురేష్ మరింత సుందరంగా కనిపించాడు. ఒక్కసారి – ఆఖరుసారి – చెంత చేరి సెలవు పుచ్చుకుంటే. . . . . మళ్ళా వద్దను కుంది కమల – గెండెలవిసి పోతున్నాయి గాని –తలుపు గడియ కదల లేదు – ఎంత తీయాలని ప్రయత్నించినా . . . . . .
'తెల్లారితే – తను కనుపించక పోతే, ఈయన ఏమై పోతాడో ! ఏమో!'
గడియారం రెండు ముళ్ళూ 'రెండు' మీద ఏకమైనాయి. ఇక అవ్వి విడిపోక తప్పదు – మళ్ళీ . . . . . జీవితమూ అంతే . కలిసి వుండే కాలమే తక్కువ. వేచి వుండే కాలమే ఎక్కువ . . . . గడియ పైకి లేచింది. . . . . .
వరండాలో తడబడే అడుగులే నడిచి వెళ్లాయి. మెట్లు దిగాయి. చీకట్లను మీద కప్పుకుంటూ, సందడిస్తున్న గుండెల్ని అణచి పెట్టుకుంటూ – నడిచి . . . . . . . .
నడిచి వెళ్లింది కమల – కాలవ వంతెన వైపు. . . . .
బ్రిడ్జి మీద నిల్చింది కమల! కాలవ నీళ్ళు వడివడిగా ప్రవహిస్తున్నాయి ! ఒక్క అడుగు – ధైర్యంగా వేస్తే చాలు. శాశ్వతంగా కాల ప్రవాహంలో కలిసిపోవచ్చు . . . . అంతలో ! ఎక్కణ్ణించో కమలా అని ఒక్క ఆక్రోశం !
అరిచిందెవరు ! తన గుండెలా ! సురేషా ? సురేష్ ! స్కూటర్ మీద !
తటాలున దూకేసింది కమల!
స్కూటర్ మీద నుంచే ఉరికేశాడు సురేష్ ! కాలవలోకి . . .

## 18

తెల్లవారింది. కమల కళ్లు తెరిచింది ! ఎదురుగా కూర్చున్న సురేష్ దిగులుతో పాగిలిపోతూ కూర్చుని కనిపించాడు . . . . కమలకు తెలివి వచ్చేసరికి – కాస్త కళ్ళల్లో వెలుగు రేఖలు కనిపించాయి.
"నా కోసం మీరూ . . . . మీరూ కాలవలో దూకారా?" అంటూ , మీదకు వంగిని అతని బుజాల మీద చేతులు రెండూ వేసి అడిగింది.
"ఊ" అన్నట్లు జాలిగా చూస్తూ వుండిపోయాడు సురేష్.
"అమ్మో ! ఏమన్నా అయితే ! ఇంకేమన్నా వుందా " గాభరా పడింది కమల.
"నువ్వెందుకు చేశావీ పని?" రుద్ధ కంఠంతో అడిగాడు. కమల ఏమీ జవాబు చెప్పలేదు. తటాలున అతని చేతులు తీసుకుని మొహానికి కప్పుకుని ఏడ్చింది.
"మీ రింత పని చేస్తారను కోలేదు . . . . లేదు."

కమల అక్కడే నుంచుని తలుపు గడియ వేసుకుంది. కిటికీ తలుపు ఒక్కటే తెరచి వుంచి, ప్రక్క మీదే ఉత్తరం రాస్తూ కూర్చుంది.

జానకికి కమలను కూర్చో బెట్టి మాట్లాడాలనీ విషయం తెలుసు కోవాలనీ మహా తహతహగా వుంది. సురేష్ వెళ్ళి పోయాడు. ఇదే సమయం అనుకుంది. నెమ్మదిగా అడుగులేసి వస్తే – వీధి తలుపు గడియ వేసి వుంది. అటు వెళ్ళి చూస్తే –పెరటి తలుపూ వేసి వుంది. ఏం చేస్తోందో కమల ! జానకి తన పడక గదిలోకి వచ్చి – తలుపు రంధ్రం గుండా గమనించింది.

కమల పక్క మీద కూర్చుని ఏదో రాస్తోంది "ఏమిటో అది. . . .!"

అంతలో తలుపు కొట్టిన శబ్దం ! కమల లేచి వెళ్ళి తలుపు తీసింది . . . .

హనుమంతే ప్రవేశించాడు.

"ఏం లేదు చెల్లాయ్ ! మీ మీ మామగారు అదే , సురేష్ తండ్రి గారు మీరు ఎల్లా వున్నారో చూసి రమ్మంటేనూ, సరేనని వచ్చాను. ఎల్లా వున్నారూ ? అంతా బాగున్నారా?

"ఆ"

"సురేష్ అఫీసు కెళ్లాడా?"

"ఊఁ"

"మీ మామగారితో . . . . అదే సురేష్ తండ్రి గారితో, మేమంతా వేంతో చెప్పి చూశాం ! ఉహు ! ఏం లాభం ఆయన మొండితనం ఆయన్ది ! ఆయన కిష్టం లేదు. ఇకనంతా అంతే 'నువ్వు మెదలకుండా, నీ పుట్టింటి కళ్ళిపోవాలి. ఏమీ జరగనట్లు – ఎవరిదోవ వారు చూసుకోవాలి . ఇల్లా స్వతంత్రించటానికి పెద్దవాళ్ళు ఉన్నారనా ! చచ్చారనా!' అంటాడు. ఎంతసేపు అదేమాట ! నిజానికి ఆ మాటా నిజమే ! ఇదిల్లా జరక్కపోతే సురేష్‌కి ఏభైవేల కట్నంతో పెళ్లి అవుతుంది. కట్నమే ముఖ్యం కాదనుకున్నా, ఆస్తి అంతస్తులు అంటూ వున్నాయిగా!

కమలేమీ మాట్లాడలేదు.

"ఇంతకీ ముహూర్తం ఎప్పుడు పెట్టావ్ ? నీ యిష్టమేమిటో – చెప్పొచ్చు – నాతో . . . . . ఎంత కాదన్నా – మీ యిద్దరి పక్షం వాణ్ణే నేను .– "

"ముహూర్తం తెలుసుకోటానికేగా మీరొచ్చింది?"

"కాదు . . . . అది తెలుసుకురమ్మని ఆయన నన్ను పంపించారు. ఈ ఊళ్ళో నా కోసం చాలా మంది కాపలా తిరుగుతున్నారు. అయినా హనుమంతుడంతటి వాణ్ణి గనక – ధైర్యం చేసివచ్చాను."

"అయితే ముహూర్తం ఇవ్వాళే."

"ఇవ్వాళా! ?"

"ఇవ్వాళే."





"అహహ ! మరేం తొందర లేదు. నెమ్మదిగానే వెళ్ళవచ్చు. ఏ అల్లరీ చెయ్యకుండా వెళ్తే – నాలుగు నెలల్లో అంతా సమసి పోతుంది. అప్పుడు వేరే పెళ్ళి చేసుకుని ; హాయిగా కాపరాలు చేసుకోవచ్చు . . . ."

"అల్లాగే ! మీరిక వెళ్లండి."

"ఆ ! వెళ్తా ! ఏదీ ! కాఫీ వేళ యింకా కాలేదా?"

"లేదు."

"సరే ! వస్తా ! – ఏ అర్ధ రాత్రో రైలు ఎక్కావంటే , తెల్లారేసరికి యింటికి చేర్తావు. నాలుగు రోజులింట్లోనే వుంటే – 'ఇల్లా రానట్టే ! ఏమీ జరగనట్టే !' – అంతేగా!"

"అంతే."

"అయితే వస్తా."

ఉ58

"రాకండి ; నేనుండను."

"సరే , సరే!"

హనుమంతు వెళ్లాడు. మళ్ళీ కమల తలుపేసి, ఉత్తరం రాస్తూ కూర్చుంది.

"మై డియర్" అని ప్రారంభించింది. సంబోధన నచ్చ లేదు. కొట్టేసింది. మై డియర్ ఫ్రెండ్ . . . . సురేష్ తనకి వట్టి స్నేహితుడా ! అదీ నచ్చలేదు కొట్టేసింది.

"మై డియర్ సురేష్ !" ఉహూ ! కొట్టేసింది.

"సురేష్ గారికి . . . ."

అది ఫర్వా లేదు. బాగానే వుంది. ఉత్తరం ముందుకు సాగింది.

అంతా – జానకి జాగ్రత్తగా – రంధ్రం గుండా – చూస్తూనే వుందింత సేపూ ! . . . . వింటూనే వుంది. మాటలన్నీ . . . కొంత సందర్భం అర్థమయిందీ – కొంత కాలేదు. ఏం రాస్తోందో కమల !

కమల రాస్తూనే వుంది ఏదో. వాక్య వాక్యానికీ ఆలోచన – అక్షరమక్షరానికీ ఆలోచన.

సురేష్ గారికి –

మిమ్మల్ని విడిచి, ఇవ్వాళ నేను వెళ్లిపోతున్నాను. ఈ కొద్ది కాలంలో జరిగిన ముద్దు మురిపాలన్నింటి వల్లా నాజన్మ ధన్యమయింది. మరి నేను కృతజ్ఞురాలనో ! కృతఘ్నురాలనో ! నూరేళ్ళ పంటా, కొద్ది నెలల్లోనే అనుభవించిన ఆశపోతునో ! ఏమో!

ఇక నన్ను ఎప్పటికీ మరచి పోవటమే మంచిది నాకూ, మీకూ.

మనల్ని విడదీస్తున్నది కులం కాదు ; మతం కాదు. కుల మతాల విద్వేషాల క్కూడా మూలకారణం ఆర్థికమైన అంతస్థులే ! దీనికి నేనెవ్వరినీ



నిందించలేను. అనవసరం. ప్రస్తుతం మన దేశంలో – రూపాయి చేతిలో వున్న వాడూ – లేని వాడూ – రెండే కులాలు. చేతిలో రూపాయి వుంటే చాలు. ఈ కుల బేధానికి.

ఈ కొద్ది కాలంలో స్వర్గాన్నే అనుభవిచాం – ఒకరి ఒళ్లో ఒకళ్లం. ఒకరి సాన్నిధ్యంలో ఒకళ్ళం. ఈ మధుర స్మృతులే చిరకాలం నిలిచిపోవాలి. నిలుపుకుందాం ! చివరికి మిగిలేది అదొక్కటే . . .

ఉత్తరం పూర్తి చేసినట్లుంది – కమల – – నిమిష నిమిషానికి కళ్ల వత్తుకుంటూ – – – ఉత్తరం మీద కన్నీళ్లు వలక కుండా ! ఉత్తరం తడవకుండా !

తర్వాత ఆ ఉత్తరం మడిచింది.

తర్వాత వంటిల్లంతా వెతికి, ఒక ప్లాస్టిక్ తాడు పట్టుకొచ్చింది. ఎల్లా దాన్ని పైకెక్కి కట్టటమా అని ఉపాయం కోసం వెతుకుతోంది.

ఇదంతా ఏమిటో జానకికి చాలాసేపు అర్థం కాలేదు. ఇప్పుడు ? ఏమో! ఏమైనా తను . . . . ఏదో – చెయ్యాలి. చెయ్యక తప్పదు.

"కమలా ! కమలా ! కమలమ్మా . . . " మధ్య తలుపులు గబగబా బాదేసింది. తనవైపు గడియ తీసింది. తలుపు అటూ వైపు కూడా వేసి వుంది. అది తియ్యాలి "తలుపు తియ్యి – ఒక్కసారి!"

కమల చేతిలో తాడు అవతల పడేసి – గొళ్లెం తీసింది.

జానకికి కమల చేతిలో చూసిన తాడు కనిపించలేదు. కుర్చీపీట మాత్రం గది మధ్యలో – ఫాన్ కిందికి లాగి వుంది. కమల మొహంలో రక రకాల భావాలు – ఖంగారు ; ఆయాసం , భంగపాటు.

"ఏం చేస్తున్నావ్ ! ఒంటరిగా – తలుపులేసుకుని . . .?"

కమల మాట్లాడలేదు – సరిగ్గా.

"ఉత్తరాలు రాస్తున్నావా ? మీ నాన్నగార్కి . . . " లెటర్ పాడ్ పెన్ను కూడా ఇంకా పక్క మీదే వున్నాయి.

"ఆ ! ఏదో రాద్దామని . . . " కమల అర్థోక్తిగా ఆగిపోయింది.

"అయితే రాసుకో పాపం . కాని మీ యింట్లో తాడేమన్నా వుందా ? ప్లాస్టిక్ది వుంటే కావాలమ్మా – కొంచెం . . . . ."

"భగవాన్" అన్నట్లు నిట్టూర్చిందొక్కసారి కమల . . . .

తర్వాత తలవంచి – లోపలికి వెళ్ళి, తాడు తెచ్చి యిచ్చింది – మెదల కుండా కళ్ళల్లో నుడిగుండాలతో –

"ఇవ్వాళా, రేపూ దీన్ని మాయింట్లో వుంచుకుంటాను. పని అవగానే తిరిగి ఇస్తాను. ఏం ?"

"అల్లాగే!"

"ఊ ! ఇంకా ఏమిటి కబుర్లు ! ఈ పిల్లలు ఇవ్వాళ రాలేదా ?" అన్య మనస్కంగానే కమల ఏదో జవాబివ్వక తప్పలేదు.

ఏవో కబుర్లల్లో దిగకా తప్పలేదు.

## 19

ఎంతసేపయినా జానకి కమలను వదిలిపెట్టి వెళ్లలేదు. కబుర్లతోనే కాలక్షేపం చేసింది. ఏవేవో కబుర్లు. అనవసరమైన కబుర్లు !

"మీరీ ఊరొచ్చిన తర్వాత మీ అమ్మగారు గానీ - మీ నాన్న గారు గానీ ఈ వూరు రాలేదూ ; చూసి పోలేదేం?"

"వాళ్ళు రారు."

"అందుకే మీరేదో బెంగగా వున్నారు. పోనీ వెళ్ళి ఒక్కసారి చూసి రారాదూ. - ఏ సాయంకాలం బండికో. రేపు ఆదివారం గూడానూ."

"ఆ . . . . అవును . . . . కానీ . . . ."

"ఏం ఫర్వాలేదు. సురేష్‌గారితో కావాలంటే నేనే చెప్తాను. ఓసారి పుట్టింటికి పంపమని. . . . "

"కాని . . . ?"

"పంపరా ?"

"పంపిస్తారు . కానీ . . . వాళ్లు నన్ను రానిస్తారో ! రానివ్వరో . . . ."

"ఏం రానివ్వక ?"

" మీకు తెలియదు . . . . కాని . . . . మేం పెళ్లి చేసుకున్న భార్యాభర్తలం కాదు."

"ప్రేమపెళ్ళేగా."

"మరే ; మా నాన్నగారు చాలా బీదవారు. పెళ్ళి చేసే స్తోమతు కూడా లేదు కాని . . . అభిమానంతో ఈయనతో పెళ్లి అంగీకరిస్తారో ! అంగీకరించరో! పైగా చెప్పకుండా వచ్చేశాను గదా ! " కమల కళ్ళ నీళ్లు పెట్టుకుంది.

"మరేం ఫర్వాలేదు. పెళ్ళి చేసే స్తోమత లేకపోయినా, మన వాళ్ళల్లో ఈ దురభిమానాలెక్కువే ! కాని ఇల్లా పెళ్లి చేసుకున్నామని వెళ్లి చెపితే- మొదట ఏవేవో మాటలు దురభిమానంతో అన్నా - తర్వాత సర్దుకుంటారు. ఫర్వాలేదు. ఒక్కసారి ఇద్దరూ వెళ్ళి రండి . ఫర్వాలేదు. సాయంకాలమే బండి వుంది ! సాయంకాలమే . . " ఇది రెండోసారి జానకామాట అనటం . . .!! ఎందుకో ! ఏదో అసందర్భంగానే . . . . . . . . . . . . . .

తను ఈ వూరు వచ్చిన రోజు జ్ఞాపకం వచ్చింది.

ఆవేళ ప్లాట్ ఫారం మీద దిగగానే . . . . విన్న మాట ! రైలుక్రింద పడిన - స్త్రీ ! సురేష్ పడిన ఖంగారు!



అన్నీ ఒక్కసారి కళ్ల ముందు తిరిగాయి "అదే మంచిది. రైలు కిందకి వాలిపోతే . . . . గుక్కెడు ప్రాణానికి, ఒక్క 'సెకను' చాలు"

అదే ఆలోచిస్తూ కమల మొహం వాడి పోయింది.

"అదే మంచిది !" అన్నది.

"మరి - వెళ్తారా ! - సాయంత్రం?"

"వెళ్తాను. రెలుకి . . . ."

"నన్ను సురేష్ గారితో చెప్పమంటారా? అయిదు గంటలకి వస్తారుగా"

' ఇప్పుడు మూడు గంటలేగా అయిందీ ?"

"అవును సర్దుకోటానికి చాలా టైం వుంది."

"సర్దుకోటానికి ఏమీ లేవు . . . . బయలు దేరటమే!"

"డబ్బేమన్నా కావాలంటే . . . నేనిస్తాను."

"డబ్బెందుకూ . . . . అక్కర్లేదు."

"మరి, మీ అత్తగారినీ, మామగారినీ కూడా చూసి రారా?"

"అక్కడికే నేను వెళ్తున్నది !"

"అహ ! ఇద్దరిదీ ఒకే వూరు కాబోలు !"

"ఆ అవును . . . . ఇద్దరిదీ . . . ఒక వూరే!"

కమల జవాబు లేవో - ఏదోగా వున్నాయి గానీ - సంతృప్తిగా లేవు. మనసులో ఏదో సముద్రం - ఏదో తుఫాను పెట్టుకుని మాట్లాడుతున్నట్లుంది గానీ . . . ఎంత కదిలించి - కుదిపి చూసినా బెదిరిపోయిన మనస్సు కుదుట పడేటట్లు లేదు. తను వెళ్తే . . కాసేపు ప్రశాంతంగా వుండి - స్వస్థత చిక్కుతుందేమో ! చూద్దాం " అనుకుంది జానకి. తాడు చేత్తో పుచ్చుకుని వెళ్లి పోతూ - "ఈ తాడు నేను తీసుకెళ్తున్నాను. మళ్ళీ దీని కోసం వెతుక్కోకు " అన్నది.

జానకి వెళ్లి పోయింది - మధ్య తలుపేసుకుని.

కమలకి రెలు ఆలోచన తప్ప మరో ఆలోచన లేదు.

ఈ ఇంటికి సరాసరి వెళ్తే - పక్కకు తిరిగితే - ఇంక పట్టాలే ఎదురు .సరిగ్గా సురేష్ ఇంటికి వచ్చే వేళకి - సరిగ్గా ఒక రైలు వస్తుంటుంది ! దేముడంతా లెక్కలు సరిపుచ్చుకునే రాసి పెట్టినట్లున్నాడు.

సరిగ్గా అయిదింటికి బయలు దేరితే . . . . అయిదుంబావుకి తనెక్కడో . . . ఈ సురేష్ ఎక్కడో . . . ఈ ప్రపంచం ఎక్కడో . . . . అమాంతంగా "కూ " అని శబ్దం "చికు చికు" మంటూ రోడ్డు మీద నుంచి పిల్లలు రైలాటగా లోపలికి పరుగెత్తుకు వచ్చారు. అదిరి పడి లేచి కూర్చుంది కమల. పది మంది పిల్లల రైలు - కిటికీ ప్రక్కగా పెట్టె పెట్టె కదిలిపోయింది!

తన రైలు కాదది ! పిల్లలరైలు ! తనకి పనికి రాదు. ప్లాట్ ఫారం మీద

ప్రయాణికుడి లాగా, నిరాశ పడి, మళ్ళీ కమల మేను వాల్చింది పక్క మీద!

గడియారం అంకెల మీద - సిగ్నల్ యివ్వని చోట వత్తి గూడ్సు బండి లాగ - తలకు మించిన బరువు మోస్తున్న పల్లెటూరి నిద్రమత్తు రైల్వే పోర్టర్ లాగ . . . ముళ్లు బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ నడుస్తున్నాయి. ప్రపంచంలో ఎవ్వరికీ లేదేమో - కమలకి తప్ప అతి కష్టం మీద నాలుగయింది.

మరింత కష్టం మీద ఆ నాలుగున్నర అయింది. కమల లేచి - యథాలాపంగా తల దువ్వి బొట్టు పెట్టుకోబోయింది.

"ఎవరి కోసం ఇంకా ఈ అలంకారాలు !" అనిపించింది. చావబోతున్న దానికింక ఈ అలంకారాలు తక్కువా ? ఉత్తరం పక్క మీద వుంచింది. కాసేపు సురేష్ ఫొటో ముందు కూర్చుంది. ఆఖరుసారి ముద్దు పెట్టుకుంది. నెమ్మదిగా బయటకి నడిచింది - తలుపు తాళం వేసి . . . తాళం చెవ్వి కిటికీలో పెట్టింది . . . . గేటు దాటబోతుంటే హఠాత్తుగా అతి వేగంగా పిల్లల రైలు ఎదురు వెళ్ళింది - తటాలున తప్పుకుంది కమల.

తప్పుకున్నందుకు తనే ఒక్కసారి నవ్వుకుంది. ప్రాణాలంటే ప్రాణాలకి ఎంత తీపి !!!!

గబగబా రోడ్డు వెంట - రైలు పట్టాల వంక నడుస్తుంటే . . . కమలకు ఒక్కటే తొందర . . . . అడుగుల తడబాటు ' ఈ కాసేపు సురేష్ యింటికి రాకూడదు. తనను చూడ కూడదు. రైలు ఇవ్వాళ్లన్నా తొందరగా రావాలి - ఏ లేటూ లేకుండా !' రైలు వచ్చేదాకా ఆగి సిగ్నల్ కేబిన్ ప్రక్కగా చేరింది కమల. నిండా ముసుగు కప్పుకుని కేబిన్ ప్రక్క సక్క నుంచుంది - రాబోయే రైలు కోసం ఎదురు చూస్తూ.

సిగ్నల్ యిచ్చారు. కాసేపటికి దూరాన 'కూత' కూడా స్పష్టంగా వినిపించింది. ఇక ఫర్వాలేదు అనుకుంది. కమల - పట్టాల ప్రక్కగా నడుస్తూ - ఎదురు వెళ్ళి పక్కకి ఒరిగి పోవటమే !

మలుపు తిరిగి వస్తున్న రైలు యింజను ప్రత్యక్షమౌతున్న దేముడిలాగ కనిపించింది . . . . ఎదురు నడక మొదలయింది. ఎదురు చూసిన ఘడియ దగ్గర పడ్తోంది.

అంతలో . . . . 'కమలా !' అన్న సురేష్ కేక ! స్కూటర్ మోత ! పిల్లల అరుపులు . . . . .

వీళ్ల కెల్లా తెలిసిందప్పుడే ! సురేష్ ఇంటికి వచ్చాడే అప్పుడే !సురేష్ ముందొచ్చాడా ? రైలు లేటుగా వచ్చిందా ? ఆలోచిస్తూనే పరుగు మొదలు పెట్టింది కమల .

"కాదు ? ఈ రోజునే కథంతా అంతం కావాలి . దుర్భరమైన ఉదంతం మంతా ఇవ్వాళే . . . . ."



కమల పరుగెత్తింది. రైలు ఎదురు వచ్చేస్తోంది. సురేష్ స్కూటర్ వస్తోంది - స్కూటర్ వెనక రంగడు - వెనక పిల్లలందరూ . . . . .

"కమలా . . . . కమలా . . . కమలా !" రైలింజను ముప్ఫై గజాల ముందు వుంది కమల . కమల వెనక సురేష్ పది గజాలలో వున్నాడు. కమల మీద ఆశ వదులుకున్నా - దుఃఖంతో అరుస్తున్నాడు. అరుస్తూ దుఃఖిస్తున్నాడు.

మృత్యు దేవతకీ - కమలకీ మధ్య దూరం తరిగి తరిగి పోతోంది.

వొరిగి వొరిగి పోతోంది - పట్టాల మీద కమల!

స్కూటర్ మీద నుంచి, రంగడు దూకేసాడు. దూకిందే తడవుగా - ఒక రాయి చేత బుచ్చుకుని, కమల మీదకు విసిరేశాడు. కమల కాళ్ళకి కొట్టుకుని కాళ్లు తడబడ్డాయి.

కమల పట్టాల మీద పడిపోయింది.

ఇక దేముడే రక్షించాలి కమలను . . . . . . . . . . . . . . . . . . . .

దేముడే రక్షించాడు కమలను.

కమల ముందు - రెండు మూడు గజాల దూరంలో పట్టాలు చీలి, రైలు మరో లైను మీదికి తిరిగి పోయింది. వేగంగా పోయింది!

నడుస్తున్న స్కూటర్ మీంచి దూకేశాడు సురేష్ - కమల ప్రక్క పడిపోయాడు. రైలు యిద్దరి కళ్ల ముందు ముందుకెళ్లి పోయింది.

పట్టా మీద పడిన కమలను ఒళ్లోకి తీసుకుంటూ . . . . . సురేష్ అన్నాడు "కమలా . . . . కమలా ఎందుకింత పని చేశావ్ కమలా ?"

"మీరెందుకు వెంట వచ్చారు?"

రైలు పట్టాలు తప్పి ప్రాణాలు రక్షించింది. ఘోరమైన ప్రమాదం చిన్న చిన్న దెబ్బలతో తప్పి పోయింది.

ఆ రాత్రి, కమలా సురేష్‌లను గదిలోనే బంధించి, తాళం వేసేసింది జానకి . మరునాటి ఉదయం వరకూ తాళాలు తియ్యలేదు. రాత్రికి రాత్రే అందరికీ టెలిగ్రామ్‌లు వెళ్లాయి. తెల్లారగానే ఇరువైపుల్నించీ తల్లి తండ్రులు దిగారు. చుట్టు ప్రక్కల వారూ హరిహరం ఇంట్లో మూగారు.

అందర్నీ కూర్చో బెట్టి కాఫీ యిచ్చి - జానకి రాఘవేంద్రం గారినీ, కమల తండ్రినీ తల వాచేట్లు చివాట్లు పెట్టింది.

"ఇందాకా వస్తుందనుకోలేదన్నాడు " రాఘవేంద్రరావు.

"మరెందాకా వస్తుందనుకున్నారు ? ఇద్దరూ కూడబలుక్కుని ప్రాణాలు వదిలే దాకా తరుముదామనుకున్నారా? ఉన్నతమైన అంతస్థు కాదండీ మనిషి కోరుకునేది? ఉన్నతమైన మనస్సు. . ఆ లెక్క వేస్తే కమలకున్న మంచి మనస్సు మీకెవ్వరికీ లేదు."

"సరే ,. అంతా అయిపోయిందిగా ! ఇక తలుపుల తాళాలు తియ్యండి.

